



ESTD: 1999

www.voodayam.com

# వుదయం

సంపుటి : 27 | సంచిక : 220 | హైదరాబాద్ | 13-10-2026 మంగళవారం

SINCE 27 YEARS CIRCULATED TELUGU DAILY

రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously Published from Hyderabad, Adilabad, Karimnagar, Khammam, Guntur & Warangal

Follow us on





## మోదీ అధికారం కోసం ఓటర్ల తొలగింపు

**జనాభా పెరుగుతున్నా ఓటర్లు ఎందుకు తగ్గుతున్నారు?**




**న్యూఢిల్లీ, అక్టోబర్ 12 (ఎఎంస్) :** భారత రాజ్యాంగం దేశ పౌరులందరికీ ఓటు హక్కు కల్పించిందని, అయితే ప్రస్తుతం ఆ హక్కును లాక్కోవడానికి 'ప్రత్యేక సమగ్ర సవరణ' (ఎస్ఐఆర్) ప్రక్రియను వినియోగిస్తున్నారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. జాతీయ రాజధానిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ప్రజలకు ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా 'ఎస్ఐఆర్' ప్రక్రియను నిర్వహించేవారని, కానీ నేడు ప్రజల ఓట్లను తొలగించడానికే దానిని వాడుకుంటున్నారని రేవంత్‌రెడ్డి విమర్శించారు. "కేంద్రంలో తన అధికారాన్ని కాపాడుకోవడానికి నరేంద్ర మోదీ గతంలో కేంద్ర దర్యాప్తు సంస్థలను, ఆదాయపు పన్ను రంగాన్ని ఉపయోగించుకున్నారు. ఇప్పుడు వాటితో సాధ్యపడకపోవడంతో ఎన్నికల సంఘాన్ని వాడుకుంటున్నారు. భాజపా విధానాలను వ్యతిరేకించే వారి ఓట్లను తొలగించడానికే ఈ 'ఎస్ఐఆర్' సవరణలను తెచ్చారు. వ్యతిరేక ఓట్లను తొలగించే బాధ్యతను ముఖ్య ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌కు అప్పగించారు. ముఖ్యంగా యువత, నిరుద్యోగులు, పేదలు భాజపాను వ్యతిరేకిస్తున్నారని, వారి ఓట్లను తొలగించేందుకే జ్ఞానేశ్‌కుమార్ ప్రయత్నిస్తున్నారు" అని సీఎం పేర్కొన్నారు. ఎన్నికల సంఘం నిర్ణయాలపై తోటి ఎన్నికల కమిషనర్లు వ్యతిరేకత వ్యక్తం చేశారని, జ్ఞానేశ్‌కుమార్ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని స్పష్టమవుతోందని రేవంత్‌రెడ్డి తెలిపారు. వివాదాస్పదంగా వ్యవహరిస్తున్న ఆ అధికారిని తొలగించడానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి ఉన్న అభ్యంతరం ఏమిటని ఆయన ప్రశ్నించారు. 'ఎస్ఐఆర్' అమలు చేయని రాష్ట్రాల్లో భాజపా ఓటమి పాలైందని, ఈ ప్రక్రియ నిర్వహించిన బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో మాత్రమే ఆ పార్టీ విజయం సాధించిందని ఆయన ఉదాహరించారు. దేశంలో జనాభా గణనీయంగా పెరుగుతున్నప్పుడు దానికి అనుగుణంగా ఓటర్ల సంఖ్య పెరగాలే తప్ప తగ్గడం వెనుక ఉన్న అంతరార్థం ఏమిటని రేవంత్‌రెడ్డి నిలదీశారు.

## ఢిల్లీని జైలుగా మార్చారు



**న్యూఢిల్లీ, అక్టోబర్ 12 (ఎఎంస్) :** ముఖ్య ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలో సోమవారం అత్యున్నత న్యాయస్థానం వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విలేకరులతో మాట్లాడారు. నిరసనల నేపథ్యంతో రాజధాని నగరంలో ఆంక్షలు విధించడం, రాకపోకలను అడ్డుకోవడంపై ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 'ఓట్ల అక్రమాల' అంశంపై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌ను కలిసేందుకు సమయం కోరినప్పటికీ అనుమతి లభించలేదని రాహుల్ గాంధీ తెలిపారు. న్యాయవ్యవస్థపై ఎవరు ఒత్తిడి తెస్తున్నారని ఆయన ఆరా తీశారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తీవ్ర ఒత్తిడిలో ఉన్నారనే విషయం ఆయన పంపుతున్న వర్తమానాల ద్వారా తెలుస్తోందని పేర్కొన్నారు. ఈ పరిస్థితి నుంచి బయటపడాలంటే ఆయన వెంటనే అప్రూవర్‌గా మారి, పదవికి రాజీనామా చేయాలని సూచించారు.భాజపా పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్న రాహుల్ గాంధీ, కాక్రోచ్ జనతా పార్టీ ఆందోళనల దృష్ట్యా నగరంలో భయాందోళనలు సృష్టించారని ఆరోపించారు. ఢిల్లీ రోడ్లపై సుమారు ముప్పై వేల మంది పోలీసులను మోహరించి, నగరాన్ని ఒక జైలులా మార్చాల్సిన అవసరం ఏమిటని నిలదీశారు. ఆర్ఎస్ఎస్ ప్రతినిధులకు ఉన్న స్వేచ్ఛ సాధారణ యువతకు, మహిళలకు ఎందుకు లభించడం లేదని ప్రశ్నించారు. సీఈసీ పదవికి జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఎన్నికల వ్యవస్థలో జరుగుతున్న తీవ్ర అక్రమాలను భారత ప్రధాన న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లాలని భావించినా, ప్రత్యక్ష భేటీకి అనుమతి లభించకపోవడంతో సుప్రీం కోర్టులోనే పిటిషన్ దాఖలు చేయాలని నిర్ణయించినట్లు ఆయన వివరించారు.ప్రస్తుతం ఒకవైపు దేశ ప్రజలు, ప్రతిపక్షాలు ఉంటే.. మరోవైపు నరేంద్ర మోదీ, అమిత్ షా, అజిత్ ధోబాల్, జ్ఞానేశ్ కుమార్, మోహన్ భాగవత్ ఉన్నారని రాహుల్ గాంధీ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వంలోని రెండు వందల మంది అధికారులు తమతో సంప్రదింపుల్లో ఉన్నారని తెలిపారు. ఇది ఏ ఒక్కరి వ్యక్తిగత పోరాటో కాదని, దేశ యువత భవిష్యత్తు మరియు రాజ్యాంగ పరిరక్షణ కోసం జరుగుతున్న ఉద్యమమని వ్యాఖ్యానించారు. బాధ్యులైన వారిపై విచారణ జరిగి, ఎన్నికల వ్యవస్థ శుద్ధి అయ్యేంత వరకు వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు.

## సుప్రీం కోర్టును రాజకీయాల్లోకి లాగొద్దు

**ప్రశ్నించే హక్కు అందరికీ ఉంది**

**విపక్షాల భేటీ అభ్యర్థన నిరాకరణ**

**ఇండియా కూటమి నేతలకు సీజేఐ జస్టిస్ సూర్యకాంత్**



**న్యూఢిల్లీ, అక్టోబర్ 12 (ఎఎంస్) :** ఎన్నికలలో 'ఓట్ల అక్రమాల' అంశంపై వినతి పత్రం ఇచ్చేందుకు అనుమతించాలని ఇండియా కూటమి నేతలు కోరినప్పటికీ, దానికి సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నిరాకరించారు. ఈ నిర్ణయానికి గల కారణాలను వివరిస్తూ ఆయన కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీలకు విద్యుత్ తపాలా (ఈమెయిల్) ద్వారా లేఖ రూపంలో సందేశం పంపినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ప్రధాన న్యాయమూర్తి, ముఖ్య ఎన్నికల కమిషనర్ వ్యవహారానికి సంబంధించిన అంశాలపై ఇప్పటికే అత్యున్నత న్యాయస్థానంలో విచారణ కొనసాగుతోందని గుర్తుచేశారు. ఒక విషయం న్యాయస్థాన పరి పరిశీలనలో ఉన్నప్పుడు దాని గురించి వెలుపల ఇతరులతో చర్చించడం రాజ్యాంగబద్ధమైన 'అధికార విభజన' సూత్రానికి, న్యాయవ్యవస్థ నియమావళికి విరుద్ధమని తెలిపారు. ప్రతిపక్ష నేతలు లేఖలో లేవనెత్తిన అంశాలను పరిష్కరించడానికి సుప్రీంకోర్టుకు ఎటువంటి పాలనాపరమైన అధికారాలు లేవని ఆయన స్పష్టం చేశారు. అదే సమయంలో, రాజ్యాంగంలోని ముప్పై రెండవ ప్రకరణ ప్రకారం పౌరుల ప్రాథమిక హక్కులకు భంగం కలిగే విషయాలను పరిశీలించే అధికారం న్యాయస్థానానికి ఉందన్నారు. ప్రతిపక్షాలు తమ సమస్యలపై నేరుగా పిటిషన్ దాఖలు చేయవచ్చని, న్యాయస్థాన తలుపులు అందరి కోసం ఎల్లప్పుడూ తెరిచే ఉంటాయని సూచించారు. అయితే, అత్యున్నత న్యాయస్థానాన్ని రాజకీయ వివాదాల్లోకి లాగడానికి ప్రయత్నించవద్దని హెచ్చరించారు. మరొక కార్యక్రమంలో జాతీయ మానవ హక్కుల కమిషన్ నిర్వహించిన సమావేశంలో సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ పాల్గొన్నారు. 'నీరు జీవనామృతం' అనే అంశంపై మాట్లాడుతూ, కలుషిత నీటి వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న తీవ్రమైన ఆరోగ్య సమస్యలపై ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల రాజ్యాంగ హక్కులను కాపాడటానికి స్వచ్ఛమైన మంచినీటిని అందించడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు నీటి నిర్వహణ వ్యవస్థలను సమర్థంగా ఏర్పాటు చేయాలని, హక్కులకు భంగం వాటిల్లినప్పుడు న్యాయస్థానాలు జోక్యం చేసుకుంటాయని స్పష్టం చేశారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై మానవ హక్కుల కమిషన్లు వేగంగా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

## రాజ్యాంగం అంటే ప్రదర్శన వస్తువు కాదు




**న్యూఢిల్లీ, అక్టోబర్ 12 (ఎఎంస్) :** భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)ని కలిసేందుకు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ యత్నించడంపై భారతీయ జనతా పార్టీ (భాజపా) సోమవారం తీవ్రస్థాయిలో ధ్వజమెత్తింది. రోజువారీ రాజకీయ వివాదాలకు, పోరాటాలకు అత్యున్నత న్యాయవ్యవస్థ దూరంగా ఉండాలని పేర్కొంది. ఈ వ్యవహారంపై భాజపా అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా స్పందించారు. "అధికార విభజన సూత్రం నుంచి అధికార దాహం వరకు.. రాహుల్ గాంధీ రాజ్యాంగ చట్టానికి, రాజకీయ నాటకాలకు మధ్య ఉన్న తేడాను మరచి గందరగోళానికి గురవుతున్నారు" అని ఆయన విమర్శించారు. రాహుల్ గాంధీ మరియు ఇతర ప్రతిపక్ష నాయకులను కలిసేందుకు సీజేఐ నిరాకరించడం ద్వారా ఒక స్పష్టమైన సందేశం లభించిందని, న్యాయవ్యవస్థ రాజకీయ పోరాటాలకు అతీతంగా నిలవాలని భాటియా స్పష్టం చేశారు. రాజ్యాంగబద్ధమైన సంస్థలను రాజకీయ నాటకాల్లోకి లాగకూడదని ఆయన హితవు పలికారు.రాహుల్ గాంధీపై దాడిని తీవ్రతరం చేస్తూ.. కేవలం రాజ్యాంగ ప్రతిని చేతిలో పట్టుకుని తిరిగినంత మాత్రాన రాజ్యాంగాన్ని అర్థం చేసుకున్నట్లు కాదని గౌరవ్ భాటియా వ్యాఖ్యానించారు. "రాజ్యాంగాన్ని చదవండి, గౌరవించండి, అలాగే అధికార విభజన సూత్రాన్ని తెలుసుకోండి. రాజ్యాంగం అనేది పాలనకు మార్గదర్శి మాత్రమే గానీ, రాజకీయ ప్రదర్శనలకు వాడే సాధనం కాదు" అని ఆయన స్పష్టం చేశారు.

## ఫార్ములా ఈ కేసు కేటీఆర్ డిశ్చార్జ్ పిటిషన్



**హైదరాబాద్, అక్టోబర్ 12 (వుదయం) :** ఫార్ములా ఈకార్ రేసు వివాదానికి సంబంధించి నాంపల్లిలోని అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) ప్రత్యేక న్యాయస్థానంలో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ విమోచన (డిశ్చార్జ్) పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితుల జాబితా నుంచి తన పేరును పూర్తిగా తొలగించాలని ఆయన న్యాయస్థానాన్ని కోరారు. కేటీఆర్ దాఖలు చేసిన ఈ విజ్ఞప్తిపై తమ సమాధానం (కౌంటర్) సమర్పించాలని అవినీతి నిరోధక శాఖ అధికారులను న్యాయస్థానం ఆదేశించింది. అనంతరం ఈ డిశ్చార్జ్ పిటిషన్‌పై తదుపరి విచారణను ఈ నెల ముప్పైవ తేదీకి వాయిదా వేస్తున్నట్లు న్యాయమూర్తి ప్రకటించారు. కాగా, ఈ రేసు కేసుకు సంబంధించి ఏసీబీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో కేటీఆర్‌ను మొదటి నిందితుడిగా (ఏ1) చేర్చిన విషయం తెలిసిందే.

## తాగునీటిని బీరు ఫ్యాక్టరీలకు మళ్లిస్తున్నారు

**రేవంత్‌రెడ్డి వైఫల్యంతోనే విద్యుత్ కోతలు**

**కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీశ్‌రావు తీవ్ర విమర్శలు**



**హైదరాబాద్, అక్టోబర్ 12 (వుదయం) :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విఫల పరిపాలన వల్లే రాష్ట్రంలో విద్యుత్ కోతలు ఏర్పడ్డాయని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ విధానాల వల్ల రాష్ట్రంలోని రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు హరీశ్‌రావు విమర్శించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వానికి రైతుల ప్రయోజనాల కంటే ముఖ్యమైన అంశం ఏముంటుందని హరీశ్‌రావు ప్రశ్నించారు. దేవాదుల, కల్వకుర్తి ఎత్తిపోతల పథకాల ద్వారా నీటిని ముందే నిల్వ చేసి ఉంటే ప్రస్తుత కరువు పరిస్థితులు వచ్చేవి కావని పేర్కొన్నారు. వాతావరణ మార్పుల ముప్పు ఉందని తెలిసినప్పటికీ నీటిని ఎత్తిపోసే చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. సింగూరు జలాశయానికి బాగుచేసే పనులు చేపడతామని చెప్పి ఏకంగా ఇరవై తొమ్మిది టీఎంసీల నీటిని ఖాళీ చేశారని, కానీ పనులు ప్రారంభించకుండానే ప్రాజెక్టును వదిలేశారని మండిపడ్డారు. హైదరాబాద్, రంగారెడ్డి, కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్ జిల్లాలకు తాగునీరు అందించే ఈ కీలక జలాశయం పట్ల తీవ్ర నిర్లక్ష్యం వహించారని ధ్వజమెత్తారు. ప్రస్తుతం సింగూరు ప్రాజెక్టులో కేవలం మూడు టీఎంసీల నీరు మాత్రమే లభ్యతగా ఉన్నప్పటికీ, దానిని మద్యం తయారీ కర్మాగారాలకు ఇస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. సాధారణ ప్రజల తాగునీటి అవసరాల కంటే మద్యం తయారీ సంస్థలపైనే ప్రభుత్వానికి ఎక్కువ ప్రేమ ఉందన్నారు. మద్యం సరఫరాదారులకు నీటి కొరత రాకూడదని అబకారీ మంత్రి మాట్లాడటం శోచనీయమని, ప్రజల తాగునీటిని మద్యం సంస్థలకు మళ్లిస్తున్న ప్రభుత్వాన్ని ప్రజలు క్షమించరని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఇంతే కదా...!




## ఇంధన కేంద్ర్రాలపై దాడుల నిలిపివేత ఒప్పందం

**వాషింగ్టన్:** రష్యా, ఉక్రెయిన్ దేశాల మధ్య ఇంధన వనరుల ఆధారిత దాడుల నిలిపివేత ఒప్పందం తక్షణమే అమల్లోకి వచ్చినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదివారం ప్రకటించారు. విద్యుత్తు, చమురు, వాయువు (గ్యాస్) వంటి కీలక ఇంధన మౌలిక సదుపాయాలపై పరస్పరం దాడులు చేసుకోకూడదని ఇరు దేశాల ప్రతినిధులు అంగీకారానికి వచ్చారని ఆయన తెలిపారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ఈ ప్రకటనపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ స్పందించారు. ఈ విషయం గురించి తనకు ముందస్తు సమాచారం లేదని, వార్తా ప్రసార సాధనాల ద్వారానే తనకు తెలిసిందని చెప్పారు. అయితే దీనిని స్వాగతించదగ్గ మంచి పరిణామంగా అభివర్ణించారు. ఈ దాడుల నిలిపివేత ఒప్పందానికి రష్యా నిజాయితీగా కట్టుబడి ఉంటే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. మాస్కో దళాలు తమ దేశపు ఇంధన కేంద్రాలపై దాడులను తక్షణమే నిలిపివేస్తే, తాము కూడా రష్యాలోని చమురు శుద్ధి కర్మాగారాలపై దాడులు చేయడం ఆపివేస్తామని జెలెన్‌స్కీ వెల్లడించారు. ఉద్రిక్తతలను తగ్గించే దిశగా ఇరువైపుల నుంచి సమానమైన చర్యలు ఉన్నప్పుడే శాంతి దిశగా అడుగులు పడతాయని అభిప్రాయపడ్డారు. అయితే డొనాల్డ్ ట్రంప్ చేసిన ఈ ప్రకటనపై రష్యా ప్రభుత్వం ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. అంతేకాకుండా ఈ ప్రకటన వెలువడిన కొద్ది సమయానికే ఉక్రెయిన్‌లోని పలు ప్రాంతాలపై రష్యా దళాలు తిరిగి విరుచుకుపడటం గమనార్హం. దేశ రాజధాని కీవ్‌తో పాటు అనేక ఇతర ప్రాంతాలలోని విద్యుత్ కేంద్రాలపై ఆ మానవరహిత విమాన (డ్రోన్) దాడులు జరగడంతో తీవ్రంగా విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ వెల్లడించారు. ఖర్కీవ్ నగరంలో ఒక వ్యాపార సముదాయంపై జరిగిన దాడిలో ఆరుగురు పౌరులు ప్రాణాలు కోల్పోగా, ఇరవై మందికి పైగా గాయపడినట్లు వివరించారు. ఇప్పటికైనా రష్యా తన దాడులను నిలిపివేయకపోతే తీవ్ర పర్యవసానాలను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.



# చట్టాలపై అవగాహనతోనే నేరాల నివారణ



**నాగర్ కర్నూల్ రూరల్, అక్టోబర్ 12 (వుదయం ప్రతినిధి):**

చట్టాలపై ప్రతి ఒక్కరూ కనీస అవగాహన కలిగి ఉండాలని, న్యాయపరమైన హక్కులు, బాధ్యతలు తెలుసుకోవడం ద్వారా సమాజంలో నేరాలను అరికట్టవచ్చని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి నిహారిక అన్నారు. రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు నాగర్‌కర్నూల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం తూడుకుర్తి గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిహారిక మాట్లాడుతూ యువత ముఖ్యంగా మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ వినియోగం వల్ల వ్యక్తుల ఆరోగ్యమే కాకుండా కుటుంబాలు ఆర్థికంగా, మానసికంగా తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. యువత చెడు వ్యసనాలకు లోనుకాకుండా భవిష్యత్తుపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీ వంటి రహస్య సమాచారాన్ని అపరిచిత వ్యక్తులతో పంచుకోవద్దని, మోసపూరిత ఫోన్ కాల్స్, సందేశాల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు.

ఆర్థిక స్థోమత లేక న్యాయవాదిని నియమించుకోలేని అర్హులైన వారికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందిస్తామని పేర్కొన్నారు. న్యాయపరమైన సమస్యలు ఎదురైనప్పుడు ప్రజలు న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించి తగిన సహాయం పొందవచ్చని తెలిపారు. అనంతరం ప్రజల న్యాయపరమైన సందేహాలను అధికారులు నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీరామ్ ఆర్య, సర్పంచ్ లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి, గ్రామస్థులు పాల్గొన్నారు.

# గంజాయి అక్రమ రవాణాపై పోలీసుల ఉక్కుపాదం

- **రూ.71.40 లక్షల విలువైన 142.8 కిలోల ఎండు గంజాయి పట్టివేత ఇద్దరు అంతర్రాష్ట్ర నిందితుల అరెస్ట్.. రెండు కార్లు సీజ్**
- **కంది ఎక్స్‌రోడ్ వద్ద పోలీసుల తనిఖీలు.. ఒడిశా నుంచి గంజాయి తరలింపు**

**సంగారెడ్డి, అక్టోబర్ 12:వు దయం**

సంగారెడ్డి జిల్లాలో గంజాయి అక్రమ రవాణా గుట్టును పోలీసులు రట్టు చేశారు. పక్కా సమాచారంతో కంది ఎక్స్‌రోడ్ వద్ద చేపట్టిన వాహనాల తనిఖీల్లో భారీగా గంజాయి పట్టుబడింది. రెండు కార్లలో తరలిస్తున్న రూ.71.40 లక్షల విలువైన 142.8 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు, ఇద్దరు అంతర్రాష్ట్ర నిందితులను అరెస్ట్ చేశారు. అక్రమ రవాణాకు ఉపయోగించిన రెండు కార్లను సీజ్ చేశారు.జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఆదేశాల మేరకు సోమవారం సంగారెడ్డి ఎస్‌న్యాబ్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్‌రావు, సంగారెడ్డి రూరల్ సీఐ నయీముద్దీన్, ఎస్‌ఐలు మధుసూదన్‌రెడ్డి, శ్రీకాంత్, సంగారెడ్డి టౌన్ ఎస్‌ఐ వెంకటేశం తమ సిబ్బందితో కలిసి కంది ఎక్స్‌రోడ్ వద్ద తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో పటాన్‌చెరు నుంచి సంగారెడ్డి వైపు వస్తున్న హ్యుందాయ్ ఎక్సెంట్ (OD02BD7922), మారుతి సుజుకి ఫ్రాంక్స్ (OD02DJ9920) కార్లను తనిఖీ చేశారు.హ్యుందాయ్ ఎక్సెంట్ కారులో 35 ప్యాకెట్లలో తరలిస్తున్న 142.8 కిలోల ఎండు గంజాయిని గుర్తించారు. దీని విలువ సుమారు రూ.71,40,000 ఉంటుందని పోలీసులు అంచనా వేశారు. గంజాయిని స్వాధీనం చేసుకోవడంతో పాటు రెండు కార్లను సీజ్ చేసి, ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.ఒడిశాకు చెందిన ఇద్దరు అరెసట్ పోలీసులు అరెస్ట్ చేసిన నిందితులను ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లాకు చెందిన రోషన్ కర్జీ (26), బిబుధ రాజ్తా (22)గా గుర్తించారు. వీరిని అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటనపై సంగారెడ్డి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 588/2026 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మాదకద్రవ్యాలపై నిరంతర నిఘాజిల్లాలో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ సాగు, రవాణా, సరఫరా, విక్రయాలపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నట్లు జిల్లా ఎస్పీ పరితోష్‌పంకజ్ అక్రమ రవాణా లేదా విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాల అక్రమ కార్యకలాపాలపై సమాచారం ఉంటే ఎస్‌న్యాబ్ నంబర్ 8712656777కు తెలియజేయాలని సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.ఈ కేసును ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన ఎస్‌న్యాబ్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్‌రావు, రూరల్ సీఐ నయీముద్దీన్, ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి, ఇతర పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.



# రాజకీయాల్లో నాయి బ్రాహ్మణుల ప్రాధాన్యం



**నాగర్ కర్నూల్, అక్టోబరు 12 (వుదయం ప్రతినిధి):**

నాయి బ్రాహ్మణులు ఆత్మన్యూనత వీడి రాజకీయ, సామాజిక, ఆర్థిక అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేశ్ రెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన నాయి బ్రాహ్మణ కమ్యూనిటీ హాల్ ను సోమవారం ఉదయం ఎమ్మెల్యే ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు నాయి బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు వనపట్ల సుబ్బయ్య అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో అన్ని కులాలు సమానంగా అభివృద్ధి చెందేలా అందరం ఒకే కుటుంబంలా ముందుకు వెళ్తున్నామన్నారు. రాజకీయాల్లో రాణించాలనే ఆసక్తి ఉంటే అవకాశాలు వాటంతట అవే వస్తాయన్నారు. కమ్యూనిటీ హాల్ కు తన నిధుల నుంచి కాంపౌండ్ వాల్, డ్రైనేజీ వ్యవస్థ, సీసీ రోడ్డు వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. పేద నాయి బ్రాహ్మణ కుటుంబాలకు అర్హతను బట్టి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు.అనంతరం జిల్లా, పట్టణ అధ్యక్షులు, సంఘ సభ్యులు ఎమ్మెల్యేకు సంఘ అభివృద్ధికి సంబంధించిన వినతి పత్రాలను అందజేశారు. సభలో ఇటీవల మరణించిన సంఘ సభ్యులకు నివాళులు అర్పించారు. సంఘ భవన నిర్మాణానికి ఆర్థిక సహాయం చేసిన వంగా శరత్ బాబు, కూచుకుళ్ల దామోదర్ రెడ్డి, మర్రి జనార్దన్ రెడ్డి, నాగం జనార్దన్ రెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు.

కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వేనెపల్లి రమణారావు, మున్సిపల్ చైర్మన్ తీగల సురేంద్ర, వైస్ చైర్మన్ బాదం రమేష్, 10వ వార్డు కౌన్సిలర్ జయప్రకాశ్ నారాయణ చారి, 9వ వార్డు కౌన్సిలర్ అలివేలమ్మ, కౌన్సిలర్ శంకర్, నాయి బ్రాహ్మణ సంఘ అధ్యక్షులు సదుర్ల తిర్పతయ్య, జిల్లా అధ్యక్షులు కానుగుల శ్రీనివాస్, పురుషోత్తం, ఎం. శివుడు, అలంకార్ బాలస్వామి, వట్టెం బాలస్వామి, అంజనేయులు, సన్నాయిల నరసింహ, యమరాజుల తిర్పతయ్య, యమరాజుల మల్లేషం, కరుణాకర్, మహేశ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

# మద్యం తాగి వాహనాలు నడపరాదు ట్రాఫిక్ ఎస్ఐ కృష్ణ చైతన్య



**నారాయణపేట అక్టోబర్ 12(వుదయం ప్రతినిధి)**

మద్యం తాగి వాహనాలు నడపడం ద్వారా రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని నారాయణపేట ట్రాఫిక్ ఎస్ఐ కృష్ణ చైతన్య సూచించారు. నారాయణపేట జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో పలు వాహనాలను ఆకస్మికంగా తనిఖీ చేసి, డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిపై మూడు కేసులు నమోదు చేసినట్లు ట్రాఫిక్ ఎస్ఐ కృష్ణ చైతన్య తెలిపారు .ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల వాహనదారులతో పాటు రహదారిపై ప్రయాణించే ఇతరుల ప్రాణాలకు కూడా ప్రమాదం వాటిల్లుతుందని పేర్కొన్నారు. మద్యం తాగిన సమయంలో వాహనాన్ని నియంత్రించే సామర్థ్యం తగ్గి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తెలిపారు. వాహనదారులు తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాల భద్రతను కూడా దృష్టిలో ఉంచుకుని బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రజల ప్రాణాల రక్షణ లక్ష్యంగా ట్రాఫిక్ పోలీసులు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నారని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షిత ప్రయాణానికి సహకరించాలని ట్రాఫిక్ ఎస్ఐ కోరారు.a

# సేంద్రియ సాగుతో ఆరోగ్యకర సమాజానికి బాటలు వేయాలి!



**ఉప్పల ప్రహల్లాధ రెడ్డికి జాతీయ స్థాయి గుర్తింపు.. ఇతర రైతులకు స్ఫూర్తిదాయకం**
**రసాయన ఎరువుల వినియోగం తగ్గించి ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేయాలి**

**అయిజ, అక్టోబర్ 12 (వుదయం ప్రతినిధి)**

రైతులు సంప్రదాయ సాగు పద్ధతులకు ఆధునిక ప్రకృతి వ్యవసాయ విధానాలను జోడించి, సేంద్రియ సాగు వైపు అడుగులు వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. భూసారాన్ని కాపాడుతూ, పర్యావరణ పరిరక్షణకు తోడ్పడటంతో పాటు ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించడంలో సేంద్రియ వ్యవసాయం కీలక పాత్ర పోషిస్తుంది. ఈ దిశగా పదేళ్లుగా కృషి చేస్తున్న అయిజ మాజీ మండల పరిషత్ అధ్యక్షుడు ఉప్పల ప్రహల్లాధ రెడ్డికి ఢిల్లీలో జాతీయ స్థాయి పురస్కారం లభించడం గద్వాల జిల్లా రైతాంగానికి గర్వకారణంగా నిలిచింది.

**ప్రహల్లాధ రెడ్డి ప్రస్థానం.. రైతులకు ఆదర్శం**

సేంద్రియ వ్యవసాయంపై నమ్మకంతో పదేళ్లుగా సాగు చేస్తున్న ఉప్పల ప్రహల్లాధ రెడ్డి కృషిని గుర్తించి కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయి పురస్కారానికి ఎంపిక చేసింది. ప్రధానమంత్రి ధన్‌ధాన్య కృషి యోజన అమలులో భాగంగా దేశవ్యాప్తంగా వంద జిల్లాల నుంచి ఎంపిక చేసిన రైతుల్లో గద్వాల జిల్లా తరఫున ఆయనకు చోటు దక్కింది. ఢిల్లీలోని జాతీయ వ్యవసాయ విజ్ఞాన సముదాయంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, జిల్లా వ్యవసాయ అధికారి వీరప్ప, శాస్త్రవేత్త అర్చన సమక్షంలో ఆయనకు పురస్కారం అందజేశారు.ఈ గుర్తింపు ఒక్క ప్రహల్లాధ రెడ్డికి మాత్రమే పరిమితం కాకుండా, సేంద్రియ వ్యవసాయం చేయాలనుకునే ఇతర రైతులకు సైతం ప్రోత్సాహాన్నిచ్చే అంశంగా నిలుస్తోంది. ఆయన అనుభవాలను తెలుసుకొని, సాగు విధానాలను అధ్యయనం చేసి, తమ పొలాల్లోనూ ప్రకృతి అనుకూల పద్ధతులను అనుసరించేందుకు రైతులు ముందుకు రావాల్సిన అవసరం ఉంది.

**నేల ఆరోగ్యమే.. రైతు భవిష్యత్తుకు భరోసా**

రసాయన ఎరువులు, పురుగుమందులపై అధికంగా ఆధారపడకుండా, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా పశువుల ఎరువు, కంపోస్టు, పచ్చిరొట్ట ఎరువులు, పంట మార్పిడి వంటి పద్ధతులను పాటించడం ద్వారా నేల ఆరోగ్యాన్ని మెరుగుపరిచే అవకాశం ఉంటుంది. అయితే సేంద్రియ సాగుకు మారేటప్పుడు పంట, నేల స్వభావం, నీటి లభ్యత, మార్కెట్ అవసరాలను పరిగణనలోకి తీసుకొని వ్యవసాయ నిపుణుల సలహాతో ముందుకు సాగడం ముఖ్యం. మొదట తమ పొలంలో కొంత భాగంలో సేంద్రియ సాగును ప్రయోగాత్మకంగా చేపట్టి, దిగుబడి, పెట్టుబడి, ఆదాయాన్ని అంచనా వేసుకుంటూ క్రమంగా విస్తరించడం రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. సేంద్రియ ఉత్పత్తులకు సరైన మార్కెటింగ్ సదుపాయాలు, గిట్టుబాటు ధరలు లభించేలా వ్యవసాయ శాఖ అధికారులు, సంబంధిత సంస్థలు సహకరించాలి.ఉప్పల ప్రహల్లాధ రెడ్డి సాధించిన గుర్తింపు మరింత మంది రైతుల్లో సేంద్రియ వ్యవసాయంపై ఆసక్తిని పెంచాలని, భవిష్యత్తు తరాలకు సారవంతమైన భూమిని అందించేందుకు రైతాంగం సమిష్టిగా కృషి చేయాలని ఆశిద్దాం. రైతు ఆరోగ్యంగా ఉంటేనే వ్యవసాయం బలోపేతమవుతుంది.. భూమి ఆరోగ్యంగా ఉంటేనే భవిష్యత్తు సుభిక్షమవుతుంది.

# గాయత్రి దేవిగా దర్శనమిచ్చిన దుర్గాభవాని

- **శ్రీ దుర్గాభవాని ఆలయంలో వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు**
- **ప్రత్యేక అలంకరణలో అమ్మవారి దర్శనం.. భక్తిశ్రద్ధలతో పూజలు**

**దౌల్తాబాద్, అక్టోబర్ 12 (వుదయం):**

మండల కేంద్రమైన దౌల్తాబాద్‌లోని శ్రీ దుర్గాభవాని ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో రెండో రోజు సోమవారం అమ్మవారు గాయత్రీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వేదమాతగా, జ్ఞానప్రదాయినిగా పూజలందుకునే గాయత్రీ దేవి రూపంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించడంతో దాయిని గాయత్రీ దేవిగాయత్రీ దేవి సకల వేదాలకు మాతృస్వరూపిణిగా, జ్ఞానానికి ప్రతీకగా భక్తులచే ఆరాధించబడుతుంది. అజ్ఞానాంధకారాన్ని తొలగించి, సద్బుద్ధిని ప్రసాదించే దేవతగా గాయత్రీ మాతకు విశిష్ట స్థానం ఉంది. మనస్సుకు ప్రశాంతత, జీవితానికి సన్మార్గం, ఆలోచనలకు పవిత్రత కలగాలని భక్తులు అమ్మవారిని ప్రార్థిస్తారు. శరన్నవరాత్రుల్లో గాయత్రీ దేవి అలంకారాన్ని దర్శించుకోవడం శుభప్రదమని భక్తుల విశ్వాసం.రెండో రోజు ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పండుగ వాతావరణంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి.* ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులుఈ సందర్భంగా ముత్యం గారి రజిత, గొల్ల రమ్య-అరవింద్ దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. లోకకల్యాణం, కుటుంబాల సుఖసంతోషాలు, ప్రజల ఆయురారోగ్యాలు కలగాలని అమ్మవారిని ప్రార్థించారు. శరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్న నేపథ్యంలో రానున్న రోజుల్లోనూ భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకునే అవకాశం ఉంది.

# బతుకమ్మ వేడుకలకు సిద్ధమైన గొడుగుపల్లి చెరువు కట్ట



- **విద్యుత్తు స్తంభం ఏర్పాటు.. మెట్లకు రంగులు వేసి ముస్తాబు**
- **పండుగ వేళ మహిళలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా చర్యలు**

**దౌల్తాబాద్, అక్టోబర్ 12 (వుదయం):**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని దౌల్తాబాద్ మండలం గొడుగుపల్లి గ్రామంలో చెరువు కట్ట పరిసరాలను అందంగా తీర్చిదిద్దారు. పండుగ సందర్భంగా గ్రామంలోని మహిళలు, ఆడపడుచులు పెద్ద సంఖ్యలో చెరువు వద్దకు చేరుకొని బతుకమ్మలను ఆడే సంప్రదాయం ఉంది. ఈ నేపథ్యంలో చెరువు కట్టపై విద్యుత్తు స్తంభాన్ని ఏర్పాటు చేయడంతోపాటు, బతుకమ్మలను నిమజ్జనం చేసే ప్రాంతానికి వెళ్లే మెట్లకు రంగులు వేయించారు. దీంతో చెరువు కట్ట పరిసరాలు పండుగ శోభను సంతరించుకున్నాయి.పండుగ వేళ ప్రత్యేక ఏర్పాట్లుబతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలుస్తుంది. తొమ్మిది రోజులపాటు వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ పాటలు పాడుతూ మహిళలు వేడుకల్లో పాల్గొంటారు. చివరి రోజున బతుకమ్మలను చెరువుల్లో నిమజ్జనం చేయడం ఆనవాయితీ. ఈ క్రమంలో చెరువు కట్ట వద్ద తగిన సౌకర్యాలు ఉండటం ఎంతో అవసరం.గొడుగుపల్లి గ్రామంలో పండుగకు వచ్చే మహిళలు, గ్రామస్థులకు ఇబ్బందులు కలగకుండా చెరువు కట్ట వద్ద ఏర్పాట్లు చేపట్టారు. విద్యుత్తు స్తంభం ఏర్పాటు చేయడం, మెట్లకు రంగులు వేయించడం ద్వారా పరిసరాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. పండుగ వేళ చెరువు వద్ద ప్రజలు రాకపోకలు సాగించే సమయంలో మెట్ల వద్ద జాగ్రత్తలు పాటించాలని, ముఖ్యంగా రద్దీ సమయంలో అప్రమత్తంగా ఉండాలని గ్రామస్థులు సూచిస్తున్నారు.

గ్రామ అభివృద్ధిలో ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంగ్రామంలో పండుగ ఏర్పాట్లను మెరుగుపర్చడంలో ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు భాగస్వాములయ్యారు. పండుగలు గ్రామీణ సంస్కృతిని కాపాడటంతోపాటు ప్రజల మధ్య ఐక్యతను పెంపొందిస్తాయని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. సంప్రదాయ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు గ్రామస్థులందరూ సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ మద్దెల స్వామి, వార్డు సభ్యులు కర్రి మహేశ్, దుర్గని నరసింహులు, సట్టా లింగం, మంత్రి కరుణాకర్, నాయకులు మధుసూదన్, మద్దెల మల్లేశ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ అభివృద్ధే మా లక్ష్యం సర్పంచ్ అహమ్మద్ ఆలీ

- **దిగ్వాల్‌లో పారిశుద్ధ్య పనులు మురుగునీరు పిచ్చిగడ్డి తొలగింపునకు చర్యలు**

**కోహీర్, అక్టోబరు 12 (వుదయం ప్రతినిధి):**



సంగారెడ్డి జిల్లా కోహీర్ మండల పరిధిలోని దిగ్వాల్ గ్రామ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు గ్రామ సర్పంచ్ అహమ్మద్ ఆలీ తెలిపారు. గ్రామంలో పారిశుద్ధ్య పనులకు శ్రీకారం చుట్టి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు చేపట్టారు.గ్రామంలోని వీధుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, మురుగునీటిని తొలగించడంతో పాటు రోడ్ల పక్కన పెరిగిన పిచ్చిగడ్డిని తొలగిస్తున్నారు. గ్రామంలో నెలకొన్న ఇతర సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి న్నారు.ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాల ద్వారా గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి రూపాయిని గ్రామాభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసమే ఖర్చు చేస్తామని స్పష్టం చేశారు.గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యతనిస్తూ, వీధి దీపాల ఏర్పాటు, మౌలిక సదుపాయాల మెరుగుదలతో పాటు ప్రజలకు అవసరమైన ఇతర అభివృద్ధి పనులపై దృష్టి సారించినట్లు వెల్లడించారు. గ్రామ ప్రజలు కూడా పరిసరాల పరిశుభ్రతకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజకుమార్, వార్డు సభ్యులు, పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

# నిరుద్యోగులకు ఉచిత ఉద్యోగ శిక్షణ



**ఝరాసంగం అక్టోబర్-12(వుదయం ప్రతి నిధి)**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం, లోని నిరుద్యోగయువతీ, యువకులకు 45రోజులపాటు ఉచిత శిక్షణ ఉంటుందని ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఝరాసంగం సబ్ ఇన్స్పెక్టర్ క్రాంతి పాటిల్ గారు,ఒక పాఠ శాలలో జరిగిన కార్యక్రమం లో విద్యార్థులకు సలహాలు సూచనలు ఇవ్వడం జరిగింది.జహీరాబాద్ నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ యువకులకు పోలీస్ ఉద్యోగాల సాధనలో అండగా నిలిచేందుకు సంగారెడ్డి జిల్లా పోలీస్ శాఖ, జిల్లా యంత్రాంగం సంయుక్తంగా ఉచిత శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించడం అభినందనీయమని వారికి ముందుగా కృతజ్ఞతలు అని S.I తెలపడం జరిగింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన అభ్యర్థులకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా మారనుంది. పోలీస్ కానిస్టేబుల్,సబ్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న అభ్య గ్రామీణ యువతకు ఈ ఉచిత శిక్షణ ఒక గొప్ప అవకాశంగా నిలవనుంది. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఫైన్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ నిపుణులైన అధ్యాపకులతో 45 రోజుల పాటు శిక్షణ అందించడం ద్వారా అభ్యర్థులకు పరీక్షలపై అవగాహన పెరగడంతో పాటు ఉద్యోగ సాధనకు అవసరమైన సన్నద్ధత లభించనుంది.ఈ శిక్షణా కార్యక్రమం గ్రామీణ ప్రాంతాల అభ్యర్థులకు ఎంతగానో ప్రయోజనం చేకూరుస్తుందని తెలిపారు.క్రమశిక్షణతో చదువుతూ,పట్టుదలతో సాధన చేసి పోలీస్ ఉద్యోగాలు సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఆర్థిక పరిస్థితులు ప్రతిభకు అడ్డంకి కాకుండా, యువత తమ లక్ష్యాలను చేరుకోవాలని చెప్పడం జరిగింది.ఈ కార్యక్రమం లో, CI. మరియు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పపాల్గొన్నారు.a

# ప్రజావాణిలో 7 ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ



**నాగర్ కర్నూల్, అక్టోబరు 12 (వుదయం బ్యూరో ):**

జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డాక్టర్. సంగ్రామ్ సింగ్ జి. పాటిల్ ఫిర్యాదుదారుల నుంచి 7 ఫిర్యాదులను స్వీకరించారు.వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. స్వీకరించిన 7 అర్జీలలో భూమికి సంబంధించినవి 4, తగు న్యాయం కోరుతూ ఇచ్చినవి 3 ఉన్నాయి.

వీటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత పోలీస్ స్టేషన్లకు పంపించారు.ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం, పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీస్ సేవలను వినియోగించుకుంటూ తమ సమస్యలను చట్టప్రకారం పరిష్కరించుకునేలా, పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా, శాంతిభద్రతలు పరిరక్షిస్తూ జిల్లా పోలీస్ శాఖ పనిచేస్తుందని ఎస్పీ తెలిపారు.

# గీతంలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం

- **ఉత్సాహంగా పాల్గొని, తమ సృజనాత్మకతను చాటిన విద్యార్థులు ప్రోత్సహించిన అధ్యాపకులు**

**పటాన్చెరు (వుదయం):**



గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులో సోమవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని అందరికీ అవగాహన కల్పించేలా నిర్వహించారు. గీతం స్టూడెంట్ లైఫ్ సహకారంతో, స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ (జీఎస్ హెచ్ఎస్) లోని అనువర్తిత మనస్తత్వశాస్త్రం (Applied Psychology) విభాగం దీనిని ఏర్పాటు చేసింది. 'అవగాహనతో ఉండండి, దయతో ఉండండి, మీలాగే ఉండండి' అనే ఇతివృత్తంతో ఈ మాన సిక ఆరోగ్య కార్యక్రమం 2.0కి రూపకల్పన చేశారు. ఈ కార్యక్రమం 'మెరుగైన మనస్సులు, ఆరోగ్యకరమైన జీవితాలు, మరింత దయగల రేపటి రోజు' అనే దార్శనికతను స్వీకరించి, విద్యార్థులను మానసిక శ్రేయస్సుకు ప్రాధాన్యత ఇవ్వడానికి, వారి ఆలోచనలు, భావోద్వేగాలను వ్యక్తపరచడానికి, సహాయక వ్యవస్థ లతో అనుసంధానం కావడానికి, శ్రేయస్సు వనరులను అన్వేషించడానికి, సానుభూతి, పరస్పర మద్దతు సంస్కృతిని పెంపొందించడానికి ప్రోత్సహించింది.డాక్టర్ ఎం. రెజా, డైరెక్టర్, స్కూల్ ఆఫ్ లు, వాటి ప్రాముఖ్యత గురించి అడిగి తెలుసుకుంటూ, మరింత మెరుగుపరచడానికి విలువైన సూచనలు చేశారు. దీని తరువాత, లలిత, ప్రదర్శన కళల విభాగం అధ్యాపక బృందం, వివిధ విద్యార్థి క్లబ్ లు ఇచ్చిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో మానసిక ఆరోగ్య అవగాహన, భావోద్వేగ వ్యక్తీకరణ, ఆత్మపరిశీలన, సామాజిక సంబంధాలను ప్రోత్సహించడానికి రూపొందించిన అనేక రకాల ఆసక్తికరమైన, ముఖాముఖి, సృజనాత్మక కార్యకలాపాలు ఉన్నాయి. వీటిలో మానసిక ఆరోగ్య పజిల్ పీస్ యాక్టివిటీ, మానసిక ఆరోగ్య క్యాసినో, అన్ లాక్ యువర్ మైండ్ మినీ ఎస్కేప్ మై ఫ్యూచర్ సెల్ఫ్), మానసిక ఆరోగ్య చె అవశ్యమని, నైపుణ్యాభివృద్ధిని ప్రోత్సహించాలని, శ్రామిక శక్తి పరివర్తన కోసం భవిష్యత్తుకు సిద్ధంగా ఉండే విధానాన్ని అవలంబించాలని పరిశ్రమ నిపుణులు సూచించారు. హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ (జీఎస్బీ) 'మానవ వనరుల (హెచ్ఆర్) విభాగం భవిష్యత్తుదిశా నిర్దేశం:కార్మిక చట్టాలు, మారుతున్న చట్టాపరమైన పరిస్థితులు' అనే అంశంపై సోమవారం ప్యానెల్ చర్చను నిర్వహించింది. పరిణామం చెందుతున్న కార్మిక చట్టాలు, చట్టపరమైన అనుపాలన, అనిశ్చితి అంచనా, అభివృద్ధి చెందుతున్న మానవ వనరుల పద్ధతులపై విద్యార్థులకు అవగాహన కల్పించడానికి దీనిని లక్ష్యించారు.ఈ చర్చలో ప్రముఖ ప్యానెలిస్టులు గెయిన్ సైట్ ఇండియా సీనియర్ డైరెక్టర్‌కంట్రీ హెడ్ (హెచ్ఆర్) ఇ.హరిత, కార్య ఐటీ సొల్యూషన్స్ డైరెక్టర్ (హెచ్ఆర్) లెర్నింగ్‌గ్రోత్ డాక్టర్ శైలజ, ఇన్ ఫోర్ మాజీ సీనియర్ డైరెక్టర్, హెచ్ఆర్ విభాగాధిపతి బి.అనిల్ కుమార్ పాల్గొన్నారు. కొత్త కార్మిక చట్టాల ప్రభావాలు, హెచ్ఆర్ యొక్క అభివృద్ధి చెందుతున్న పాత్రపై విలువైన పరిశ్రమ అంతర్దృష్టులను వారు పంచుకున్నారు. విద్యార్థులు స్వతంత్రంగా ఆలోచించాలని, కృత్రిమ మేధస్సును బాధ్యతాయుతంగా ఉపయోగించాలని సూచించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.ఎన్. రేఖ చర్చను ప్రారంభించగా, కార్యక్రమ కన్వీనర్ డాక్టర్ కున్మాన్ మిశ్రా కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. ప్యానలిస్టులు ఎంబీఏ, బీబీఏ విద్యార్థులతో కూడా సంభాషించి, వారి సందేహాలను నివృత్తి చేయడంతో పాటు,కొత్తగా వస్తున్న హెచ్ఆర్ సవాళ్లపై ఆచరణాత్మక దృక్పథాలను అందించారు. ఈ చర్చ పరిశ్రమ అనుభవాన్ని అందించడంతో పాటు, మారుతున్న పని ప్రపంచంలో బాధ్యతాయుతమైన నాయకత్వం, వ్యూహాత్మక ఆలోచన, అవగాహనతో కూడిన హెచ్ఆర్ పద్ధతుల ప్రాముఖ్యతను పునరుద్ఘాటించింది.



# గ్రేటర్ హైదరాబాద్



## ఆడపిల్లల భద్రతే లక్ష్యంగా ఎస్ఎఫ్ఐ ఉద్యమం

- బతుకమ్మ బతుకుల పండుగ.. ఆడపిల్లల బతుకులకు భరోసా కల్పిద్దాం
- బర్కత్‌పురాలోని ఆకాష్ కాలేజీలో ఘనంగా బతుకమ్మ
- వేడుకలు – విద్యార్థినులతో కలిసి బతుకమ్మ ఆడిన మల్లు లక్ష్మి

ముషీరాబాద్, అక్టోబర్ 12 (ఉదయం)

ఆడపిల్లల స్వేచ్ఛ, సమానత్వం, భద్రత కోసం ప్రతి ఒక్కరూ సంఘటితమై ఉద్యమించాలని ఎస్ఎఫ్ఐ (స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా), ఏఐడీడబ్ల్యూఏ నాయకులు పిలుపునిచ్చారు. బతుకమ్మ పండుగ కేవలం పూల పండుగ మాత్రమే కాదని, మహిళల ఆత్మగౌరవం, హక్కులు, సామాజిక సమానత్వానికి ప్రతీకగా నిలవాలని వారు పేర్కొన్నారు. "ఆడపిల్లను పుట్టనిద్దాం.. బతకనిద్దాం.. చదువుకోనిద్దాం.. ఎదగనిద్దాం" అనే నినాదంతో మహిళల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం బర్కత్‌పురాలోని శ్రీ ఆకాష్ కాలేజీలో బతుకమ్మ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏఐడీడబ్ల్యూఏ మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి విద్యార్థినులతో కలిసి బతుకమ్మ ఆడుతూ వారిలో ఉత్సాహాన్ని నింపారు. పండుగ వాతావరణంలో మహిళల హక్కులు, స్వేచ్ఛ, సమానత్వం, భద్రతపై అవగాహన కల్పించారు ..ఈ సందర్భంగా మల్లు లక్ష్మి మాట్లాడుతూ.. సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడులు, వివక్ష, అణచివేతకు వ్యతిరేకంగా మహిళలంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని, తమ హక్కులను తెలుసుకొని వాటిని కాపాడుకునేందుకు ధైర్యంగా నిలబడాలని సూచించారు. సావిత్రిబాయి పూలే, మల్లు స్వరాజ్యం, చాకలి ఐలమ్మ, ఆరుట్ల కమలాదేవి వంటి పోరాట యోధుల జీవితాలను ఆదర్శంగా తీసుకొని, సమానత్వ సాధన కోసం నిరంతరం కృషి చేయాలని విద్యార్థినులకు పిలుపునిచ్చారు.ఆడపిల్లలకు విద్య, స్వేచ్ఛ, సమాన అవకాశాలు కల్పించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆమె స్పష్టం చేశారు. మహిళలపై దాడులను అరికట్టడంలో ప్రభుత్వాలు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, మహిళల రక్షణకు సంబంధించిన చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళలకు ఎలాంటి సమస్య ఎదురైనా ఎస్ఎఫ్ఐ, ఏఐడీడబ్ల్యూఏ అండగా నిలిచి పోరాటం చేస్తాయని భరోసా ఇచ్చారు.ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి రెడ్డి మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ సందర్భంగా విద్యార్థినుల్లో మహిళా హక్కులు, స్వేచ్ఛ, సమానత్వం, భద్రతపై అవగాహన పెంపొందించడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. పండుగల స్ఫూర్తితో పాటు సామాజిక బాధ్యతను కూడా యువత అలవర్చుకోవాలని, మహిళలకు గౌరవం లభించే సమాజ నిర్మాణంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆకాష్ కాలేజీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు లెనిన్ గువేరా, జిల్లా ఉపాధ్యక్షులు రజనీకాంత్, ప్రవీణ్, అర్జున్, జిల్లా కమిటీ సభ్యులు భారత్, అశ్వక్, నాయకులు నెలోత్పల్, కిరణ్, చింటూ, డెన్జిల్



## కవాడిగూడలో ఘనంగా దుర్గామాత ఉత్సవాలు

- దశాబ్ద కాలంగా భక్తిశ్రద్ధలతో దుర్గామాత వేడుకలు



ముషీరాబాద్, అక్టోబర్ 12(ఉదయం)

హైదరాబాద్‌లోని కవాడిగూడలో శ్రీ సిద్ధి వినాయక ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దుర్గామాత ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. దశాబ్ద కాలంగా (10 సంవత్సరాలుగా) అమ్మవారి ఉత్సవాలను నిర్వహిస్తూ భక్తి, ఆధ్యాత్మికతతో కూడిన సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు.ప్రతి సంవత్సరం దుర్గామాత నవరాత్రుల సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించడం ద్వారా స్థానిక ప్రజల్లో ఆధ్యాత్మిక భావనను పెంపొందిస్తున్నారు. ఉత్సవాల సందర్భంగా అమ్మవారి దర్శనం కోసం భక్తులు తరలివస్తూ తమ మొక్కులు చెల్లించుకుంటున్నారు. కార్యక్రమంలో ఆర్గనైజర్ డి.వాసు, ఎన్. భరత్,పవన్,పి.భరత్, కే. సాయి కుమార్, సోనూ,కుమార్, రావి తేజ, భాను,ఆకాష్ తదితరులు పాల్గొన్నారు

## ప్రజావాణికి 102 ఫిర్యాదులు



రంగారెడ్డి జిల్లా

సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి (102) ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారుల నుండి సమస్యలను జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) కిరణ్మయి, అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి తో కలిసి అర్జీలు స్వీకరించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ శాఖ-49, ఇతర శాఖలు -53, మొత్తం 102 దరఖాస్తులు అందాయి.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శారదా దేవి వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## శంకర్ పల్లి పి.ఏ.సీ.ఎస్ చైర్మన్‌గా వెంకట్ రెడ్డి

- వైస్ చైర్మన్ గా పార్శి బాలకృష్ణ - 13 మంది డైరెక్టర్లతో నూతన పాలకవర్గం ప్రమాణ శ్రీకారం..
- జీవో ఎంఎస్ నెం. 68 ప్రకారం నియామకం - సహకార శాఖ కార్యదర్శి ఉత్తర్వులు

శంకర్ పల్లి, అక్టోబర్ 12 (ఉదయం):



శంకర్ పల్లి మండల వ్యవసాయ రంగంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. శంకర్ పల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పి.ఏ.సి.ఎస్) నూతన చైర్మన్ గా బొల్లారం వెంకట్ రెడ్డి సోమవారం ఘనంగా బాధ్యతలు చేపట్టారు.తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవో ఎం.ఎస్. నం. 68 ప్రకారం ఆయన నియామకం జరిగింది.శంకర్ పల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో జరిగిన ఈ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి సహకార శాఖ అధికారులు, రైతులు, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.శంకర్ పల్లి మండలంలో సీనియర్ రైతు నాయకుడిగా, అన్ని వర్గాల ప్రజలతో సన్నిహిత సంబంధాలు ఉన్న నాయకుడిగా బొల్లారం వెంకట్ రెడ్డి గారికి మంచి పేరు ఉంది. రైతుల సమస్యలపై ఆయనకు ఉన్న అవగాహనతోనే ప్రభుత్వం ఆయనను ఈ కీలక బాధ్యతలకు ఎంపిక చేసింది. 13 మంది డైరెక్టర్ల బలమైన కమిటీ: ఈ కమిటీలో మొత్తం 13 మంది సభ్యులు ఉన్నారు. ఇందులో మహిళలు, ఎస్సీ,ఎస్టీ, బీసీ, ఓసీ వర్గాలకు చెందిన నాయకులకు ప్రాతినిధ్యం కల్పించారు.1. పార్శి బాలకృష్ణ (వైస్ చైర్మన్)2. కర్కనగారి మాణిక్య రెడ్డి3. మామిడిపల్లి జనార్ధన్ రెడ్డి,4. బుచ్చనోళ్ల ఇంద్రమ్మ5. కొలన్ శ్రీనివాస్ రెడ్డి6. గుండ్ర లచ్చి రెడ్డి7. వడ్డె మల్లికార్జున్8. గుంతల ప్రశాంత్ రెడ్డి 9. బూరిగల్ల సమయ్య10.పాత్లోత్ శంకర్11.వొగ్గు చంద్రకళ12. కొంగల శ్రీధర్ మరియు చైర్మన్ బొల్లారం వెంకట్ రెడ్డి గారితో కలిపి మొత్తం 13 మంది,బాధ్యతలు స్వీకరించారు. స్వీకరణ అనంతరం చైర్మన్ బొల్లారం వెంకట్ రెడ్డి మాట్లాడుతూ... "నాపై నమ్మకం ఉంచి పి.ఏ.సి.ఎస్ చైర్మన్ గా నియమించిన తెలంగాణ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, జిల్లా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకి, స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య,స్థానిక నాయకులకు నా కృతజ్ఞతలు.శంకర్ పల్లి పి.ఏ.సి.ఎస్ అంటేనే వేలాది మంది రైతుల నమ్మకం. ఆ నమ్మకాన్ని వమ్ము చేయను. రైతులకు పంట రుణాలు, ఎరువులు, విత్తనాలు సకాలంలో, అవినీతి లేకుండా అందేలా చూస్తా. పి.ఏ.సి.ఎస్ ని లాభాల బాటలో నడిపి, రైతులకు అండగా ఉంటా. ప్రతి రైతు సమస్యను నా సొంత సమస్యగా భావించి పరిష్కరిస్తా" అని హామీ ఇచ్చారు.అనంతరం నూతన పాలకవర్గాన్ని శంకర్ పల్లి మండలంలోని వివిధ గ్రామాల రైతులు, నాయకులు శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

## దేవుల నాయక్‌కు బండమీది వెంకటేష్ ఆత్మీయ జన్మదిన శుభాకాంక్షలు

- దేవుల నాయక్‌కు భగవద్గీత అందజేసిన బండమీది వెంకటేష్
- దేవుల నాయక్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న బండమీది వెంకటేష్, సాలె అడివయ్య,రాజు

శంకర్‌పల్లి, అక్టోబర్ 12 (ఉదయం)



కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, పనిత బిల్డర్ అధినేత దేవుల నాయక్ జన్మదినాన్ని పురస్కరించుకొని బీసీ సంక్షేమ సంఘం చేవెళ్ల నియోజకవర్గ అధ్యక్షుడు బండమీది వెంకటేష్ ఆయనకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా దేవుల నాయక్‌ను ఆత్మీయంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ, ఆయన భవిష్యత్తు మరింత విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా బండమీది వెంకటేష్ దేవుల నాయక్‌కు భగవద్గీతను అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. భగవద్గీతలోని ఆధ్యాత్మిక సందేశాలు జీవితానికి మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొంటూ, దేవుల నాయక్ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.రాజకీయ, సామాజిక రంగాల్లో తనదైన గుర్తింపు సంపాదించుకున్న దేవుల నాయక్ ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకుంటూ ప్రజల ఆదరాభిమానాలతో ముందుకు సాగాలని బండమీది వెంకటేష్ అభిలషించారు. ఆయన జీవితంలో ప్రతి అడుగు విజయించాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు. ఈ సందర్భంగా దేవుల నాయక్‌తో తనకున్న ఆత్మీయ అనుబంధాన్ని వ్యక్తం చేస్తూ, ఆయనకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు అందజేశారు.ఈ సందర్భంగా బండమీది వెంకటేష్ మాట్లాడుతూ, దేవుల నాయక్ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు. జీవితంలో ఎదురయ్యే ప్రతి సవాలును ధైర్యంగా ఎదుర్కొంటూ, మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరుకున్నారు. వ్యక్తిగత జీవితంలో ఆనందం, కుటుంబంలో సంతోషం, వృత్తిపరంగా మరింత అభివృద్ధి సాధించాలని పేర్కొన్నారు. సమాజంలో మంచి పేరు సంపాదించుకుంటూ, తన అనుభవంతో మరింత మందికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.దేవుల నాయక్ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధిస్తూ, ప్రజలతో సత్సంబంధాలను కొనసాగిస్తూ ముందుకు సాగాలని తెలిపారు. ఆయనకు భగవంతుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని, ఆరోగ్యం, ఆనందం, ఐశ్వర్యం కలగాలని బండమీది వెంకటేష్ ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. జన్మదినాన్ని పురస్కరించుకొని భగవద్గీతను అందజేయడం ద్వారా దేవుల నాయక్ పట్ల తనకున్న గౌరవం, ఆత్మీయతను చాటుకున్నారు.ఈ జన్మదిన శుభాకాంక్షల కార్యక్రమంలో మోకిలా గ్రామ మాజీ సర్పంచ్ సాలె అడివయ్య, మాజీ ఉపసర్పంచ్ రాజు పాల్గొని దేవుల నాయక్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు దేవుల నాయక్ ఎల్లప్పుడూ సంతోషంగా, ఆరోగ్యంగా ఉండాలని, తన జీవితంలో మరిన్ని విజయాలను అందుకోవాలని ఆకాంక్షించారు. పుట్టినరోజు సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరింత అభివృద్ధి సాధించాలని కోరుకున్నారు.ఈ సందర్భంగా ఆత్మీయ వాతావరణం నెలకొనగా, జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన బండమీది వెంకటేష్, సాలె అడివయ్య, రాజులకు దేవుల నాయక్ కృతజ్ఞతలు తెలిపారు.

## ఎల్‌నినోపై ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు



రంగారెడ్డి జిల్లా

ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలతో సిద్ధంగా ఉందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా రైతులకు ఎల్‌నినో ప్రభావం, భవిష్యత్తులో ఏర్పడే పరిస్థితులపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం అన్ని రైతు వేదికల ద్వారా రైతు నేస్తం కార్యక్రమం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించింది.
ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఉపముఖ్యమంత్రి రాష్ట్ర రైతాంగాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రపంచ వాతావరణ సంస్థ నివేదికల ప్రకారం ఎల్‌నినో ప్రభావం డిసెంబర్ నాటికి గరిష్ఠ స్థాయికి చేరే అవకాశం ఉందని, 2027 వరకు ఇలాంటి పరిస్థితులు కొనసాగవచ్చని అంచనాలు ఉన్నట్లు తెలిపారు. ప్రపంచంలోని పలు ప్రాంతాల్లో అధిక ఉష్ణోగ్రతలు, తక్కువ వర్షపాతం కారణంగా ప్రజలు, రైతులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు ఉన్నాయని పేర్కొన్నారు. ఎ ల్ ని నో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని గత నాలుగు నెలలుగా వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు, జిల్లా యంత్రాంగం ద్వారా రైతులను అప్రమత్తం చేస్తున్నట్లు తెలిపారు. తాగునీటి అవసరాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, రిజర్వాయర్లు, ప్రాజెక్టులు, చెరువుల్లో అందుబాటులో ఉన్న నీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాలని సూచించారు. సాగులో ఉన్న పంటలను కాపాడుకోవడంతో పాటు వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనల మేరకు తక్కువ నీటితో, తక్కువ కాలంలో చేతికొచ్చే పంటలను సాగు చేయాలని అన్నారు. నీటి లభ్యత లేని ప్రాంతాల్లో పంటలు సాగు చేసి నష్టపోవద్దని, కొత్తగా నాటిన ఉద్యాన పంటలను కాపాడుకోవాలని సూచించారు. ఎల్‌నినోపై వచ్చే వదంతులను నమ్మకుండా, రైతులు, ప్రజలు, అన్ని రాజకీయ పార్టీలు సమన్వయంతో వ్యవహరించి విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేందుకు సహకరించాలని కోరారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, ఎల్‌నినో పరిస్థితులపై రైతులను ముందుగానే అప్రమత్తం చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో సుమారు 15 లక్షల ఎకరాల మేర వరి సాగు విస్తీర్ణం తగ్గిందని పేర్కొన్నారు. సాగులో ఉన్న పంటలను కాపాడుకోవడంతో పాటు రబీలో పప్పుదినుసులు, నూనెగింజలు, తక్కువ కాలంలో చేతికొచ్చే పంటలను సాగు చేయాలని సూచించారు. రిజర్వాయర్లకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. విద్యుత్ సరఫరా, భూగర్భ జలాల లభ్యతపై వాస్తవ పరిస్థితులను రైతులకు తెలియజేయాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు, వాతావరణ శాఖ, వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఉద్యాన విశ్వవిద్యాలయం, పశుసంవర్ధక శాఖల అధికారులు ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఆయా శాఖల ద్వారా చేపట్టనున్న చర్యలను వివరించారు.లు పెట్టినందున, వాటిని సాధ్యమైనంతవరకు కాపాడి రైతులకు నష్టం తగ్గించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో సాగునీటి కోసం అధికంగా బోరుబావులపై ఆధారపడుతున్న నేపథ్యంలో విటులో ఉన్న సమయంలో అవసరమైన మేరకే వినియోగిస్తూ, డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింక్లర్ వంటి సూక్ష్మ సేద్య పద్ధతులను ప్రోత్సహించాలని సూచించారు. తక్కువ నీటితో ఎక్కువ ప్రయోజనం పొందేలా రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. మంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డాక్టర్ కె.కిరణ్మయి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సుజాత, డిపిఓ సురేష్ మోహన్, పిడి డీఆర్డీఏ శ్రీలత, ఉద్యానవన శాఖ అధికారి సురేష్, మిషన్ భగీరథ అధికారి రాజేశ్వర్ రావు, పశుసంవర్ధక శాఖ అధికారి, ఆర్డీఓ శ్రీనివాస్ రెడ్డి, సంబంధిత అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళపై కత్తితో భీకర దాడి

- చికిత్స పొందుతున్న బాధితురాలు.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

చేవెళ్ల, అక్టోబర్ 12 (ఉదయం)

చేవెళ్ల-వికారాబాద్ ప్రధాన రహదారిపై మిర్జాగూడ గేట్ సమీపంలో గుర్తుతెలియని మహిళ రక్తగాయాలతో పడి ఉండటం కలకలం రేపింది. గుర్తుతెలియని వ్యక్తులు పదునైన ఆయుధంతో దాడి చేయడంతో ఆమె తలకు తీవ్ర గాయాలైనట్లు బాధితురాలి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది.పోలీసుల వివరాల ప్రకారం.. సోమవారం (అక్టోబర్ 12) ఉదయం సుమారు 6 గంటల సమయంలో పర్వేద శంకరయ్య 100 డయల్‌కు ఫోన్ చేసి మిర్జాగూడ గేట్ సమీపంలో ఓ మహిళ రక్తగాయాలతో పడి ఉన్నట్లు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన పెట్రోలింగ్ మొబైల్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు.చేవెళ్ల నుంచి వికారాబాద్ వెళ్లే రహదారిలో మిర్జాగూడ గేట్‌కు ఎడమ వైపు సుమారు 100 మీటర్ల దూరంలోని పొలంలో మహిళ గాయాలతో పడి ఉన్నట్లు గుర్తించారు.వెంటనే ఆమెను చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం చేవెళ్లలోని పట్నం మహేందర్ ఆసుపత్రికి తరలించి చేర్పించారు.బాధితురాలిని హఫీజ్‌పేట్‌లోని ప్రేమ్‌నగర్ కాలనీకి చెందిన కల్సాని వీణ (26)గా గుర్తించారు.వీణ చిన్నప్పటి నుంచి మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు



ఆమె తండ్రి కల్సాని ఇంద్రారెడ్డి పోలీసులకు తెలిపారు.2024 ఫిబ్రవరిలో పాలకుర్తికి చెందిన జగన్‌తో వివాహం జరగగా, నెల రోజుల్లోనే విడాకులు తీసుకున్నట్లు వివరించారు.గతంలో హైదరాబాద్‌లోని ఏఐజీ, కాంటినెంటల్ ఆసుపత్రులతో పాటు ఎర్రగడ్డ ప్రభుత్వ ఆసుపత్రిలోనూ చికిత్స పొందినట్లు తెలిపారు.వీణ అప్పుడప్పుడు ఇంటి నుంచి వెళ్లిపోయి మూడు, నాలుగు రోజుల తర్వాత తిరిగి వచ్చేదని, ఈ క్రమంలో అక్టోబర్ 3న ఇంటి నుంచి వెళ్లిన ఆమె తిరిగి రాలేదని తండ్రి పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో గుర్తుతెలియని వ్యక్తులు పదునైన ఆయుధంతో ఆమెపై దాడి చేసి తలకు గాయాలు చేశారని ఫిర్యాదు చేశారు.ఈ ఘటనపై చేవెళ్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.దాడికి గల కారణాలు, నిందితుల వివరాలు తెలియాల్సి ఉంది. బాధితురాలు ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది.

## అమ్మవారి ఆలయాల్లో రెండో రోజు విశేష పూజలు

జిన్నారం అక్టోబర్ 12(ఉదయం ప్రతినిధి)



జిన్నారం మున్సిపల్ కేంద్రంలోని ఏడుపాయల వనదుర్గ అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. అమ్మవారు రెండో రోజు భక్తులకు గాయత్రీ దేవి అలంకారంలో దర్శనమిచ్చారు. అదేవిధంగా జీవన జ్యోతిర్లింగ శివాలయంలోని అమ్మవారు భక్తులకు భ్రమరాంబికా దేవిగా విశేష దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు తరలి వచ్చారు. భక్తుల రాకతో ఆలయ ప్రాంగణాలు సందడిగా మారాయి.

## ప్రజావాణి అర్జీలు తక్షణమే పరిష్కరించాలి

మేడ్చల్

ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన అర్జీలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా నిబంధనల ప్రకారం వెంటనే పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్ఓ మాలతి తో కలిసి అదనపు కలెక్టర్ అర్జీదారుల నుండి వినతులను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ, పంచాయతీ రాజ్, సివిల్ సప్లైస్, మున్సిపల్ తదితర శాఖలకు సంబంధించి మొత్తం 88 దరఖాస్తులు ప్రజల నుండి స్వీకరించినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన బాధితుల సమస్యలకు ప్రాధాన్యతనిచ్చి వేగంగా పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత



అధికారులకు అదనపు కలెక్టరు సూచించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇంటి పూజా కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు

బిజినేపల్లి, అక్టోబరు 12 (ఉదయం ప్రతినిధి):

మండల కేంద్రానికి చెందిన ఇరుగంటి శిరీష నూతన ఇందిరమ్మ ఇంటి పూజా కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మిద్దె రాములు, ఎంపీడీఓ కథలప్ప, ఏఈ అంజలి, మాజీ సర్పంచ్ గంగనమోని తిరుపతయ్య, డిప్యూటీ సర్పంచ్ గడ్డమీది మహేష్, 13వ వార్డు మెంబర్ చిర్నం పరమేష్, వార్డు మెంబర్ నరసింహతో



పాటు లబ్ధిదారులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

**COURT NOTICE IN THE COURT OF THE HON'BLE X JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT : : HYDERABAD**
**O.S. No. 3029 of 2026**

**Between :**
1. Devika @ Others S/o Late N.Madhava Rao Aged about 54 years, Occ: House Wife, R/o 1-4-89, Bholakpur, Musheerabad, Hyderabad, Telangana-500080.
**....Plaintiffs**

**AND**

1. The Mandal Revenue Officer, Near DBR Mills, Zamistanpur, Lower Tank Bund Road, Hyderabad-500080.
2. All Concerned.
**...Defendants**

**NOTICE**

Please take notice that the above named Plaintiff's have filed the above Legal Heir Suit seeking for Declaration of Legal Heirs of the deceased. **Smt.Devika,** who died on 19.02.2026 The Hon'ble Court ordered to issue "Summons to **"All Concerned"(Defendant No.2)** for appearance in the matter for objections If any. It is therefore informed to "All Concerned" to appear before the Hon'ble X Junior Civil Judge, City Civil Court, Hyderabad on "27-10-2026". At 10:30 am either in person or through your counsel along with "required documents, if any objections for declaring Legal Heir Status, "otherwise the matter will be decided in your absence.

**//By Order of the Court//**
**Sd/-**
**M/s B.Shirisha**
**B.G.Ross R/o**
**Advocates,**
**H:9-3-700 Regimental Bazar, Secunderabad Telangana.500003**
**Cell:-7892344610**
**Counsel for Plaintiff's**

**IN THE COURT OF THE V JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURT AT : HYDERABAD**
**O.S. No. 3070 Of 2026**

**Between :**
Garapati Bhavani and Others
**Plaintiffs**

AND

MRO Khairtabad and others
**Defendants**

**SUMMONS**

TO,
All Concerned
**(Defendant No.2)**

Please take notice that the above named plaintiffs filed suit for declaration of plaintiff's as Legal heirs/ legal status of the Garapati Narasimha Rao S/o Late Garapati Madhusudana Rao, who died on 16-09-2015 against the defendants. The above said suit stands posted to 29-10-2026 for your appearance and answer if any in the above said court at 10.30 A.M. Please come and appear before the Hon'ble court by person or through an advocate, failing which the matter will be decided as per law.

**(BY ORDER OF THE COURT)**
**Sd/-**
**G.Ramesh Babu,**
**G. Vamshi Krishna**
**(TS/ 1527/2015),**
**A. Siva Koteswara Rao**
**Advocates,**
**Flat No. 401, RDB blue Hope Appartment, Tilak Road, Abids Hyderabad-500020. Adv.sivaml@gmail.com Cell: 9704055589, 9515105157**

**IN THE COURT OF THE XIth JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, At SECUNDERABAD**
**O.S. No. 713 of 2026**

**Between :**
1. SYED ABDUL WAKEEL,
2. SYED ABDUL QADEER,
3. SYED ABDUL RUB,
4. SYED ABDUL RAFEY,
5. SYED ABDUL MAJID,
6. ASMA SHAHEEN,
7. TALAT PARVEEN,
8. ASRA TABASSUM,
9. ARSHIYA JABEEN

**Plaintiffs**

**AND**

1. MANDAL REVENUE OFFICER, Secunderabad.
2. ALL CONCERNED

**Defendants**

**To**
**ALL CONCERNED**

**SUMMONS**

All concerned may take Summons that the Plaintiffs have instituted the above Suit to declare them as the surviving legal heirs of deceased **SYED ABDUL HAKEEM & JAMEEL UNNISA BEGUM.** Any person or persons has any objections with regard to the said matter may appear before the Hon'ble Court on **11th** Day of **November, 2026** at **10:30 AM** either in person or through an advocate, to answer all material questions. Failing to do so matter will be proceeded as Exparte.

**(BY ORDER OF THE COURT)**
**Sd/-**
**SHAIK IQBAL PASHA**
**Advocate**
**1-7-347 TO 349, SUITE 'A' 2nd Floor, Parklane, Secunderabad-500003 Telangana, India. Ph No. 9849624743**



"బిజెపికు దేశ ప్రజల్లో 12 ఏళ్ళుగా వ్యతిరేకత ఉంది. ఇప్పుడది ఒక స్పష్టమైన రూపం దాల్చుతోంది. క్రాకోచ్ జనతా పార్టీ ఆందోళనల వేళ ఢిల్లీలో ఒక భయానక వాతావరణాన్ని సృష్టించారు. నగర రోడ్లపై దాదాపు 30వేల మంది పోలీసులను మోహరించారు. దేశ రాజధానికి రాకుండా అడ్డుకుంటున్నారు. మొత్తం ఢిల్లీని కోటగా మార్చేయాల్సిన అవసరం ఏమొచ్చింది? ఆర్ఎస్ఎస్ గూండాలకు ఉన్న స్వేచ్ఛ యువతకు ఎందుకు లేదు? మహిళలపై బిజెపి, ఆర్ఎస్ఎస్ గూండాలు దాడులు చేస్తున్నారు."

- రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అగ్రనేత

## వే'మన' పద్యం



పూజకన్న నెంచ బుద్ధి నిదానంబు
మాటకన్న నెంచ మనసు దృఢము
కులముకన్న మిగుల గుణము ప్రధానంబు
విశ్వదాభిరామ! వినుర వేమ!

# సంపాదకీయం

## సంస్కరణలతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ!

ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో దేశవ్యాప్తంగా ప్రతిపక్షాలు, క్రాకోచ్ జనతా పార్టీ ఆందోళనలు చేపడుతున్నాయి. ఓటర్ల ధ్రువీకరణ, కొత్త ఓటర్ల నమోదు, ఓట్ల తొలగింపు ప్రక్రియల్లో ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారన్న ఆరోపణలు ప్రజాస్వామ్య వ్యవస్థపై అనేక సందేహాలను రేకెత్తిస్తున్నాయి. ఈ పరిణామాలపై దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు విచారిస్తున్న నేపథ్యంలో దేశంలో ఎన్నికల వ్యవస్థ పనితీరుపై విస్తృత చర్చ జరగాల్సిన అవసరం ఏర్పడింది.ప్రజాస్వామ్యానికి ఎన్నికలే ప్రాణాధారమని చెప్పే పాలకపక్షాలు, ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించడంలో విఫలమైతే ప్రజాస్వామ్య స్ఫూర్తికే విఘాతం కలుగుతుంది. ఓటరు జాబితాలో పేర్ల తొలగింపు, కొత్త ఓటర్ల నమోదులో పారదర్శకత, ఎన్నికల సంఘం స్వతంత్రత వంటి అంశాలు కేవలం పరిపాలనా సమస్యలు కావు. అవి పౌరుల రాజ్యాంగ హక్కులకు సంబంధించిన కీలక ప్రశ్నలు. అందువల్ల సీఈసీ రాజీనామా డిమాండ్ వెనుక ఉన్న కారణాలను పరిశీలించడంతోపాటు, దేశంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం వాస్తవంగా ఎలా అమలవుతోందో సమీక్షించుకోవాలి.స్వాతంత్ర్యానంతరం జరిగిన ఎన్నికలను పరిశీలిస్తే, డబ్బు ప్రభావం, కండబలం, రిగ్గింగ్ ఆరోపణలు, కులం, మతం, ప్రాంతీయ భావోద్వేగాల వినియోగం వంటి సమస్యలు వివిధ సందర్భాల్లో ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేశాయి. లౌకికవాదాన్ని ప్రకటించే కాంగ్రెస్ కూడా ఎన్నికల రాజకీయాల్లో కుల, మత సమీకరణాలను ఉపయోగించుకుందన్న విమర్శలున్నాయి. యూపీఏ ప్రభుత్వ వైఫల్యాల నేపథ్యంలో బీజేపీ హిందుత్వ రాజకీయాలను బలంగా ముందుకు తెచ్చి అధికారంలోకి వచ్చిందనే రాజకీయ విశ్లేషణలూ ఉన్నాయి. నేడు మతపరమైన విభజనలను పెంచే రాజకీయాలు సమాజ ఐక్యతకు సవాలుగా మారుతున్నాయన్న ఆందోళన వ్యక్తమవుతోంది.ఎన్నికల్లో గెలవడానికి అపారమైన ఆర్థిక వనరులు అవసరమయ్యే పరిస్థితి నెలకొంటే, సామాన్య పౌరుడికి ఎన్నికల్లో పోటీ చేయడం కష్టసాధ్యమవుతుంది. డబ్బు, మద్యం పంపిణీ, అధికార యంత్రాంగంపై ప్రభావం చూపడం వంటి అక్రమాలను అరికట్టడంలో వ్యవస్థ విఫలమైతే ఎన్నికల్లో సమాన అవకాశాలు దెబ్బతింటాయి. ఫలితంగా ప్రజాస్వామ్యం ప్రజలందరికీ అందుబాటులో ఉండాల్సిన వ్యవస్థగా కాకుండా, సంపన్న వర్గాల ఆధిపత్యానికి వేదికగా మారే ప్రమాదం ఉంది.ఇదే సమయంలో ఎన్నికల సంఘం స్వతంత్రత అత్యంత కీలకం. ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర కమిషనర్ల నియామక ప్రక్రియపై రాజకీయ ప్రభావం ఉండకూడదు. నియామకాల్లో పారదర్శకత, స్వతంత్ర పరిశీలన, జవాబుదారీతనం ఉండాలి. ఎన్నికల సంఘం తీసుకునే నిర్ణయాలు ఏ రాజకీయ పక్షానికీ అనుకూలంగా ఉన్నాయనే అనుమానాలకు తావివ్వకూడదు. ఓటర్ల జాబితా సవరణలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా, తొలగింపునకు గురైనవారికి న్యాయం పొందే అవకాశం కల్పించాలి. ఈ అంశాల్లో ఎన్నికల సంఘం విశ్వసనీయతను నిలబెట్టుకోవడం అత్యవసరం.అయితే, జ్ఞానేశ్ కుమార్ రాజీనామా ఒక్కటే సమస్యకు పరిష్కారమని భావించడం సరిపోదు. వ్యక్తుల మార్పుతో పాటు వ్యవస్థాగత లోపాలను సరిదిద్దాలి. ఎన్నికల సంఘం నియామక విధానం, ఎన్నికల ఖర్చుల నియంత్రణ, రాజకీయ పార్టీల ఆర్థిక లావాదేవీల పారదర్శకత, ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియ, ఎన్నికల అక్రమాలపై తక్షణ చర్యలు వంటి అంశాల్లో సమగ్ర సంస్కరణలు అవసరం. రాజ్యాంగంలోని ఎన్నికలకు సంబంధించిన నిబంధనలను సమీక్షించి, ప్రజాస్వామ్య విలువలను మరింత బలోపేతం చేసే మార్పులపై చర్చ జరగాలి.సీఈసీ రాజీనామాను కోరుతున్న ఉద్యమాలు ఈ విస్తృత లక్ష్యాన్ని కూడా ముందుకు తీసుకెళ్లాలి. కాంగ్రెస్‌తో పాటు ఇతర ప్రధాన రాజకీయ పార్టీలు ఎన్నికల వ్యవస్థలోని లోపాలను విమర్శిస్తున్నప్పటికీ, తాము అధికారంలో ఉన్నప్పుడు అనుసరించిన విధానాలపైనా ఆత్మపరిశీలన చేసుకోవాలి. ప్రతిపక్షాల పోరాటం ఒక వ్యక్తి రాజీనామాతో ముగిసిపోకుండా, ఎన్నికల వ్యవస్థలో శాశ్వత మార్పులకు దారితీయాలి.దేశాన్ని వేధిస్తున్న నిరుద్యోగం, అవినీతి, పేదరికం, విద్యా-ఉపాధి అవకాశాల కొరత వంటి మౌలిక సమస్యలను కూడా ప్రజాస్వామ్య ఉద్యమాలు తమ కార్యాచరణలో భాగం చేసుకోవాలి. యువత, విద్యార్థులు, కార్మికులు, గ్రామీణ-పట్టణ పేదలు ప్రజాస్వామ్య పరిరక్షణలో చురుకుగా పాల్గొన్నప్పుడే ఉద్యమానికి విస్తృత ప్రజా పునాది ఏర్పడుతుంది. ఎన్నికల విధానంలో మార్పులు కోరుతూ పోరాడే శక్తులు ప్రజల జీవన సమస్యలపైనా నిరంతరం ఉద్యమించాలి.ప్రజాస్వామ్యం అంటే కేవలం ఐదేళ్లకోసారి ఓటు వేయడం మాత్రమే కాదు. ప్రతి పౌరుడికి సమాన రాజకీయ హక్కులు, ఎన్నికల్లో సమాన అవకాశాలు, స్వతంత్ర ఎన్నికల సంఘం, జవాబుదారీ ప్రభుత్వం ఉండటం కూడా ప్రజాస్వామ్యంలో అంతర్భాగాలే. అందువల్ల సీఈసీ రాజీనామా డిమాండ్‌ను విస్తృత ప్రజాస్వామ్య సంస్కరణలతో అనుసంధానించాలి. రాజ్యాంగ విలువలను కాపాడుతూ, ఎన్నికల వ్యవస్థను పారదర్శకంగా, జవాబుదారీగా, ప్రజలకు మరింత చేరువగా మార్చే దిశగా యువత, విద్యార్థులు, కార్మికులు, పేదలు ఐక్యంగా ఉద్యమించాలి. వ్యక్తుల మార్పు కంటే వ్యవస్థలో మార్పే ప్రజాస్వామ్యానికి నిజమైన రక్షణ.


రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.
voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020


## ఓటరు విశ్వాసమే ప్రజాస్వామ్య బలం!

ఓటు ప్రజాస్వామ్యం పౌరుడికి అందించిన అమూల్యమైన అవకాశం. సామాజిక స్థితి, ఆర్థిక స్థోమత, విద్యార్హతలతో సంబంధం లేకుండా ప్రతి అర్హుడికీ దేశ భవిష్యత్తును నిర్ణయించడంలో సమాన భాగస్వామ్యం కల్పిస్తుంది. పోలింగ్ కేంద్రంలో నమోదయ్యే ప్రతి ఓటు ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపం. ఈ హక్కును సద్వినియోగం చేసుకోవడం పౌరుల బాధ్యత అయితే, ఎన్నికల ప్రక్రియలో వారి భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం సమాజమంతటి ఉమ్మడి కర్తవ్యం. అవగాహన, పారదర్శకత, నమోదు, సవరణ ప్రక్రియలను స్థానిక భాషల్లో వివరించడం భాగస్వామ్యాన్ని సులభతరం చేస్తుంది.డిజిటల్ సేవలతో పాటు ప్రత్యక్ష సహాయ కేంద్రాలు కూడా అవసరం. వృద్ధులు, దివ్యాంగులు, వలస కార్మికులకు ప్రత్యేక సహాయం అందించడం ఎన్నికల భాగస్వామ్యాన్ని విస్తరిస్తుంది. విద్యాసంస్థల్లో నమోదు శిబిరాలు, గ్రామాల్లో అవగాహన సమావేశాలు, కార్యాలయాల్లో ఓటరు వివరాల పరిశీలన కార్యక్రమాలు నిర్వహించవచ్చు. అందుబాటులో ఉన్న సాంకేతిక సేవలను వినియోగించుకునేందుకు స్వ

> భారత ఎన్నికల సంఘం విడుదల చేసిన 2024 లోక్‌సభ ఎన్నికల తుది గణాంకాల ప్రకారం, దేశంలో 97.98 కోట్ల మంది నమోదిత ఓటర్లు ఉన్నారు. మొత్తం 64.64 కోట్ల ఓట్లు పోలయ్యాయి. దేశవ్యాప్తంగా 10,52,664 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. పర్వత ప్రాంతాలు, అటవీ గ్రామాలు, దీవులు, మహానగరాల వరకు విస్తరించిన ఈ ఎన్నికల నిర్వహణ భారత ప్రజాస్వామ్య విశిష్టతకు నిదర్శనం. ఎన్నికల సిబ్బంది, భద్రతా దళాలు, స్థానిక యంత్రాంగం సమన్వయం ఈ మహత్తర ప్రక్రియను సాధ్యం చేస్తుంది. మహిళల భాగస్వామ్యం మరింత స్ఫూర్తిదాయకం. 2024 ఎన్నికల్లో నమోదిత మహిళా ఓటర్లు 47.63 కోట్లు; మొత్తం ఓటర్లలో వారి వాటా 48.62 శాతం. సూరత్‌ను మినహాయించిన గణాంకాల్లో మహిళల పోలింగ్ 65.78 శాతం కాగా, పురుషులది 65.55 శాతం. నమోదిత దివ్యాంగ ఓటర్లు 90.29 లక్షలు ఉన్నారు. ఉపయోగపడతాయి.

పరస్పర సహకారం ఓటరు విశ్వాసాన్ని మరింత బలోపేతం చేస్తాయి.భారత ఎన్నికల సంఘం విడుదల చేసిన 2024 లోక్‌సభ ఎన్నికల తుది గణాంకాల ప్రకారం, దేశంలో 97.98 కోట్ల మంది నమోదిత ఓటర్లు ఉన్నారు. మొత్తం 64.64 కోట్ల ఓట్లు పోలయ్యాయి. దేశవ్యాప్తంగా 10,52,664 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. పర్వత ప్రాంతాలు, అటవీ గ్రామాలు, దీవులు, మహానగరాల వరకు విస్తరించిన ఈ ఎన్నికల నిర్వహణ భారత ప్రజాస్వామ్య విశిష్టతకు నిదర్శనం. ఎన్నికల సిబ్బంది, భద్రతా దళాలు, స్థానిక యంత్రాంగం సమన్వయం ఈ మహత్తర ప్రక్రియను సాధ్యం చేస్తుంది.మహిళల భాగస్వామ్యం మరింత స్ఫూర్తిదాయకం. 2024 ఎన్నికల్లో నమోదిత మహిళా ఓటర్లు 47.63 కోట్లు; మొత్తం ఓటర్లలో వారి వాటా 48.62 శాతం. సూరత్‌ను మినహాయించిన గణాంకాల్లో మహిళల పోలింగ్ 65.78 శాతం కాగా, పురుషులది 65.55 శాతం. నమోదిత దివ్యాంగ ఓటర్లు 90.29 లక్షలు ఉన్నారు. విభిన్న వర్గాల భాగస్వామ్యం ప్రజాస్వామ్యానికి విస్తృతమైన సామాజిక పునాదిని అందిస్తుంది. ఈ చైతన్యాన్ని ప్రతి ఎన్నికలోనూ ముందుకు తీసుకెళ్లాలి.ఓటర్ల జాబితాల నిరంతర నవీకరణ ఈ ప్రయాణంలో ముఖ్యమైన భాగం. కొత్తగా అర్హత పొందిన యువతను నమోదు చేయడం, చిరునామా మార్పులను సవరించడం, ద్వంద్వ నమోదులను పరిష్కరించడం ద్వారా జాబితాల ఖచ్చితత్వం పెరుగుతుంది. బూత్‌స్థాయి అధికారులు, స్థానిక సంస్థలు, పౌర సంఘాలు కలిసి నిర్వహించే అవగాహన కార్యక్రమాలు ప్రజలకు ఉపయోగపడతాయి. స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు తోడ్పడాలి.పౌరులు ఎన్నికలకు ముందే తమ పేరు, చిరునామా, పోలింగ్ కేంద్రం వివరాలను పరిశీలించుకోవాలి. ఓటరు గుర్తింపు కార్డుతోపాటు జాబితాలో నమోదు కూడా నిర్ధారించుకోవడం ఉపయోగకరం. కుటుంబంలోని యువత పెద్దలకు సహాయం చేయాలి. ఉద్యోగం, చదువు కారణంగా నివాసం మారినవారు సంబంధిత నియమాలకు అనుగుణంగా వివరాలను సవరించుకోవాలి. ముందస్తు పరిశీలన పోలింగ్ రోజున సౌకర్యవంతంగా ఓటు వేయడానికి తోడ్పడుతుంది.ఓటరు అవగాహన నమోదు దగ్గరే ముగియకూడదు. అభ్యర్థుల వివరాలు, ప్రజా సమస్యలు, అభివృద్ధి ప్రాధాన్యాలను తెలుసుకుని స్వతంత్రంగా నిర్ణయం తీసుకోవాలి. సామాజిక మాధ్యమాల్లో కనిపించే సమాచారాన్ని నిర్ధారించుకున్న తర్వాతే పంచుకోవాలి. భిన్నాభిప్రాయాలను గౌరవిస్తూ ప్రశాంతమైన చర్చలను ప్రోత్సహించాలి. సమాచారం ఆధారంగా తీసుకున్న నిర్ణయం ఓటు విలువను మరింత పెంచుతుంది.ప్రజాస్వామ్య బలం ప్రభుత్వ సంస్థలు, ఎన్నికల యంత్రాంగం, పౌర సమాజం, ఓటర్ల ఉమ్మడి కృషిలో ఉంది. ప్రతి అర్హుడి భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం ద్వారా ఈ వ్యవస్థను మరింత సమగ్రంగా తీర్చిదిద్దవచ్చు.



సి. హెచ్. ప్రతాప్
77938 00743

## చరిత్ర సృష్టించిన అడుగు వికసిత భారత్ వైపు

సేవ అనేది ఒకరి అంతరాత్మ
నుండి వచ్చే నిరంతర ప్రవాహం
ఒక గొప్ప నాయకుడు సమాజ
మార్పు కోసం తన జీవితాన్నే
ధారపోస్తాడు.గుజరాత్ ముఖ్య
మంత్రిగా మొదలై భారత్ ప్రధాన
మంత్రిగా సాగుతున్న నరేంద్ర
మోడి గారి పాతికేళ్ల ప్రజా జీవితం
కేవలం ఒక కాలం కాదు. అది
భారత దేశ చరిత్రను తిరిగి రాసిన
ఒక మహా ప్రస్థానం కోట్లాదిమంది
గుండెల్లో ఆశలు నింపిన ఒక
నిరంతర శ్రమయాగం.

సామాన్యునిగా జీవితం మొదలై
అసామాన్య స్థితికి చేరిన ప్రజా
నాయకుడు నరేంద్ర మోదీ
పేద కుటుంబంలో జన్మించి
దేశ భవిష్యత్తును మార్చిన
వెలుగు నరేంద్ర మోదీ
పాతికేళ్ల నిరంతర ప్రజా సేవా
భారతావనికి అందించెను
నవ శఖాన్ని కలిగించెను
ప్రజల్లో సరి కొత్త ఆశ

జన్ ధన్ ఖాతాతో పేదలకు
అండగా నిలిచావు
స్వచ్ఛ బారత్ అంటూ ప్రతి ఊరిని
మార్చావు
ఉజ్వల కాంతితో పేదరికపు
కన్నీళ్ళు తుడిచావు
ఆయుష్మాన్ భరోసాతో ఆరోగ్య
భాగ్యం ఇచ్చావు

పి ఎం కిసాన్ సాయంతో
రైతులకు తోడై నిలిచావు
డిజిటల్ మంత్రంతో పాలనను
ప్రజల వద్దకు తెచ్చావు
మేక్ ఇన్ ఇండియా అంటూ
సరికొత్త చరిత్ర సృష్టించావు
ఆత్మనిర్భర నినాదంతో స్వదేశీ
శక్తిని పెంచావు

వందే భారత్ రైళ్ల తో దేశ వేగాన్ని
పెంచావు
చంద్రయాన్ గగన్ యాన్ ల తో
నింగిని తాకావు
జి 20 వేదికపై జగత్తుకు నిర్దేశం
చేశావు ప్రపంచదేశాల
ముందు భారత్ ను గెలిపించావు
ఆర్టికల్ 370 రద్దుతో కాశ్మీర్లో
మువ్వన్నెల జెండా ఎగ్రేశావు
అయోధ్యలో రామయ్య మందిరాన్ని
నిలిపావు
సరిహద్దుల్లో శత్రువుల గుండెల్లో
సర్జికల్ స్ట్రైక్ వణుకు
ప్రపంచ వేదికలపై భారత వినిపించే
విశ్వ గురువు పలుకు
సబ్కా సాత్ సబ్ కా వికాస్ అంటూ
ప్రతి భారతీయుడి గుండెల్లో నిలిచావు
కోవిడ్ చీకట్లో కోట్లాది మందికి
ఉచిత రేషన్ కాంతి

అభివృద్ధి మంత్రముతో దేశమంతా
వెల్లివిరిసిన క్రాంతి
జాతి నిర్మాణములో అలు పెరుగని
తపోదనుడు మోదీ
భారతబగ్య విధాతవై సాగుతున్న
యుగకర్త మోదీ గారు పాతికేళ్ల
నిరంతర శ్రమకు జోహార్లు
దేశాన్ని ప్రేమించడమంటే కేవలం
నినాదాలు చేయడం కాదు.దేశ
శ్రేయస్సుకై నిరంతరం శ్రమించడం
స్వామి వివేకానంద.
జాతి నిర్మాణంలో అలు పెరుగక
శ్రమిస్తున్న నవ భారతి రూప శిల్పి
పాతికేళ్ల ప్రస్థానం భవిషత్తు
తరాలకు ఒక నిఘంటువు.
సంకల్ప బలంతో మోదీ పాలనా
నాయకత్వం వికసిత భారత వైపు
సాగే నీ ప్రగతి ప్రయాణానికి
నీరాజనాలు మీ
నేతృత్వంలో
దేశం అన్ని
రంగాల్లో దూసుకు
వెళుతుందని
ఆశిద్దాం.



నేదునూరి కనకయ్య
9440245771

## బాలికల భవిష్యత్తుకు భరోసా ఏదీ?

ఆధునికత, శరవేగంతో విస్తరిస్తున్న సాంకేతిక విజ్ఞానం, మానవాళి సాధిస్తున్న నాగరిక పురోగతి ఎంతగా విలసిల్లుతున్నా, సమాజంలోని కొన్ని మూఢ భావజాలాలు ఇంకా తిరోగమన దిశలోనే పయనిస్తున్నాయి. ఆడపిల్లలు, మగపిల్లల మధ్య కొనసాగుతున్న వివక్షే దీనికి ప్రత్యక్ష నిదర్శనం.
గతంలో ఇంట్లో ఆడపిల్ల పుడితే, ఇంటికి వెలుగు వచ్చిందని ఆనందించేవారు. కానీ ప్రస్తుత కాలంలో సాంకేతికత పెరిగిన కొద్దీ, ఆడపిల్ల పుట్టుకను ఒక సామాజిక, ఆర్థిక భారంగా భావించే సంకుచిత ధోరణులు పెరుగుతుండటం విచారకరం. 'ఆకాశంలో సగం, అవకాశాల్లో సగం' అనే నినాదం దశాబ్దాలుగా మన వినికిడిలో ఉన్నప్పటికీ, అది కేవలం సభలు, సమావేశాలకే పరిమితమైపోయింది తప్ప ఆచరణ రూపాన్ని సంతరించుకోలేదు. ఒకవైపు స్త్రీని పూజనీయ శక్తిగా ఆకాశానికెత్తుతూనే, మరోవైపు అనునిత్యం వారిపై జరుగుతున్న అరాచకాలు, హింసాత్మక ఘటనలు మన సామాజిక వైఫల్యాన్ని కళ్లకు కడుతున్నాయి.

ఈ దుస్థితి అంతమై, ప్రతి ఆడపిల్ల స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకున్నప్పుడే సమాజానికి నిజమైన వెలుగు, నాగరికతకు పరిపూర్ణమైన అర్థం చేకూరుతుంది.
శాస్త్ర సాంకేతిక రంగాలలో శరవేగంతో దూసుకుపోతున్నామని ఎంతగా గొప్పలు చెప్పుకుంటున్నా, బాలికల భద్రత, వారి ప్రాథమిక హక్కుల పరిరక్షణ విషయంలో మనం ఎక్కడున్నామనేది ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఉదయం ఇంటి నుంచి బడికో, కళాశాలకో, బయటి పనులకో వెళ్లిన బాలిక క్షేమంగా తిరిగి ఇంటికి వస్తుందనే భరోసా నేటికీ కరువైంది. మార్గమధ్యంలో ఎక్కడ, ఏ రూపంలో ప్రమాదం పొంచి ఉందో ఊహించలేని భయానక వాతావరణం నెలకొంది. నిర్భయ, అభయ, దిశ వంటి కఠిన చట్టాలు అమల్లోకి వచ్చినా, పోక్సో వంటి సమగ్ర శాసనాలు ఉన్నప్పటికీ అత్యాచారాలు, దాడుల ఘటనలు లేని రోజంటూ ఉండటం లేదు.
నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం, దేశంలో పిల్లలపై జరుగుతున్న నేరాల సంఖ్య 1,77,335 నుంచి ఏకంగా 1,87,702కి పెరిగింది. అంటే దాదాపు 5.9% పెరుగుదల నమోదైంది. బాలికలపై జరిగే నేరాల రేటు ప్రతి లక్ష మంది చిన్నారులకు దాదాపు 40కి చేరడం తీవ్రమైన ఆందోళన కలిగిస్తోంది. నమోదవుతున్న మొత్తం కేసుల్లో కిడ్నాప్‌లు, లైంగిక వేధింపులు, అలాగే పోక్సో చట్టం కింద నమోదవుతున్న అత్యాచార కేసులే అత్యధికంగా (ఒక్క పోక్సో చట్టం పరిధిలోనే 69,000 పైగా కేసులు) ఉండటం ఆందోళనకరమైన నిజం. ప్రతిరోజూ దేశంలో సగటున వందలాది మంది చిన్నారులు లైంగిక లేదా శారీరక హింసకు గురవుతున్నారని ఈ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. దాదాపు 8 దశాబ్దాల స్వతంత్ర భారతంలో నేటికీ మనం మహిళలు, పిల్లల ప్రాథమిక హక్కులు, వారి భద్రత, లైంగిక దాడులు, హత్యల లెక్కల గురించే చర్చించుకోవాల్సి రావడం అత్యంత విచారకరం. 'బేటీ పఢావో.. బేటీ బచావో' వంటి ప్రభుత్వ పథకాలు, ప్రచారాలు అమలులో ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఆడపిల్లల పట్ల చులకన భావం, పురుషాధిక్య వివక్ష రూపుమాపబడలేదు. మహిళలను సమాన మానవులుగా గుర్తించని కుసంస్కారం, హక్కుల నిరాకరణ, గృహహింస, మానసిక వేధింపులు నేటికీ సమాజంలో ఆవరించి ఉన్నాయి. ఈ తీవ్రమైన పరిస్థితుల నేపథ్యంలో ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ బాలికల దినోత్సవ ప్రాధాన్యతను గుర్తించింది. బాలికల హక్కుల పరిరక్షణ, వారిపై జరుగుతున్న మానవ హక్కుల ఉల్లంఘనలకు స్వస్తి చెప్పడం, ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది బాలికలు ఎదుర్కొంటున్న సవాళ్లను వెలుగులోకి తీసుకురావడం లక్ష్యంగా డిసెంబర్ 19, 2011న ఐక్యరాజ్యసమితి తీర్మానం చేసింది.
అందులో భాగంగా ప్రతి సంవత్సరం అక్టోబర్ 11న అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తున్నారు.ప్రతి ఏటా ఒక నిర్దిష్టమైన నినాదంతో కార్యాచరణను రూపొందిస్తున్నట్లే, బాలికలు తమ భవిష్యత్తును స్వీయ దిశానిర్దేశంతో నిర్మించుకోవడానికి, కౌమార దశలోని ఆడపిల్లలు ఎదుర్కొనే విభిన్న సమస్యలు, హింసను అంతం చేయడానికి ప్రపంచ దేశాలు పిలుపునిస్తున్నాయి. కౌమార దశ అనేది ఒక బాలిక మహిళగా రూపాంతరం చెందే అత్యంత కీలకమైన ఘట్టం. ఈ దశలో వారికి సరైన అవగాహన, సామాజిక చైతన్యం అందుబాటులో ఉండటం ఎంతో అవసరం.

> బాలికల హక్కుల పరిరక్షణ, వారిపై జరుగుతున్న మానవ హక్కుల ఉల్లంఘనలకు స్వస్తి చెప్పడం, ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది బాలికలు ఎదుర్కొంటున్న సవాళ్లను వెలుగులోకి తీసుకురావడం లక్ష్యంగా డిసెంబర్ 19, 2011న ఐక్యరాజ్యసమితి తీర్మానం చేసింది. అందులో భాగంగా ప్రతి సంవత్సరం అక్టోబర్ 11న అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. ప్రతి ఏటా ఒక నిర్దిష్టమైన నినాదంతో కార్యాచరణను రూపొందిస్తున్నట్లే, బాలికలు తమ భవిష్యత్తును స్వీయ దిశానిర్దేశంతో నిర్మించుకోవడానికి, కౌమార దశలోని ఆడపిల్లలు ఎదుర్కొనే విభిన్న సమస్యలు, హింసను అంతం చేయడానికి ప్రపంచ దేశాలు పిలుపునిస్తున్నాయి. కౌమార దశ అనేది ఒక బాలిక మహిళగా రూపాంతరం చెందే అత్యంత కీలకమైన ఘట్టం.

దీనికి అత్యంత శక్తివంతమైన సాధనం విద్య మాత్రమే. గుణాత్మకమైన విద్య ద్వారానే సామాజిక అజ్ఞానాన్ని, అనాలోచిత దుర్మార్గాలను అంతం చేయడం సాధ్యమవుతుంది. బాలికలను స్వీయ శక్తి వంతులుగా తీర్చిదిద్దడానికి, వారిపై జరుగుతున్న హింసను శాశ్వతంగా ఆపడానికి ప్రభుత్వం, పౌర సమాజం, స్వచ్ఛంద సంస్థలు ఏకమై వినూత్న ప్రణాళికలతో, చిత్తశుద్ధితో కృషి చేయాలి. కిశోర బాలికలకు నాణ్యమైన విద్యతో పాటు సాంకేతిక పరిజ్ఞానం, వృత్తి విద్యా అవకాశాలు కల్పించాలి. ఆత్మరక్షణకు అవసరమైన శిక్షణను చిన్నతనం నుంచే అందించాలి. ఆర్థిక, సామాజిక, ఆరోగ్య అంశాలపై సమగ్రమైన చైతన్యాన్ని తీసుకురావాలి.అన్నింటికంటే ముఖ్యంగా, సమాజంలో వేళ్లూనుకున్న పురుషస్వామ్య దృక్పథంలో విప్లవాత్మకమైన మార్పు రావాలి. కుటుంబాల్లో పిల్లల పెంపకం నుంచే స్త్రీ, పురుష సమానత్వ భావనలను నేర్పించాలి. ఏ రూపంలోనూ ఆడపిల్ల తక్కువ అనే చులకన భావన అంకురించకుండా పెంపకం సాగాలి. ఏడాదికి ఒక రోజు అంతర్జాతీయ దినోత్సవం పేరుతో హడావిడి చేసి, ప్రచార ఆర్భాటాలు ప్రదర్శిస్తే సరిపోదు. చట్టాలు మాత్రమే అన్ని సమస్యలకూ సర్వరోగ నివారిణి కాజాలవు. మానవీయ విలువలు, నైతిక పరివర్తన, దైవభీతి, పరస్పర గౌరవ భావం పెంపొందినప్పుడే బాలికలకు, మహిళలకు నిజమైన భద్రత, భరోసా లభిస్తాయి.



యండి. ఉస్మాన్ ఖాన్
9912580645



# జాతీయం-అంతర్జాతీయం



## రష్యా-ఉక్రెయిన్ ఒప్పందం.. తనకు తెలియదన్న జెలెన్స్కీ



**రష్యా,**

ఉక్రెయిన్ మధ్య తక్షణమే ఇంధన వనరుల కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదివారం ప్రకటించారు. విద్యుత్, చమురు, గ్యాస్ వంటి ఇంధన మౌలిక సదుపాయాలపై పరస్పర దాడుల నిలిపివేతకు ఇరుపక్షాలూ అంగీకరించాయన్నారు. ఈ ప్రకటనపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ (Zelensky) స్పందించారు. ఈ విషయం తనకు ముందుగా తెలియదన్నారు. మీడియాలో వచ్చిన వార్తలు చూసే తాను తెలుసుకున్నట్లు చెప్పారు. అయితే ఇది మంచి పరిణామమేనని పేర్కొన్నారు. ఈ ఒప్పందానికి రష్యా కట్టుబడి ఉంటే తమకు ఎటువంటి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. తమ ఇంధన సదుపాయాలపై మాస్కో దాడులు ఆపిన వెంటనే.. తాము కూడా ఆ దేశ చమురు శుద్ధి కర్మాగారాలపై దాడులు నిలిపివేస్తామని జెలెన్స్కీ వెల్లడించారు. ఉద్రిక్తతలను తగ్గించే ఏ చర్యలైనా ఇరుపక్షాల నుంచి ఉన్నప్పుడే శాంతి స్థాపన సాధ్యమవుతుందన్నారు.కాగా.. ట్రంప్ ప్రకటనపై అటు రష్యా ఇప్పటి వరకూ స్పందించలేదు సరికదా.. ప్రకటన అనంతరం ఉక్రెయిన్‌లోని పలు ప్రాంతాలపై దాడులు చేపట్టడం గమనార్హం. దేశ రాజధాని కీవ్ సహా పలు ప్రాంతాల్లోని విద్యుత్ కేంద్రాలపై డ్రోన్ దాడులు జరగడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ వెల్లడించారు. ఖర్కీవ్‌లో ఒక దుకాణంపై జరిగిన దాడిలో ఆరుగురు ప్రాణాలు కోల్పోగా.. 20 మందికి పైగా గాయపడినట్లు తెలిపారు. ఇకనైనా దాడులు ఆపకపోతే రష్యా తీవ్ర పర్యవసానాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

# జిబూటీలో పడవ ప్రమాదం..

- 139 మంది మృతి
- మరో 116 మంది గల్లంతు

**జిబూటీ సిటీ :**

తూర్పు ఆఫ్రికా దేశమైన జిబూటీ తీరంలో పడవ బోల్తా పడి 139 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 116 మంది గల్లంతయ్యారు. ఐక్యరాజ్య సమితికి చెందిన ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ మైగ్రేషన్ (ఐఒఎం) ఆదివారం వెల్లడించిన వివరాల ప్రకారం...ఈ నెల 8వ తేదీ రాత్రి జిబూటీ నుంచి సుమారు 350 మంది ప్రయాణికులతో నౌక యెమెన్‌కు బయలుదేరింది. ఒబాక్ పట్టణానికి ఉత్తరాన ఉన్న గుహెరా సమీపంలో బోల్తా పడింది.

**సహాయక కార్యక్రమాల్లో జీబూటియన్ అధికారులతో పాటు ఐఒఎం బృందాలు క్షేత్రస్థాయిలో ఉన్నాయి.**

ఇప్పటి వరకూ వెలికితీసిన 109 మృతదేహాలలో 52 మంది పురుషులు, 42 మంది మహిళలు, 15 మంది చిన్నారులు ఉన్నారు. చిన్నారుల్లో తొమ్మిది మంది



బాలికలు, ఆరుగురు బాలురు ఉన్నారని ఐఒఎం పేర్కొంది. మరో 80 మందికి పైగా ప్రాణాలతో బయటపడ్డారు.బాధితులంతా ఇథియోపియా జాతీయులే. గల్లంతైన వారి కోసం ముమ్మరంగా గాలింపు చర్యలను నిర్వహిస్తున్నారు. లభ్యమైన మృతదేహాలకు గౌరవప్రదంగా అంత్యక్రియలను నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే, ప్రాణాలతో బయటపడిన వారికి వలసదారుల ప్రతిస్పందన కేంద్రంలో తగిన ఆరోగ్య సంరక్షణను అందిస్తున్నారు.

**వీరికి తాత్కాలిక ఆశ్రయం కల్పించడంతో పాటు,**

వారి కుటుంబాలను తిరిగి కలుసుకోవడానికి సహాయం చేస్తున్నట్లు ఐఒఎం తెలిపింది. కాగా, ఈ విషాద ప్రమాదాన్ని 'ఆర్థిక అవకాశాల కోసం ఈ వలస మార్గంలో ప్రయాణించే వలసదారులు ఎదుర్కొనే కష్టాలకు ఒక స్పష్టమైన గుర్తు' గా జిబూటిలోని ఐఓఎం చీఫ్ ఆఫ్ మిషన్ అలెగ్జాండర్ కోయిసాక్ అభివర్ణించారు.

**తూర్పు ఆఫ్రికాకు చెందిన ప్రజలు గల్ఫ్ దేశాలకు వలస వెళ్లడానికి ఈ మార్గాన్నే ఆశ్రయిస్తుంటారు.**

హార్న్ ఆఫ్ ఆఫ్రికా (ఆఫ్రికా కొమ్ము) గా పేర్కొనే ప్రాంతంలో ఉన్న జిబూటీ గుండా ప్రయాణించి, బాబ్ ఎల్ మండేబ్ జలసంధి దాటి యెమెన్‌లోకి ప్రవేశిస్తారు.అక్కడి నుంచి అంతింగా భద్రత, స్థిరత్వం కోసం గల్ఫ్ దేశాలకు చేరుకుంటారు. ఏడాదికి కనీసం పదివేల మంది ఈ మార్గం గుండా ప్రయాణిస్తారని ఒక అంచనా.

**ఒఓఎం డిస్‌ప్లేస్‌మెంట్ ట్రాకింగ్ మ్యాట్రిక్స్ ప్రకారం గత నెల సెప్టెంబర్ 10**

నుంచి ఇప్పటి వరకూ కేవలం ఇథియోపియా నుంచి జిబూటీకి 20 వేల మంది వలసదారులు చేరుకున్నారు. గతేడాది బాబ్ ఎల్ మండేబ్ జలసంధి మార్గంలో జరిగిన ప్రమాదాల్లో 900 మందికి పైగా మరణించడం లేదా గల్లంతవ్వడం జరిగింది.

## కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌కు చేరుకున్న 'ఇండియా బ్లాక్' నేతలు

**న్యూఢిల్లీ :**

నిరసన ప్రదర్శనలో భాగంగా ఇండియా బ్లాక్ నేతలు కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌కు చేరుకున్నారు. ప్రతిపక్షాల ఐక్యతను ప్రదర్శిస్తూ, ఎంపిల నేతృత్వంలో వారంతా సోమవారం ఢిల్లీ వీధుల గుండా భారీ ప్రదర్శన చేపట్టారు. కాంగ్రెస్ ఎంపి రాహుల్ గాంధీ, ప్రియాంకగాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే,

**పశ్చిమబెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీలు కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌కు చేరుకున్నారు.**

ఈ సందర్భంగా లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మాట్లాడారు. 'ఓట్ల చోరీ'కి వ్యతిరేఏకంగా సుప్రీంకోర్టుకు సాగుతున్న ఇండియా బ్లాక్ ర్యాలీలో పౌరులు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఆదేశాల మేరకు ఇండియా బ్లాక్ పిటిషన్ దాఖలు చేయడానికి సిద్ధమవతుందని అన్నారు. 'చలో ఢిల్లీ' అనే హ్యాష్‌ట్యాగ్‌తో సోషల్‌మీడియా ఎక్స్‌లో



రాహుల్ గాంధీ ఒక పోస్ట్ చేశారు. ప్రజాస్వామ్య, రాజ్యాంగ విలువలను పరిరక్షించే లక్ష్యంతో జరిగే నిరసన ప్రదర్శనలో పాల్గొనడానికి సెంట్రల్ ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్‌కు ప్రజలు తరలిరావాలని పేర్కొన్నారు.

**తాము సిజెఐకి లేఖ రాశామని, పిటిషన్ దాఖలు చేయాలని ఆదేశించారని అన్నారట .**

ఇప్పుడు ఓట్ల చోరీ కి వ్యతిరేకంగా ఇండియా బ్లాక్ సుప్రీంకోర్టుకు ర్యాలీ చేపడుతుందని అన్నారు. అనంతరం పిటిషన్ దాఖలు చేస్తామని అన్నారు.

# చట్టాలకు అతీతంగా.. మస్క్ వివాదాలు!

**రష్యా**

ప్రపంచంలోనే అత్యధికంగా 241 మిలియన్ల మంది ఎక్స్ ఫాలోవర్లు.. కొన్ని దేశాల జీడీపీలు కలిపినా పోటీపడలేనంత సంపద.. టెక్నాలజీ, ఇంటర్నెట్, సోషల్‌మీడియాపై తిరుగులేని పట్టు.. ఇవన్నీ కలిపి అమెరికా కుబేరుడు ఎలాన్ మస్క్ (Elon Musk)ను అత్యంత శక్తిమంతుడిగా మార్చేశాయి. వీటిని వాడుకొని మస్క్ తరచూ ఇతర దేశాల అంతర్గత విషయాల్లో జోక్యం చేసుకొంటున్నారనే విమర్శలు గత కొన్నేళ్లుగా ఉన్నాయి. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నుకొన్న దేశాధినేతలనే తూలనాడిన చరిత్ర ఆయనకు ఉంది. ఇక తనకు అడ్డొచ్చిన న్యాయమూర్తులను నియంతలుగా చిత్రీకరించేందుకు యత్నించిన సందర్భాలూ ఉన్నాయి. ఇప్పుడు తాజాగా భారత్‌లో పారిశ్రామికవేత్తలను అడ్డం పెట్టుకొని.. మన ప్రభుత్వంతో జగడానికి సిద్ధమయ్యారు. ఈ సందర్భంగా గతంలో మస్క్‌కు వివిధ దేశాలతో ఉన్న విభేదాలను ఓసారి గుర్తుచేసుకుందాం..

**యూకే ప్రభుత్వంతో గోల**

2024 జులైలో యూకే (UK)లో వలసలకు వ్యతిరేకంగా సంప్రదాయవాదులు ఇంగ్లాండ్, నార్త్ ఐర్లాండ్‌లో అల్లర్లకు దిగారు. అదే సమయంలో మస్క్ అక్కడి కీర్ స్టార్మర్ ప్రభుత్వాన్ని 'నిరంకుశ పాలన'గా అభివర్ణించారు. 'అంతర్యుద్ధం తప్పదు' అని, యూకేలో కొత్తగా తెచ్చిన న్యూ ఫామ్ ఇన్‌హెరిటెన్స్ పన్ను విషయంలో అక్కడి ప్రధాని స్టాలిన్‌లా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గ్రూమింగ్ గ్యాంగ్‌ల విషయంలో స్టార్మర్ వైఖరిని తప్పుపట్టి.. కింగ్ చార్లెస్ ఈ ప్రభుత్వాన్ని రద్దు చేయాలంటూ డిమాండ్ చేశారు. నాడు మస్క్ జోక్యానికి కళ్లెం వేసేలా.. ఆన్‌లైన్ సేఫ్టీ యాక్ట్ కింద జరిమానాలు, కఠిన చర్యలు ఉంటాయని ప్రభుత్వం హెచ్చరించింది. అంతేకాదు.. ప్రభుత్వ పదవుల్లోని వారు మస్క్‌కు గట్టిగా సమాధానం ఇచ్చారు.

**బ్రెజిల్ సుప్రీంకోర్టును ధిక్కరించి.. ఆపై లొంగిపోయి..**

దాదాపు రెండేళ్ల కిందట బ్రెజిల్‌లో తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తున్న కొన్ని ఖాతాలను బ్లాక్ చేయాలని ఆ దేశ సుప్రీంకోర్టు న్యాయమూర్తి అలెగ్జాండర్ డిమోరెస్ 'ఎక్స్'ను ఆదేశించారు. వాక్‌స్వేచ్ఛ పేరు చెప్పి ఆ ఖాతాలను బ్యాన్ చేసేందుకు మస్క్ నిరాకరించారు. దీంతో 'ఎక్స్' సిబ్బందిని అరెస్టు చేస్తామని న్యాయమూర్తి హెచ్చరించడంతో.. బ్రెజిల్ నుంచి తమ సిబ్బందిని మస్క్ తొలగించారు. ఆ తర్వాత 2024 ఆగస్టులో 'ఎక్స్'ను బ్రెజిల్ నిషేధించింది. వీపిన్‌లో ఆ మైక్రోబ్లాగింగ్ సైట్‌ను వినియోగిస్తే జరిమానాలు వేస్తామని నాడు కోర్టు హెచ్చరించింది.

దీనికి తోడు స్టార్‌లింక్ బ్యాంక్ ఖాతాలను ఫ్రీజ్ చేసింది. దీంతో 2.2 కోట్ల వినియోగదారులున్న బ్రెజిల్ మార్కెట్ చేజారిపోతుందని మస్క్ గ్రహించారు. చివరకు తగ్గి.. ఆ దేశంలో తమ సిబ్బందిని తిరిగి నియమించారు. అంతేకాదు.. కోర్టు విధించిన భారీ జరిమానాలనూ చెల్లించారు

**.జర్మనీ ఎన్నికల్లో జోక్యానికి యత్నం..**

2025 జర్మనీ ఎన్నికల్లో 'ఆల్టర్నేటివ్ ఫర్ జర్మనీ' పార్టీకి మస్క్ మద్దతు ప్రకటించారు. అదే ఆ దేశాన్ని రక్షిస్తుందని పోస్ట్ చేశారు. ఆ పార్టీకి మద్దతుగా నాడు పత్రికల్లో వ్యాసం కూడా రాశారు. ఈ చర్యలతో తమ ఎన్నికల్లో మస్క్ జోక్యం చేసుకుంటున్నారని అక్కడి ప్రభుత్వం మండిపడింది. జర్మనీలో భారీగా పెట్టుబడులు పెట్టడంతో అక్కడి రాజకీయాలపై మాట్లాడే హక్కు మస్క్‌కు ఉందని నాడు ఆయన ప్రతినిధి వ్యాఖ్యానించడం గమనార్హం.

**కెనడా విడిపోవాలంటూ..**

కెనడాలోని రాజకీయ నాయకులతో మస్క్‌కు కొన్నేళ్లుగా వివాదాలు కొనసాగుతున్నాయి. గతంలో మాజీ ప్రధాని ట్రూడోను ట్రోల్ చేశారు. ఇక పాడ్‌కాస్ట్‌లు, ఆన్‌లైన్ స్ట్రీమింగ్‌లు రిజిస్టర్ చేసుకోవాలని అక్కడి ప్రభుత్వం చట్టం చేయగా.. వాక్ స్వేచ్ఛను అణచివేస్తున్నారంటూ మస్క్ విమర్శించారు. కొన్ని సందర్భాల్లో ట్రూడోపై పరిధి దాటి వ్యాఖ్యలు చేశారు.ఇక తాజాగా కెనడా నుంచి క్యూబెక్, అల్బెర్టా, సస్కట్చేవాన్ విడిపోవాలంటూ మస్క్ ఉచిత సలహా ఇచ్చారు. ఇది రాజకీయ వివాదానికి దారితీసింది. ఆ విషయాన్ని కెనడా ప్రజలు నిర్ణయించుకొంటారని ప్రధాని కార్నీ గట్టిగా బదులిచ్చారు. ఇక మస్క్ సలహాకు 'నో' చెబుతూ ఆయా ప్రావిన్స్‌ల నేతలు పోస్టు చేయాల్సి వచ్చింది.



**ఉక్రెయిన్ యుద్ధ వ్యూహాల్లో..**

ఉక్రెయిన్ మిలిటరీకి స్టార్‌లింక్ సేవలను ఇచ్చిన మస్క్.. రష్యా కీలక నౌకాదళ స్థావరంపై దాడి సమయంలో మాత్రం ఆ సేవలను కట్ చేశారు. దీంతో కీవ్ తమ ప్లాన్‌ను విరమించుకోవాల్సి వచ్చింది. అప్పట్లో ఈ చర్య తీవ్ర విమర్శలకు దారితీసింది.

**రష్యా-ఉక్రెయిన్ ఒప్పందం.. తనకు తెలియదన్న జెలెన్‌స్కీ**

ఏకంగా ట్రంప్‌పైనే విమర్శలు.. ఆపై లొంగిపోయి రాజీ..! 2024 ఎన్నికలకు ముందు ట్రంప్‌తో చేతులు కలిపిన మస్క్.. రిపబ్లికన్ ప్రభుత్వం ఏర్పడ్డాక డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియెన్సీ (డోజ్)కు నాయకత్వం వహించారు. ఆ తర్వాత ట్రంప్ ప్రవేశపెట్టిన 'బిగ్ బ్యూటిఫుల్ బిల్' ... ట్'ను తీవ్ర పదాలతో విమర్శించారు. 2025 మే నెలలో డోజ్ నుంచి వైదొలిగారు. తాను లేకపోతే ట్రంప్ ఓడిపోయేవారని వ్యాఖ్యానించారు. మరోవైపు ఎలక్ట్రిక్ వాహనాల సబ్సిడీలను తొలగిస్తూ ట్రంప్ తీసుకున్న నిర్ణయాన్ని తప్పుబట్టారు. ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో ట్రంప్ పేరుందంటూ తీవ్రమైన దాడికి దిగారు. దీంతో అమెరికా అధ్యక్షుడు స్పందిస్తూ.. మస్క్‌కు మతి భ్రమించిందని వ్యాఖ్యానించారు. ఒక దశలో మస్క్ సంస్థల కాంట్రాక్టులు రద్దు చేస్తే.. అతడు దక్షిణాఫ్రికాకు తిరిగి వెళ్లిపోవాల్సి ఉంటుందని ఘాటుగా హెచ్చరించారు. చివరకు జేడీ వాన్స్, ట్రంప్ జూనియర్ రాయబారంతో మస్క్ క్షమాపణలు చెప్పి.. ట్రంప్ వ్యతిరేక పోస్టులు డిలీట్ చేశారు.

## ఢిల్లీలో నిరసనల హోరు

**న్యూఢిల్లీ :**

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా వెల్లువెత్తిన నిరసనలను అణచివేసేం దుకు కేంద్ర బలగాలు, పోలీసులు ఆదివారం తీవ్ర నిర్బంధానికి పాల్పడ్డాయి. ఢిల్లీలోని ప్రధాన ప్రాంతాల్లో వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో నిరసనలు మిన్నంటాయి. ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్ లో ఆందోళన చేసిన విద్యార్థులు, బలగాలు పైశాచికంగా దాడి చేశాయి. సిజెపి, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ సంఘాల ఆధ్వర్యంలో . రాజీవ్ చౌక్ మెట్రో స్టేషన్ రెండో గేటు సమీపం నుంచి జంతర్ మంతర్ వైపు కార్యకర్తలు ర్యాలీగా బయలుదేరారు. పాలికా బజార్ ప్రాంతానికి చేరుకోగానే కేంద్ర బలగాలు, పోలీసులు జైక్ సి. థామస్, డివైఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యుడు బాలేందర్ షాలను రోడ్డుపై ఈడ్చుకెళ్లారు. ఎస్ఎఫ్ఐ ఢిల్లీ రాష్ట్ర కార్యదర్శి సూరజ్ ఇళమణ్, కేంద్ర కమిటీ సభ్యుడు అభిజిత్ మణిలాల్, ఢిల్లీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సిమ్రాన్, రాష్ట్ర కమిటీ సభ్యురాలు శరణ్య కూడా ఈ దాడుల్లో గాయపడ్డారు. ఎఐఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి దినేశ్ సీరంగరాజ్ దుస్తులను సైతం చించివేశారు. సిజెపి నాయకుడు సుధీర్ సాంగ్వాన్, ఎస్ఎఫ్ఐ అఖిల భారత సంయుక్త కార్యదర్శి ఐషీఘోష్‌ను కూడా అరెస్టు చేశారు. నిరసనకారులను ఈడ్చుకుంటూ వెళ్లి పోలీసు వాహనాల్లో పడేయడంతో పాటు, వాహనాల్లోనూ తీవ్ర దాడులకు పాల్పడ్డారు. ఈ ఘటనల్లో పలువురు నాయకులు, కార్యకర్తలు గాయపడ్డారు.

## విపక్షాలతో సమావేశం.. అధికార విభజన సూత్రానికి విరుద్ధం: సీజేఐ

**న్యూఢిల్లీ :**

'ఓట్ల చోరీ' అంశంపై వినతి పత్రం సమర్పించేందుకు సోమవారం సమయం ఇవ్వాలని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్ష నేతలు కోరగా.. అందుకు ఆయన నిరాకరించారు. ఈ విషయంపై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ స్పందించారు. ఇండియా కూటమి నుంచి తనకు వచ్చిన అభ్యర్థనపై కాంగ్రెస్ నేతలు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీకి మెయిల్‌లో లేఖ పంపినట్లు వెల్లడించారు. సీఈసీ విషయంలో వారు లేవనెత్తాలనుకున్న సమస్యలపై ఇప్పటికే సుప్రీంకోర్టులో విచారణ పెండింగ్‌లో ఉందన్నారు. ఒక విషయంపై పిటిషన్ పరిశీలనలో ఉన్నప్పుడు దాని గురించి ఇతరులతో చర్చించడం.. రాజ్యాంగం ప్రకారం 'అధికార విభజన' సూత్రానికి, న్యాయపరమైన ఔచిత్యానికి విరుద్ధమని సీజేఐ అన్నారు. అంతేగాక, ఇండియా కూటమి నేతలు తమ లేఖలో ప్రస్తావించిన అంశాలను పరిష్కరించడానికి భారత రాజ్యాంగం ప్రకారం సుప్రీం కోర్టుకు ఎటువంటి పాలనాపరమైన అధికారాలు లేవని సీజేఐ స్పష్టం చేశారు. అందువల్లే వారి అభ్యర్థనను నిరాకరించినట్లు తెలిపారు. అయితే, రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 కింద ఉన్న అధికార పరిధిని వినియోగించుకుంటూ.. భారత పౌరులపై ప్రభావం చూపే విషయాల్లోని ప్రధానాంశాలను పరిశీలించాల్సిన బాధ్యత తమకు ఉందన్నారు. ప్రతిపక్ష నేతలు తమ డిమాండ్లకు సంబంధించి న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేయాలని సూచించారు. సుప్రీం కోర్టు తలుపులు ఎల్లప్పుడూ అందరి కోసం తెరిచే ఉంటాయన్నారు. అంతేగానీ, సుప్రీం కోర్టును రాజకీయాల్లోకి లాగాలని చూడొద్దని ప్రతిపక్షాలను హెచ్చరించారు. రాహుల్ బృందానికి సీజేఐ అపాయింట్‌మెంట్ నిరాకరణఎన్‌హెచ్‌ఆర్‌సీ సమావేశంలో 'నీరుజీవన అమృతం' అనే అంశంపై మాట్లాడుతూ.. కలుషిత జలాల వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సీజేఐ ఆందోళన వ్యక్తం చేశారు. దానివల్ల ప్రజల ఆరోగ్యాలకు భారీ ముప్పు పొంచి ఉందన్నారు.



పౌరుల రాజ్యాంగ హక్కులను నెరవేర్చడానికి వారికి స్వచ్ఛమైన నీటి లభ్యత అత్యవసరమన్నారు. ప్రజలకు మంచి నీరు అందేలా నిర్వహణ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించారు. అదే సమయంలో ప్రజల రాజ్యాంగ హక్కులు ఉల్లంఘనకు గురైనప్పుడు న్యాయస్థానాలు జోక్యం చేసుకోవాలని పిలపునిచ్చారు. తమకు వచ్చే ఫిర్యాదులపై మానవ హక్కుల కమిషన్లు విచారణ జరిపి, ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు.

## 'జంతర్ మంతర్ ' నిరసన ప్రదేశం కాదు

**న్యూఢిల్లీ :**

ప్రతిపక్షాలు, యువత ఆందోళనలపై కేంద్రం కక్షసాధింపుల చర్యలు చేపట్టింది. న్యూఢిల్లీలోని ప్రముఖ జంతర్ మంతర్‌ను నిరసన ప్రదేశం జాబితా నుండి తొలగించినట్లు ఢిల్లీ పోలీసులు సోమవారం ప్రకటించారు. జంతర్ మంతర్‌కు బదులుగా మరో మూడు ప్రత్యామ్నాయ ప్రాంతాలను సూచించారు. రామ్‌లీలా గ్రౌండ్, బురారీ గ్రౌండ్, సిబిడి గ్రౌండ్‌ను నిరసన వేదికలుగా వినియోగించాలని పోలీసులు వెల్లడించారు. ఆందోళనలు, ధర్నాల కోసం ప్రత్యామ్నాయ వేదికలను పరిశీలించేందుకు ఇటీవల కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఓ కమిటీని నియమించిందని ఢిల్లీ పోలీస్ కమిషనర్ అనురాగ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆ కమిటీ సిఫార్సుల మేరకు జంతర్ మంతర్‌ను నిరసనల వేదికగా డీనోటిఫై చేస్తున్నామని అన్నారు. కొత్త వేదికల వద్ద నిరసన ప్రదర్శనలు నిర్వహించడానికి విధివిధానాలను త్వరలోనే జారీ చేయనున్నట్లు వెల్లడించారు.జంతర్ మంతర్‌పై



ఆంక్షలు.. మోడీ, షాలపై కాంగ్రెస్ విమర్శలుజంతర్ మంతర్‌ను నిరసన ప్రదేశంగా డీనోటిఫై చేయడంపై కాంగ్రెస్ ప్రధాని మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాలపై విమర్శలు గుప్పించింది. శాంతియుత ప్రజా నిరసనలను అణచివేస్తున్నారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యానికి జంతర్ మంతర్ రోజువారీ బూస్టర్ డోస్‌లా పనిచేసే చారిత్రక ప్రదేశమని పేర్కొన్నారు. అక్కడ నిరసనలకు అవకాశం లేకుండా చేయడమంటే ప్రభుత్వ భయాందోళనకు సంకేతమని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం పోరాటం కొన జంతర్ మంతర్‌ను అధికారిక నిరసన వేదికగా గుర్తించే విధానాన్ని రద్దు చేస్తూయ మోడీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఖండించారు. "ఆ పిరికి నియంత జంతర్‌మంతర్‌ను ఇప్పటికే ఒక యుద్ధ క్షేత్రంగా మార్చేశారు. దీంతో , ఇది ఇకపై నిరసన వేదికగా ఉండదు" అని దిప్కే ఎక్స్ పోస్ట్‌లో పేర్కొన్నారు. ఇకపై దేశమంతా జంతర్ మంతర్‌గా మారుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఫారం6పై ఎటువంటి తీర్పు వెలువరించలేదు: సుప్రీం కోర్టు



**బిహార్**

'సర్' ప్రక్రియ విషయంలో సుప్రీం కోర్టు ఎన్నికల కమిషన్‌పై ఆగ్రహం వ్యక్తం చేసింది. కొత్త ఓటర్లుగా పేర్లు నమోదు చేసుకోవాలనుకునేవారు నింపాల్సిన ఫారం6 లో తాము ఎలాంటి సవరణలనూ ఆమోదించలేదని స్పష్టం చేసింది. తాము బిహార్ సర్‌కు సంబంధించిన తీర్పు వెలువరించినప్పుడు అందులో కొత్త ఫారం6 లేదని పేర్కొంది. రికార్డుల్ని తమకు సమర్పించినప్పుడు ఆ మార్పుల్ని ఎవరు చేశారో పరిశీలించి, తగిన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపింది. కొత్త ఫారం డిక్లరేషన్‌కు సుప్రీంకోర్టు ఆమోదం ఉందంటూ ఎన్నికల సంఘం చేసిన ప్రకటనని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం తప్పుబట్టింది.

చట్టబద్ధమైన నిబంధనలు సవరించకుండా ఫారం6 లో ఎన్నికల సంఘం (EC) మార్పులు చేసిందని పిటిషనర్ తరఫు న్యాయవాది కోర్టుకు వెల్లడించారు. అంతటితో ఆగకుండా అందరినీ నమ్మించేందుకు ఆ ఫారాన్ని సుప్రీంకోర్టు ఆమోదించినట్లు సెప్టెంబరు 26న తప్పుడు ప్రకటన జారీ చేసిందని ఆరోపించారు. ఓటర్ల నమోదు ప్రక్రియలో ఈసీ ఏకపక్ష నిర్ణయాలపై చర్యలకు ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై విచారణ జరిపిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం పై వ్యాఖ్యలు చేసింది.

## ప్రజాస్వామ్య పరిరక్షణకే 'చలో ఢిల్లీ' పిలుపు: డీకే శివకుమార్

**చెన్నై:**

ఓటు హక్కు అనేది కేవలం రాజకీయ అధికారం మాత్రమే కాదని, అది ప్రతి పౌరుడి జీవించే హక్కుతో సమానమని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ పేర్కొన్నారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను కాపాడుకునేందుకే కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తోందని ఆయన స్పష్టం చేశారు. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీతో సమావేశమయ్యేందుకు భారత ప్రధాన న్యాయమూర్తి (CJI) నిరాకరించిన నేపథ్యంలో... ఈ పరిణామాలపై డీకే శివకుమార్ చెన్నైలో మీడియాతో మాట్లాడారు. ప్రతిపక్షాల గొంతును ప్రభుత్వాలు, వ్యవస్థలు

వినాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం ప్రతిపక్షాల అభ్యర్థనలను పట్టించుకోనప్పుడు, ప్రధానమంతీయే స్వయంగా స్పందించి వారి సమస్యలను అడిగి తెలుసుకోవాలని హితవు పలకారు. అన్ని మార్గాలు మూసుకుపోవడం వల్లే తాము సీజేఐని కలవాలని నిర్ణయించుకోవాల్సి వచ్చిందని శివకుమార్ వెల్లడించారు.కాగా, ఎన్నికల సంఘం (ECI) పనితీరును నిరసిస్తూ 'ఇండియా' (INDIA) కూటమి ఆధ్వర్యంలో ఇవాళ మధ్యాహ్నం ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్ నుండి సుప్రీంకోర్టు వరకు భారీ నిరసన ప్రదర్శన ('చలో ఢిల్లీ') జరుగనుంది. సీజేఐ అపాయింట్‌మెంట్ లభించనప్పటికీ, ఈ నిరసన కార్యక్రమం యథాతథంగా కొనసాగుతుందని కాంగ్రెస్ వర్గాలు స్పష్టం చేశాయి. ఈ నేపథ్యంలో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఈ నిరసనపై ప్రత్యేకంగా విలేకరుల సమావేశం నిర్వహించనున్నారు. "ప్రజాస్వామ్యం కోసం మార్చ్.. న్యాయం కోసం మార్చ్.. చలో ఢిల్లీ" అంటూ ఆయన 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా పిలుపునిచ్చారు.ఈ నిరసన మార్చ్ నేపథ్యంలో మధ్య ఢిల్లీలో భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. భద్రతా కారణాల దృష్ట్యా పటేల్ చౌక్, జనపథ్, రాజీవ్ చౌక్, మండి హౌస్, సెంట్రల్ సెక్రటేరియట్, బారాఖంబా రోడ్ మెట్రో స్టేషన్లలో ప్రయాణికుల రాకపోకలను మధ్యాహ్నం 4:00 గంటల వరకు నిలిపివేశారు. ఆయా ప్రాంతాల్లో ఢిల్లీ పోలీసులతో పాటు ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ (RAF), సీఆర్పీఎఫ్ (CRPF) బలగాలను భారీగా మోహరించారు.



## సర్ మోసాలపై అఖిలేశ్ సంచలనం

**లక్నో (ఉత్తరప్రదేశ్):**

ఉత్తరప్రదేశ్‌లో ఎన్నికల ప్రక్రియలో పెద్ద ఎత్తున మోసాలు జరుగుతున్నాయని సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధినేత అఖిలేశ్ యాదవ్ సోమవారం బీజేపీపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) ప్రక్రియలో భారీ అవకతవకలు జరిగాయని, దీనివల్ల ఓటర్ల జాబితా పవిత్రత దెబ్బతిన్నదని ఆయన ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. "ఉత్తరప్రదేశ్‌లో లక్షలాది నకిలీ ఓట్లు ఉన్నాయి. ఒకే వ్యక్తి పేరిట పది ఓట్లు వరకు నమోదయ్యాయి. పలు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇలాంటి నకిలీ ఓట్లను మేం గుర్తించాం... త్వరలోనే ఆ జాబితాను విడుదల చేస్తాం. ఎస్ఐఆర్ ప్రక్రియలో భారీ లోపాలు ఉన్నాయని దీనివల్ల స్పష్టమవుతోంది. ఎస్ఐఆర్ కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేసి, సమయం వృథా చేశారు. రాష్ట్రంలోని మొత్తం 403 స్థానాల్లో బీజేపీ చేస్తున్న ఈ మోసాన్ని మేం చూస్తూ ఊరుకోబోం" అని అఖిలేశ్ యాదవ్ స్పష్టం చేశారు.

లక్నోలో డాక్టర్ రామ్ మనోహర్ లోహియా వర్ధంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులు అర్పించారు. పార్టీ నేతలతో కలిసి లోహియా ఆశయాలను క్షేత్రస్థాయిలో అమలు చేయడానికి పునరంకితం అవుతామని ప్రతిజ్ఞ చేశారు. లోహియా అందించిన 'సప్త క్రాంతి' సిద్ధాంతాలను ఆచరిస్తామని, సమాజంలో ఎలాంటి వివక్ష ఉన్నా దానిని ఐక్యంగా ఎదుర్కొని రూపుమాపుతామని ఆయన పేర్కొన్నారు. అంబేద్కర్ రాజ్యాంగం, రామ్ మనోహర్ లోహియా సోషలిజం, ములాయం పోరాట స్ఫూర్తితో సమసమాజాన్ని, లౌకిక సమాజాన్ని నిర్మిస్తామని అఖిలేశ్ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. మరోవైపు, ఎస్ఐఆర్ ప్రక్రియలో జరుగుతున్న అవకతవకలపై, ముఖ్య ఎన్నికల కమిషనర్ (CEC) జ్ఞానేశ్ కుమార్ తొలగింపును డిమాండ్ చేస్తూ విపక్ష నేతలు, ఎంపీలు సోమవారం ఉదయం సుప్రీంకోర్టు వైపు నిరసన ప్రదర్శన నిర్వహించనున్నారు. ఈ నిరసన కార్యక్రమంలో 'ఇండియా' (INDIA) కూటమికి చెందిన పలువురు ప్రముఖ నేతలు పాల్గొననున్నారు.ఈ పరిణామాల నేపథ్యంలో మధ్య ఢిల్లీలో భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. భద్రతా కారణాల దృష్ట్యా పటేల్ చౌక్, జన్‌పథ్, రాజీవ్ చౌక్, మండి హౌస్, సెంట్రల్ సెక్రటేరియట్, బారాఖంబా రోడ్ మెట్రో స్టేషన్లలో ఉదయం 6:00 గంటల నుండి మధ్యాహ్నం 4:00 గంటల వరకు ప్రవేశం, నిష్క్రమణలను నిలిపివేశారు. బారాఖంబా రోడ్, మండి హౌస్ పరిసర ప్రాంతాల్లో ఢిల్లీ పోలీసులతో పాటు ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ (RAF), సీఆర్పీఎఫ్ (CRPF) బలగాలను భారీగా మోహరించారు.

# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## భగవాన్ దాస్ ఆశయాలు నేటికీ చిరస్మరణీయం

**మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్**
**ఘనంగా బీఆర్ భగవాన్ దాస్ 23వ వర్ధంతి**

**హనుమకొండ, అక్టోబర్ 12 (వుదయం ప్రతినిధి):**



ప్రముఖ కార్మిక నాయకులు, కమ్యూనిస్టు యోధుడు బీఆర్ భగవాన్ దాస్ ఆశయాలు నేటికీ చిరస్మరణీయం అని మాజీ ప్రభుత్వ చీఫ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. సోమవారం బీఆర్ భగవాన్ దాస్ 23వ వర్ధంతి కార్యక్రమాన్ని హనుమకొండ లోని బీఆర్ భగవాన్ దాస్ విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులతో కలిసి వినయ్ భాస్కర్ భగవాన్ దాస్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం మీడియాతో వినయ్ భాస్కర్ మాట్లాడుతూ భగవాన్ దాస్ భౌతికంగా దూరమై 23 ఏండ్లు గడిచినా ఆయనను నేటికీ ప్రజలు స్మరించుకుంటూనే ఉన్నారని అన్నారు. నీతి, నిజాయితీ, నిబద్ధతతో ప్రజల కోసం పనిచేసిన బీఆర్ ఆశయాలు నేటికీ చిరస్మరణీయం అన్నారు. కార్మిక సమస్యలపై నిరంతరం కృషి చేసిన బీఆర్ భగవాన్ దాస్ సంఘటిత, అసంఘటిత రంగ కార్మికుల హక్కుల పరిరక్షణకు కృషి చేశారని అన్నారు. ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించారు. ఆయన కాపాడిన స్థలంలోనే నేడు కాళోజీ కళాక్షేత్రం నిర్మించడం జరిగిందని చెప్పారు. కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ స్థాపించి ఈ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని పోరాడారని గుర్తు చేశారు. నగరంలో పేదల ఇండ్ల స్థలాల కోసం, గుడిసె వాసులకు పట్టాల కోసం సిపిఐ ఆధ్వర్యంలో భగవాన్ దాస్ ఉద్యమించారని అన్నారు. ఆయన ఆశయాలను నేటి తరం ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సిరబోయిన కరుణాకర్, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, నాయకులు కర్రె లక్ష్మణ్, ఎస్. రాజమౌళి, ఏదునూరి వెంకట్రాజం, ఏదునూరి శ్రీనివాస్, బత్తిని సదానందం, మాలోతు శంకర్, మెట్టు శ్యామ్ సుందర్ రెడ్డి, భగవాన్ దాస్ కుమారులు డాక్టర్ బీఆర్ అంబేద్కర్, డాక్టర్ బి. రాజ్ సిద్ధార్థ, బీఆర్ లెనిన్, మాజీ కార్పొరేటర్ లు మంచాల స్వామిచరణ్, జోరిక రమేష్, సారంగపాణి, జక్కులిస్టు నాయకులు పివి మదన్ మోహన్, తోట సుధాకర్, తొర్రూరి నర్సయ్య, బొడిగె శ్రీనివాస్, ఎండి నయీం పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లతో పేదల సొంతింటి కల సాకారం

**మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి**

**గట్టుప్పల్, అక్టోబర్ 12 (వుదయం):**



పేదల సొంతింటి కలను నిజం చేయడమే ప్రభుత్వ ధ్యేయమని మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. గట్టుప్పల్ మండలంలోని కమ్మగూడెం గ్రామంలో మెరుగు రమేష్ దంపతుల నూతన ఇందిరమ్మ గృహప్రవేశ వేడుకల్లో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆ దంపతుల చిన్నారులను అప్యాయంగా అక్కున చేర్చుకుని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజ్‌గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. పేదల ముఖాల్లో చిరునవ్వు చూడాలన్న దృఢ సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లను అందజేసి, వారి సొంతింటి కలను సాకారం చేస్తామని భరోసా నిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మెరుగు సలమ్మ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు విరమల్ల శ్రీశైలం, కాంగ్రెస్ నాయకులు కంచుకట్ల సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## కుష్టువ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి
### జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



**ప్రారంభ దశలో గుర్తిస్తే అంగవైకల్యాన్ని నివారించవచ్చు**
**ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో కుష్టువ్యాధికి ఉచిత చికిత్స**
**ఈ నెల 22 నుండి నవంబర్ 4 వరకు కుష్టు వ్యాధి గుర్తింపు కార్యక్రమం**
**ఖమ్మం వుదయం బ్యూరో అక్టోబర్-12:**

కుష్టువ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో వైద్యులను సంప్రదించి, సకాలంలో చికిత్స తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో కుష్టు వ్యాధి నిర్మూలనపై అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ప్రజలకు కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించడంతో పాటు, వ్యాధి లక్షణాలు ఉన్నవారిని ముందస్తుగా గుర్తించి, చికిత్స అందించేందుకు ఈ నెల 22 నుండి నవంబర్ 4 వరకు కుష్టు వ్యాధి గుర్తింపు కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఇందులో భాగంగా వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి, కుష్టు వ్యాధిపై అవగాహన కల్పిస్తారని, అనుమానిత లక్షణాలు ఉన్నవారిని గుర్తించి, అవసరమైన వైద్య పరీక్షల నిమిత్తం సంబంధిత వైద్యాధికారులకు సూచిస్తారని అన్నారు. వ్యాధి లక్షణాలు బయటపడటానికి సగటున మూడు సంవత్సరాల వరకు సమయం పట్టవచ్చని పేర్కొన్నారు. కుష్టువ్యాధి ఎవరికైనా రావచ్చని, దీనికి వయస్సు, లింగభేదం లేదని కలెక్టర్ పేర్కొన్నారు. ఇది వంశపారంపర్య వ్యాధి కాదని, శాపం లేదా పాపం వల్ల వచ్చే వ్యాధి కాదని స్పష్టం చేశారు. కుష్టువ్యాధి పట్ల ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించాలని, వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపకుండా వారిని గౌరవంగా చూడాలని కోరారు. కుష్టువ్యాధికి ఎండీటీ (బహుళ ఔషధ చికిత్స) ద్వారా సాధారణంగా 6 నుంచి 12 నెల్లలో పూర్తిగా నయం చేయవచ్చని తెలిపారు. ప్రారంభ దశలోనే వ్యాధిని గుర్తించి, వైద్యుల సూచనల మేరకు పూర్తి స్థాయి చికిత్స తీసుకుంటే అంగవైకల్యాన్ని నివారించవచ్చని పేర్కొన్నారు. కుష్టువ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి, బాధితులకు సకాలంలో చికిత్స అందేలా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సంబంధిత వైద్య, ఆరోగ్య శాఖ అధికారులకు సూచించారు. కుష్టువ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు డా. పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి రామ్మూర్తి, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. రామారావు, పాల్గొన్నారు.

## గ్రీవిన్స్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి
### జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

**మహబూబాబాద్ జిల్లా అక్టోబర్ 12 (వుదయం జిల్లా ప్రతినిధి):**



ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ కె. అనిల్ కుమార్, డి.ఆర్.ఓ. నాగలక్ష్మి లతో కలిసి ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పలు సమస్యలపై ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్న ప్రజల యొక్క దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని అన్నారు. వచ్చిన దరఖాస్తులలో మహబూబాబాద్ లోని గుమ్ముడూరు ప్రాంతానికి చెందిన అవారి నిర్మల సర్వే నెంబర్.36/A లో గల ఒక ఎకరం 19 గుంటల భూమి నిషేధిత జాబితా నుండి పట్టా భూమి మార్చి పట్టా ఇప్పించగలరని కోరారు. కురవి మండలం బలపాల గ్రామానికి చెందిన దేసంగి మహాలక్ష్మి తాను గత 20 సంవత్సరాలుగా రేకుల ఇంట్లో నివాసిస్తున్నానని, ఇంతవరకు సరైన నివాస గృహం లేదని ఇందిరమ్మ ఇల్లు ఇప్పించగలరని కోరారు. ఈ రోజు నిర్వహించిన ప్రజావాణిలో వివిధ శాఖలకు సంబంధించి జిల్లా కేంద్రంలో(119 ), డివిజనల్ కేంద్రంలో (03) మండలాలలో(81) మొత్తంగా (203) దరఖాస్తులను పరిష్కారినికై సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈప్రజావాణి కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మధుసూధనరాజు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నితీష్ కుమార్, జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి రవిరాథోడ్, జిల్లా న్యాయ సలహా పశుసంవర్ధక శాఖ అధికారి కిరణ్ కుమార్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి దేశీరాం, ఇంచార్జ్ డి.ఈ.ఓ మందుల శ్రీరాములు, జిల్లా పంచాయతీ అధికారి రేవంత్, సివిల్ సప్లై అధికారి రమేష్, పరిశ్రమల శాఖ అధికారి శ్రీమన్నారాయణ రెడ్డి, ఇతర శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, పలు విభాగాల సూపరింటెండెంట్ లు, భూభారతి జిల్లా కో ఆర్డినేటర్ సురేష్, ఈ.డి.ఎం యుగేందర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఖో ఖో జూనియర్ రాష్ట్రస్థాయి శిక్షణ శిబిరాన్ని సందర్శించిన ప్రముఖులు



**జయశంకర్ భూపాలపల్లి: అక్టోబర్ 12 (వుదయం జిల్లా ప్రతినిధి):**

మహదేవ్‌పూర్ మండలకేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల మైదానంలో నిర్వహిస్తున్న ఖో ఖో జూనియర్ రాష్ట్రస్థాయి శిక్షణ శిబిరాన్ని సోమవారం అన్నారం సర్పంచ్ నీర్ల ప్రభాకర్, సీనియర్ క్రీడాకారుడు సుంకరి గట్టన్న, మాజీ కాలేశ్వర దేవస్థానం చైర్మన్ గూడాల శ్రీనివాస్, అథ్లెటిక్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ కొత్తపల్లి సారంగపాణి సందర్శించారు. ఈ సందర్భంగా శిక్షణ పొందుతున్న బాలికలను కలిసి, వారి క్రీడా నైపుణ్యాలను పరిశీలించి, రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి విజయం సాధించాలని ఆకాంక్షించారు. కుటుంబాలకు దూరంగా ఉంటూ, క్రమ శిక్షణతో శిక్షణ పొందుతున్న బాలికల పట్టుదల, అంకితభావాన్ని వారు అభినందించారు. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందించడమే కాకుండా, భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు దోహదపడతాయని అతిథులు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన బాలికలకు రాష్ట్రస్థాయిలో తమ ప్రతిభను నిరూపించుకునే అవకాశం కల్పించడం అభినందనీయమని అన్నారు. పీఈడీ పూర్ణిమ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ శిక్షణ శిబిరంలో కోచ్ అశోక్ బాలికలకు క్రమబద్ధమైన శిక్షణ అందిస్తూ, వారి క్రీడా నైపుణ్యాలను మెరుగుపరచడానికి చేస్తున్న కృషిని సందర్శకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పీఈడీ పూర్ణిమ, కోచ్ అశోక్, సీనియర్ క్రీడాకారిణులు, శిక్షణ శిబిర సిబ్బంది పాల్గొన్నారు.

## అర్హులైన గిరిజన కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలి

**నిర్ణీత గడువులోగా దరఖాస్తులు పరిష్కరించాలి**
**గిరిజనుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలి**
**ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్**

**భద్రాచలం, లక్టోబర్12 (వుదయం ప్రతినిధి):**



ఐటీడీఏ గిరిజన దర్బార్‌పై గిరిజనులకు ఎంతో నమ్మకం ఉందని, వివిధ సంక్షేమ పథకాల కోసం ఆశతో అర్జీలు సమర్పిస్తున్న అర్హులైన గిరిజన కుటుంబాలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా సంబంధిత యూనిట్ అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ ఆదేశించారు. ప్రజలు సమర్పించే దరఖాస్తులను బాధ్యతగా పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సోమవారం భద్రాచలంలోని ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో వివిధ ఆదివాసీ గిరిజన గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజు, ఎస్‌డీసీ ఆనంద్ కుమార్, ఆర్‌సీవో గురుకులం అరుణకుమారి, ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ మధుకర్ తదితర అధికారులతో కలిసి అర్జీలు స్వీకరించారు. గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులకు దరఖాస్తులను పంపించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటికి పరిష్కారం చూపడం అధికారుల బాధ్యత అని పేర్కొన్నారు. గిరిజన దర్బార్‌కు వచ్చిన అర్జీలలో ప్రధానంగా పోడు భూముల పట్టాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించడం, పట్టాల్లో పేర్ల మార్పులు చేపట్టడం, భూ సమస్యలను పరిష్కరించడం వంటి అంశాలు ఉన్నాయి. అలాగే చేపల సొసైటీల ఏర్పాటు, స్వయం ఉపాధి ద్వారా జీవనాధారాన్ని మెరుగుపరుచుకునేందుకు వ్యక్తిగత శిక్షణలు ఇప్పించడం, వ్యవసాయ అవసరాల కోసం విద్యుత్ కనెక్షన్లు, బోర్లు, మోటార్లు మంజూరు చేయడం వంటి సమస్యలపై గిరిజనులు దరఖాస్తులు సమర్పించారు. గిరిజన గ్రామాల్లో విద్యుత్ సౌకర్యం కల్పించాలని, సోలార్ విద్యుత్ పథకం ద్వారా బోరుబావులకు విద్యుత్ సదుపాయం కల్పించాలని కోరుతూ పలువురు అర్జీలు అందజేశారు. భూ సమస్యలు, వ్యవసాయ అవసరాలు, విద్యుత్ సౌకర్యాలు, వైద్య సహాయం, విద్య, ఉపాధి వంటి అంశాలకు సంబంధించిన దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. గిరిజన దర్బార్‌లో స్వీకరించిన అన్ని అర్జీలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి, సంబంధిత శాఖల ద్వారా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ తెలిపారు. దరఖాస్తుల పరిష్కారంలో అనవసర జాప్యం జరగకుండా, నిర్ణీత గడువులోగా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు సమర్పించిన అర్జీలను కేవలం స్వీకరించడానికే పరిమితం కాకుండా, వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అర్హులైన కుటుంబాలకు చేరినప్పుడే వాటి లక్ష్యం నెరవేరుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీపిటీజీ అధికారి గన్యా, జేడీఎం హరికృష్ణ, హౌసింగ్ ఏఈ హేమంత్, మేనేజర్ ఆదినారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌజన్య, సిబ్బంది నాగేశ్వరరావు, నరేందర్, హరిత, విజయ్, జోగారావు, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

## రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్

**రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక సంస్థ ల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు..**

**యాదాద్రి భువనగిరి, అక్టోబర్12 (వుదయం ప్రతినిధి):**



సోమవారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు హైదరాబాదు నుంచి పలువురు ఉన్నతాధికారులతో కలిసి రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల్లోని రైతు వేదికల్లో పాల్గొన్న సంబంధిత శాఖల అధికారులు, రైతులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రబీ సీజన్లో ఎట్టి పరిస్థితుల్లో రైతులు వరి సాగు చేయవద్దన్నారు. బిందు సేద్యంతో పామ్ తోటలు, కూరగాయలు వంటి స్వల్పకాలిక పంటలను సాగు చేయవచ్చన్నారు. జలసిరి కార్యక్రమంలో భాగంగా ఇంకుడు గుంతలు, నీటి కుంటలు, బోర్వెల్స్ రీఛార్జ్, తదితర పనులను చేపట్టి జలవనరులను కాపాడుకోవాలన్నారు. రాష్ట్రంలో 315 మండలాల్లో వర్షపాతం తక్కువగా ఉందని, ప్రభుత్వం త్వరలోనే కరువు మండలాలను ప్రకటిస్తుందన్నారు. వచ్చే వర్షాకాలం నాటికి తాగునీటి సమస్యలు ఉత్పన్నమవ్వకుండా నీటిని పొదుపుగా వాడాలని సూచించారు. వ్యవసాయానికి విద్యుత్ సరఫరాపై సరైన ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు. భూగర్భ జల శాఖ అధికారులు ఎప్పటికప్పుడు గ్రౌండ్ లెవెల్ నివేదికలను అందజేయాలన్నారు. ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి అవసరమైన చర్యలు చేపడుతుందన్నారు. సోమవారం భువనగిరి మండలం మాసుకుంట లోని రైతు వేదిక నుండి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, భువనగిరి మున్సిపల్ చైర్మన్ శ్రీ వాణి, జిల్లా వ్యవసాయ అధికారి రమణా రెడ్డి , జిల్లా ఉద్యానశాఖ అధికారి హేమలత, అధికారులతో, రైతులు, ప్రజాప్రతినిధులతో కలిసి పాల్గొన్నారు

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి



**జిల్లా రెవెన్యూ అధికారి ప్రేమ్ రాజ్**

**సూర్యాపేట, అక్టోబర్ 12: (వుదయం ప్రతినిధి) :**

ప్రజల సమస్యల పరిష్కారమే వేదికగా సాగుతున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా రెవెన్యూ అధికారి ప్రేమ్ రాజ్ అన్నారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి సోమవారం జరిగే ప్రజావాణికి జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని, ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా మరియు మండల స్థాయి ప్రజావాణి దరఖాస్తులను తప్పనిసరిగా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు.

ప్రజావాణి పోర్టల్‌లో ఇంకా పరిష్కారం కాకుండా ఉన్న దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని, కొత్తగా అందుతున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రజావాణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను తక్షణమే పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని, ప్రతి అధికారి తమ లాగిన్ లో ఉన్న పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. ప్రజలు పెట్టుకున్న అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. మండల స్థాయిలో ప్రారంభమైన ప్రజావాణికి అన్ని శాఖల మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షించాలని, మండల స్థాయి సమస్యలు స్థానికంగానే పరిష్కారమైతే ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయని ఆయన పేర్కొన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 86 దరఖాస్తులు వచ్చాయని, వీటిలో భూ సమస్యలు, రెవెన్యూకు సంబంధించి 36, డిపిఓ 7, డి డబ్ల్యుఓ 7, డిఇఓ 3, మిగిలిన 33 దరఖాస్తులు వివిధ శాఖలకు చెందినవని, వాటిని పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించడం జరిగిందని డీఆర్వో తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ శిరీష, డిఆర్డిఓ పిడి సన్యాసయ్య, డిఎంహెచ్వో వెంకటరమణ, డిఏఓ శ్రీధర్ రెడ్డి, జిల్లా స్పోర్ట్స్ అండ్ యూత్ వెల్ఫేర్ అధికారి వెంకటరెడ్డి, మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి, జిల్లా అధికారులు తదితరులు హాజరయ్యారు.

## వయోవృద్ధుల ఉల్లాసానికి క్యారమ్ బోర్డుల పంపిణీ



**దాతలను అభినందించిన సీనియర్ సిటిజన్లు**
**రెడ్‌క్రాస్ ప్రణామ్ కేంద్రంలో ఘనంగా క్యారమ్ బోర్డుల ప్రారంభోత్సవం**

**హనుమకొండ సిటీ, అక్టోబర్ 12 (వుదయం ప్రతినిధి) :**

రెడ్‌క్రాస్ప్రణామ్ కేంద్రంలో (Redcross Pranam Centre) వయోవృద్ధుల వినోదం, వ్యాయామం కొరకు కొత్తగా ఏర్పాటు చేసిన రెండు క్యారమ్ బోర్డులను సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ క్యారమ్ బోర్డులను ప్రముఖ దాతలు డాక్టర్ పి.వి. శ్రీనివాసరావు, ఇంజనీర్ పెండ్లి ఉపేందర్ రెడ్డి సంయుక్తంగా లాంఛనంగా ప్రారంభించారు. సీనియర్ సిటిజన్ల ఆరోగ్యం, మానసిక ఉల్లాసం కోసం దాతలు ముందుకు వచ్చి సహాయ సహకారాలు అందించడం అభినందనీయమని ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి కన్వీనర్‌గా కోమురయ్య పెండ్యాల, సమన్వయకర్తగా (కోఆర్డినేటర్) బూర రామచందర్ వ్యవహరించి, కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ ప్రారంభోత్సవంలో దాదాపు 40 మంది సీనియర్ సిటిజన్లు పాల్గొని ఉత్సాహంగా క్యారమ్స్ ఆడారు. ప్రణామ్ కేంద్రంలో వయోవృద్ధుల కోసం ఇలాంటి క్రీడా సదుపాయాలు కల్పించడం పట్ల సీనియర్ సిటిజన్లు దాతలకు మరియు నిర్వాహకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## టీబీ బాధితులకు న్యూట్రిషన్ కిట్ల పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



ఖమ్మంవుదయం బ్యూరో, అక్టోబర్ 12 సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ క్షయవ్యాధి (టీబీ) బాధితులకు న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేశారు. టీబీ బాధితులకు పౌష్టికాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు, వ్యాధి నుంచి కోలుకునేందుకు న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. టీబీ బాధితులు వైద్యుల సూచనల మేరకు క్రమం తప్పకుండా మందులు వాడుతూ, పౌష్టికాహారం తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. చికిత్స మధ్యలో నిలిపివేయకుండా పూర్తికాలం కొనసాగించాలని, ఆరోగ్య సిబ్బంది సూచనలు పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. రామారావు, టీబీ ఆసుపత్రి ఇన్‌చార్జి, జిల్లా టీబీ నియంత్రణ అధికారిణి డా. నివేదిత, అధికారులు, తదితరులు పాల్గొన్నారు

## 21న ప్రత్యేక లోక్ అదాలత్




**– జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కందుకూరి పూజ**

**వరంగల్, అక్టోబర్ 12 (వుదయం ప్రతినిధి) :**

జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు నవంబర్ 21 (శనివారం)న వరంగల్ జిల్లా కోర్టు మరియు నర్సంపేట కోర్టులలో ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి కందుకూరి పూజ తెలిపారు. సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ ప్రత్యేక లోక్ అదాలత్‌లో రాజీపడదగిన చెక్ బౌన్స్ కేసులు, ప్రీలిటిగేషన్ కేసులు మరియు ఇతర సివిల్, క్రిమినల్ కేసులను ఇరుపక్షాల అంగీకారంతో పరిష్కరించనున్నట్లు వివరించారు. ప్రీలోక్ అదాలత్: అక్టోబర్ 12 నుండి నవంబర్ 20 వరకు ప్రిలోక్ అదాలత్ నిర్వహణ. ఇందుకోసం 3 బెంచీలు (వరంగల్‌లో 2, నర్సంపేటలో 1) ఏర్పాటు.

ప్రత్యేక డిస్కౌంట్లు: చెక్ అమౌంట్‌పై రాజీ పడేందుకు శ్రీరామ్ చిట్స్ ఫైనాన్స్ 30 శాతం, చోళమండలం ఫైనాన్స్ 50 శాతం వరకు డిస్కౌంట్ ప్రకటించాయి. సమీక్షా సమావేశాలు: లోక్ అదాలత్ విజయవంతం చేసేందుకు న్యాయమూర్తులు, పోలీసులు, న్యాయవాదులు, బ్యాంకులు, చిట్ ఫండ్ మేనేజర్లతో ప్రత్యేక సమావేశాలు పూర్తిచేశామని వెల్లడించారు. కక్షిదారులు తమ తమ న్యాయవాదులతో కలిసి కోర్టులను సంప్రదించి, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. లోక్ అదాలత్ ప్రయోజనాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా ఓరియంటేషన్, బతుకమ్మ సంబరాలు




**వరంగల్ టౌన్, అక్టోబర్ 12 (వుదయం ప్రతినిధి) :**

వరంగల్‌లోని ఆదర్శ లా కాలేజీలో ప్రథమ సంవత్సరం న్యాయ విద్యార్థుల కోసం సోమవారం ఓరియంటేషన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.పూజ, హనుమకొండ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీమతి ఎన్.వి. హైమ పూజిత ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, న్యాయ విద్యను అంకితభావం, క్రమశిక్షణతో అభ్యసించాలని, రాజ్యాంగ విలువలను గౌరవిస్తూ సమాజంలో న్యాయం, సమానత్వం స్థాపనకు కృషి చేసే బాధ్యతాయుతమైన న్యాయ నిపుణులుగా ఎదగాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. కళాశాల చైర్మన్ బూర విద్యాసాగర్, ప్రిన్సిపాల్ డా. పి. ప్రతిభా రాథోడ్ మాట్లాడుతూ.. నైతిక విలువలతో కూడిన విద్యను అందించడమే తమ కళాశాల లక్ష్యమన్నారు. ఓరియంటేషన్ అనంతరం కళాశాల ప్రాంగణంలో బతుకమ్మ సంబరాలను అత్యంత ఉత్సాహంగా జరుపుకున్నారు. విద్యార్థినులు, అధ్యాపకులు సంప్రదాయ వస్త్రధారణతో బతుకమ్మ ఆడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని చాటిచెప్పారు. ఈ వేడుకలు కళాశాల ప్రాంగణంలో సందడిగా సాగాయి.

## సమాచార హక్కు చట్టం అమలులో మాడ నర్సయ్య సేవలు అభినందనీయం




**– ఎమ్మెల్సీ బండ ప్రకాష్**

**హనుమకొండ, అక్టోబర్ 12 (వుదయం ప్రతినిధి) :**

హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో 'సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ, భారత దేశం' ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) ఆవిర్భావ దినోత్సవ సదస్సు అత్యంత ఘనంగా జరిగింది. ఈ వేడుకకు తెలంగాణ శాసనమండలి డిప్యూటీ చైర్మన్, ఎమ్మెల్సీ డా. బండ ప్రకాష్ ముఖ్య అతిథిగా విచ్చేశారు.

ఈ సందర్భంగా సమాచార హక్కు చట్టంపై ప్రజల్లో విస్తృతమైన చైతన్యం తీసుకురావడంతో పాటు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమిస్తున్న హనుమకొండ జిల్లా కన్వీనర్, ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ మాడ నర్సయ్యను ఎమ్మెల్సీ బండ ప్రకాష్ ఘనంగా సత్కరించారు. ఆయనకు శాలువా కప్పి, జ్ఞాపికను అందజేసి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బండ ప్రకాష్ మాట్లాడుతూ.. సమాజంలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించడంలో ఆర్టీఐ కార్యకర్తల పాత్ర అత్యంత కీలకమని ప్రశంసించారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రభుత్వ పథకాలు మరియు నిధుల వినియోగంలో పారదర్శకత కోసం మాడ నర్సయ్య చేస్తున్న కృషిని ఆయన కొనియాడారు. ఇదే స్ఫూర్తితో మరింత బాధ్యతాయుతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంస్థ జాతీయ చైర్మన్ డాక్టర్ బొమ్మరబోయిన కేశవులు ముదిరాజ్ తో పాటు వివిధ రాష్ట్రాలు, జిల్లాల ప్రతినిధులు, కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సన్మానం అందుకున్న మాడ నర్సయ్యను పలువురు రాజకీయ, సామాజిక ప్రముఖులు, ఆర్టీఐ కార్యకర్తలు అభినందించారు



## వేసవి నీటి ఎద్దడికి ముందస్తు చెక్.. రూ.4 కోట్లతో చెక్‌డ్యామ్

- లండసాంగి పంప్‌హౌస్ వద్ద అధికారుల పరిశీలన
- నీటి నిల్వలు పెంచడమే లక్ష్యం: మున్సిపల్ చైర్‌పర్సన్ అనూష సతీష్

ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి, \ అక్టోబర్ 12:

రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగా రూ.4 కోట్లతో చెక్‌డ్యామ్ నిర్మించేందుకు అధికారులు స్థల పరిశీలన చేపట్టారు. ఇందులో భాగంగా లండసాంగి పంప్‌హౌస్ వద్ద జిల్లా కలెక్టర్ రాజర్షి షా, అడిషనల్ కలెక్టర్, మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్‌తో పాటు ఇరిగేషన్, మున్సిపల్ శాఖల అధికారులు ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించారు. చెక్‌డ్యామ్ నిర్మాణానికి సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించి, నీటి నిల్వలను పెంచేందుకు ఉన్న అవకాశాలపై చర్చించారు.

ఈ సందర్భంగా అనూష సతీష్ మాట్లాడుతూ.. వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా ఇప్పటి నుంచే ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రూ.4 కోట్లతో ప్రతిపాదించిన చెక్‌డ్యామ్ నిర్మాణం ద్వారా నీటి నిల్వలను పెంచి, ప్రజలకు మెరుగైన తాగునీటి సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. జిల్లా కలెక్టర్, అడిషనల్ కలెక్టర్, సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో అవసరమైన చర్యలు చేపట్టి, నీటి సమస్యలు తలెత్తకుండా చూస్తామని పేర్కొన్నారు.

## కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నేర సమీక్షా సమావేశం

- శాంతిభద్రతల పరిరక్షణ, కేసుల దర్యాప్తు వేగవంతంపై పోలీస్ కమిషనర్ దిశానిర్దేశం

పోలీసు కమీషనర్ గౌష్ ఆలం



కరీంనగర్ అక్టోబర్ 12 (వుదయం ప్రతినిధి): కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సెప్టెంబర్2026 నెలకు సంబంధించిన నేర సమీక్షా సమావేశం కమిషనరేట్ ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో నిర్వహించబడింది. కమిషనరేట్ పరిధిలోని పోలీస్ అధికారులు, సిబ్బంది హాజరయ్యారు. ఈ సమావేశంలో ప్రధానంగా శాంతిభద్రతల పరిరక్షణ, పెండింగ్ కేసుల పురోగతి మరియు రాబోయే పండుగల బందోబస్తుపై సమగ్ర సమీక్ష చేపట్టారు. దుర్గామాత నిమజ్జనం, దసరా వేడుకల బందోబస్తు రాబోయే దుర్గామాత నిమజ్జనోత్సవం మరియు దసరా ఉత్సవాల సందర్భంగా ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని, సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించారు. మహిళా భద్రత & తీవ్ర నేరాల నియంత్రణ మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలు, పోక్సో కేసులు, ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. కొత్త చట్టాల అమలు & సాంకేతికత వినియోగం నూతన నేర న్యాయ చట్టాల అమలు తీరు, ఆన్‌లైన్ ఎఫ్ఐఆర్‌లు, ఈసమ్మన్స్ ఈసాక్ష్య అప్లికేషన్ల వినియోగం మరియు సీసీటీఎన్ఎస్ 2.0 వ్యవస్థపై విస్తృతంగా సమీక్షించారు. సైబర్ నేరాల నియంత్రణ & CEIR పోర్టల్ పెరుగుతున్న సైబర్ మోసాల పట్ల ప్రజల్లో అవగాహన పెంచాలని, బాధితుల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని సూచించారు. మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న బాధితుల కోసం 'CEIR పోర్టల్' ద్వారా ఫోన్లను గుర్తించి రికవరీ చేసే ప్రక్రియను మరింత వేగవంతం చేయాలన్నారు. అక్రమ రవాణా, మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం గంజాయి, డ్రగ్స్ అక్రమ రవాణా, పీడీఎస్ బియ్యం అక్రమ తరలింపు, ఇసుక అక్రమ రవాణా మరియు జూదం లాంటి అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రజావాణి & పౌర సేవలు ప్రజావాణి, ఆన్‌లైన్ పిటిషన్ల ద్వారా ప్రజల నుంచి వచ్చే సమస్యలను సకాలంలో పరిష్కరించి పారదర్శకమైన పోలీసింగ్ అందించాలని పేర్కొన్నారు. డయల్ 100/112 ద్వారా వచ్చే ఫిర్యాదులపై సిబ్బంది తక్షణమే స్పందించాలన్నారు.రివార్డుల ప్రదానంఆస్తి సంబంధిత నేరాలు, సంచలనాత్మక కేసులను ఛేదించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన పలువురు పోలీస్ అధికారులు, సిబ్బందికి ఈ సందర్భంగా ప్రశంసా పత్రాలు, రివార్డులను అందజేసి అభినందించారు.ఈ కార్యక్రమంలో ఏసీపీలు శ్రీనివాస్ జి, వెంకటస్వామి, విజయకుమార్, యాదగిరిస్వామి, స్వామి, శ్రీనివాస్, మాధవి, వాసాల సతీష్ లతో పాటుగా అన్ని పోలీసు స్టేషన్ల స్టేషన్ హౌస్ అధికారులు ఇన్స్పెక్టర్లు మరియు ఎస్సైలు ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## తెలంగాణ ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులు మెగా మాక్ ప్రిలిమ్స్ పరీక్షను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, అక్టోబర్ 12 (వుదయం ప్రతినిధి)



రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల కోసం పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీన గోదావరిఖనిలో మెగా మాక్ ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు.అభ్యర్థులు తమ పరీక్షల సన్నద్ధతను అంచనా వేసుకుని, పోటీ పరీక్షల్లో మెరుగైన ప్రతిభ కనబరిచేందుకు ఈ మెగా మాక్ ప్రిలిమ్స్ పరీక్ష ఉపయోగపడుతుందని తెలిపారు.

అక్టోబర్ 22వ తేదీన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అభ్యర్థులకు ప్రోత్సాహకంగా మొదటి బహుమతిగా రూ.10,000, రెండో బహుమతిగా రూ.5,000, మూడో బహుమతిగా రూ.2,000 నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా, పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మొదటి 100 మంది అభ్యర్థులకు ఉచిత ఫిజికల్ ట్రైనింగ్‌తో పాటు భోజనం, వసతి సౌకర్యాలు కల్పించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. పోలీస్ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో సిద్ధమవుతున్న అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు https://forms.gle/EwsqCLeErjgEPTih6 లింక్ ద్వారా ముందుగానే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. మెగా మాక్ ప్రిలిమ్స్ పరీక్షకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం 7780543055, 8886304040 నంబర్లలో సంప్రదించాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## తాగునీటికే తొలి ప్రాధాన్యం!

- సూపర్ ఎల్‌నినోను సమష్టిగా ఎదుర్కోవాలి.
- యాసంగిలో ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు మళ్లాలి.
- మంత్రి మల్లు భట్టి విక్రమార్క.

రాజన్న సిరిసిల్ల, అక్టోబరు 12 (వుదయం ప్రతినిధి) :



సూపర్ ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్న నేపథ్యంలో అందుబాటులోని నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని, తాగునీటి అవసరాలకు అత్యంత ప్రాధాన్యమివ్వాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సూచించారు. 2027 జూన్ వరకు తాగునీటి అవసరాలు తీర్చేలా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. యాసంగి 2026-27లో నీటి లభ్యతను బట్టి పంటలు ఎంచుకోవాలని, అధిక నీరు అవసరమయ్యే వరి సాగుపై ఆచితూచి నిర్ణయం తీసుకోవాలని రైతులకు సూచించారు.సూపర్ ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనే అంశంపై సోమవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఇతర ఉన్నతాధికారులు అన్ని జిల్లాల కలెక్టర్లు, రైతులు, మహిళా స్వయం సహాయక సంఘాల ప్రతినిధులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని చంద్రంపేట రైతు వేదిక నుంచి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పాల్గొన్నారు. జిల్లాలోని పలు రైతు వేదికల నుంచి రైతులు, మహిళా సంఘాల సభ్యులు హాజరయ్యారు.ఎల్‌నినో ప్రభావంతో భూగర్భ జలాలు తగ్గుతున్నాయని, సాగునీటి లభ్యత పరిమితంగా ఉండే పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని రైతులు పంటల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం సూచించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు, ప్రజలు సమన్వయంతో పనిచేసి నీటి ఎద్దడిని ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. వ్యవసాయశాఖ అధికారులు, శాస్త్రవేత్తల సూచనల మేరకు ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని తెలిపారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. సూపర్ ఎల్‌నినో ప్రభావంపై రాష్ట్ర ప్రభుత్వం గత ఫిబ్రవరి నుంచే రైతులకు అవగాహన కల్పిస్తోందన్నారు. ముందస్తు చర్యలతో సుమారు 10 లక్షల ఎకరాల్లో వరి సాగు తగ్గిందని, మహబూబ్‌నగర్ ప్రాంతంలో కూరగాయల సాగు పెరిగిందని వివరించారు. పప్పుధాన్యాలు, నూనెగింజలు, పొద్దుతిరుగుడు, కూరగాయలు, ఉద్యాన పంటలు, ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించాలని సూచించారు.డ్రిప్, స్ప్రింక్లర్ వంటి సూక్ష్మ సేద్య పద్ధతులను విస్తృతంగా వినియోగించేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. యూరియా, విత్తనాల కొరత లేకుండా చూడాలని, నీటి లభ్యత, విద్యుత్ సరఫరాపై రైతులకు వాస్తవ పరిస్థితులను తెలియజేయాలని సూచించారు. ప్రజలకు తాగునీటితోపాటు పశువులకు నీరు, మేత అందుబాటులో ఉండేలా పశుసంవర్ధక, గ్రామీణాభివృద్ధి శాఖలు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. అందుబాటులోని నీటిని ప్రణాళికాబద్ధంగా వినియోగించుకోవాలని స్పష్టం చేశారు.గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనులను విస్తృతం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సూచించారు. నీటి సంరక్షణ పనులు, చెరువులు, కుంటల్లో పూడికతీత, నీటి నిల్వ నిర్మాణాలు, ఫామ్ పాండ్స్, వ్యక్తిగత, సామూహిక సోక్‌పిట్ల నిర్మాణాలు చేపట్టాలని తెలిపారు. గత ఏడాది రోజుకు సగటున 25 వేల మంది కూలీలు పనులకు హాజరుకాగా, ప్రస్తుతం ఆ సంఖ్య 2.5 లక్షలకు చేరిందన్నారు. నెలాఖరుకు రోజువారీ హాజరును ఐదు లక్షలకు పెంచేలా ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. మార్చి 2027 వరకు ఉపాధి హామీ పథకం కింద అదనంగా రూ.6,500 కోట్ల విలువైన పనులు చేపట్టేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు వివరించారు.రాష్ట్రంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైందని, రానున్న నెలల్లో ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ నిపుణురాలు డాక్టర్ ఎ. శ్రావణి తెలిపారు. ప్రస్తుతం తెలంగాణలో చెప్పుకోదగిన వర్షాలు కురిసే అవకాశాలు తక్కువగా ఉన్నాయని పేర్కొన్నారు. విద్యుత్ ఉత్పత్తి, సరఫరాపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని సమావేశంలో సూచించారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. జిల్లాలో వర్షాలు తక్కువగా కురవడంతో భూగర్భ జలాలు తగ్గుతున్నాయని తెలిపారు. వేడి వాతావరణం కారణంగా గృహ, ఇతర అవసరాలకు విద్యుత్ వినియోగం సాధారణం కంటే సుమారు 25 శాతం పెరిగిందన్నారు. ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో విద్యుత్ ఉత్పత్తి కూడా తగ్గిందని వివరించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటిని తాగునీరు, పశుసంపద సంరక్షణకు ప్రాధాన్యమిస్తూ వినియోగించాల్సి ఉందని పేర్కొన్నారు. నీటి వృథాను అరికట్టాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.రైతులు వరికి బదులుగా కందులు, పెసర్లు, మినుములు, మొక్కజొన్న, ఆముదం, నువ్వులు, శనగలు, పొద్దుతిరుగుడు, కూరగాయలు, ఆయిల్‌పామ్ వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు. ఉద్యాన పంటలకు డ్రిప్ ఇరిగేషన్ వినియోగాన్ని పెంచాలని తెలిపారు.వీర్నపల్లి మండలానికి చెందిన రైతు రాములు నాయక్ ఐదు ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేస్తూ మంచి దిగుబడులు పొందుతున్నట్లు తెలిపారు. ఈ పంటలో నీటి వినియోగం, విద్యుత్ అవసరం తక్కువగా ఉంటున్నాయని వివరించారు. తంగళ్లపల్లి మండలం దేశాయిపల్లికి చెందిన రైతు రమేష్ బీరకాయ, సొరకాయ, టమాటా, మిర్చి వంటి కూరగాయలను సాగు చేస్తున్నట్లు చెప్పారు. వరికి బదులుగా కూరగాయల సాగుతో నిరంతర ఆదాయం లభిస్తోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా వ్యవసాయశాఖ అధికారి అఫ్జల్ బేగం, ఉద్యానవనశాఖ అధికారి శరత్‌బాబు, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి శ్రీధర్, జిల్లా మత్స్యశాఖ అధికారి సౌజన్య, నీటిపారుదల శాఖ, ఎన్పీడీసీఎల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

- పలు సమస్యలపై వినతులు స్వీకరణ
- జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్
- ప్రజావాణి ఫిర్యాదుల సంఖ్య : 49



జగిత్యాల అక్టోబర్ 12 (వుదయం ప్రతినిధి) ప్రజావాణి ద్వారా ప్రజల నుండి అందుతున్న ఫిర్యాదులు వినతులపై సమగ్ర విచారణ జరిపి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ ప్రజల నుండి ఫిర్యాదులు వినతులను స్వీకరించారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంతో పాటు వివిధ మండలాల నుండి ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమానికి వస్తున్నారని తెలిపారు ప్రజల నుండి అందుతున్న ప్రతి ఫిర్యాదును అధికారులు బాధ్యతాయుతంగా తీసుకొని సంబంధిత సమస్యపై సమగ్ర విచారణ జరిపి సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు ప్రజావాణి ద్వారా అందిన అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం లేకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు తేది 12 10 2026సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 49 ఫిర్యాదులు వినతులు అందాయని వాటిని సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి తగిన చర్యలు తీసుకొని పరిష్కరించాలని సూచించారు ప్రజావాణి ద్వారా అందిన ప్రతి దరఖాస్తును అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టడంతో పాటు దరఖాస్తుదారులకు తగిన సమాచారం అందించాలని పేర్కొన్నారు ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందే విధంగా అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు ఈ కార్యక్రమంలో డిఆర్ఓ కెవై ప్రసాద్ ఆర్డీవో లు మధు సూదన్ జీవాకర్ రెడ్డి నరసింహారావు జిల్లా అధికారులు వివిధ శాఖల అధికారులు మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు

## ప్రజావాణిలో 72 ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా కలెక్టర్



కామారెడ్డి, అక్టోబర్ 12 (వుదయం ప్రతినిధి):-

కామారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ప్రజల నుంచి 72 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజలు తమ సమస్యలను జిల్లా కలెక్టర్‌కు విన్నవించగా, ఆయా ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి, నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, పరిష్కారంలో జాప్యం లేకుండా చూడాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ విక్టర్, డిప్యూటీ శిక్షణ కలెక్టర్ రవితేజ, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి చందర్, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా, (వుదయం ప్రతినిధి), అక్టోబరు 12:

ప్రజావాణిలో ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం. డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణుతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.ఈ సందర్భంగా పలువురు తమ సమస్యలపై కలెక్టర్‌కు దరఖాస్తులు అందజేశారు. దివ్యాంగ పింఛన్ మంజూరు, బీఈడీ కళాశాల నుంచి టీసీ జారీ, కే ఫారం మంజూరు, స్వయం ఉపాధి పథకం కింద డెయిరీ ఫారం నిర్మాణానికి గ్రామపంచాయతీ ఎన్‌ఓసీ, భూమి పట్టా మార్పిడిపై విచారణ జరిపి న్యాయం చేయాలని కోరుతూ అర్జీలు సమర్పించారు.

ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం పరిశీలించి త్వరగా పరిష్కరించాలని, ఎలాంటి కారణం లేకుండా పెండింగ్‌లో ఉంచకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు.

ప్రజావాణికి గైర్హాజరైన 30 మంది అధికారులకు షోకాజ్ నోటీసులు

ప్రజావాణి కార్యక్రమానికి గైర్హాజరైన 30 మంది జిల్లా అధికారులకు కలెక్టర్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే ప్రజావాణికి ప్రతి శాఖ జిల్లా అధికారి తప్పనిసరిగా హాజరు కావాలని, ముందస్తు సమాచారం లేకుండా గైర్హాజరైతే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో ఫిర్యాదుదారుల సమస్యలు విన్న ఎస్పీ డా. జి. జానకి షర్మిల, IPS

- ప్రజావాణిలో ఫిర్యాదుదారుల సమస్యలు విన్న ఎస్పీ డా. జి. జానకి షర్మిల, IPS
- ఫిర్యాదులపై తక్షణ స్పందన.. చట్టపరంగా పరిష్కారం చూపాలని అధికారులకు ఆదేశాలు

నిర్మల్ జిల్లా (వుదయం ప్రతినిధి) 12 అక్టోబర్ 2026





నిర్మల్ జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, IPS జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను స్వీకరించి వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు.

ప్రజలు తెలిపిన సమస్యలను క్షుణ్ణంగా విన్న ఎస్పీ, సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో మాట్లాడి ప్రతి ఫిర్యాదుపై వెంటనే స్పందించాలని ఆదేశించారు. ఫిర్యాదులను చట్టపరంగా పరిశీలించి, బాధితులకు సకాలంలో న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రజావాణి ద్వారా అందే ప్రతి ఫిర్యాదును బాధ్యతతో స్వీకరించి, దాని పరిష్కారానికి తీసుకున్న చర్యలను ఎప్పటికప్పుడు సమీక్షించాలని అధికారులను ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంలో అనవసర జాప్యం లేకుండా, బాధితులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వారికి పూర్తి స్థాయిలో సహకరించాలని సూచించారు.

ప్రజలు తమ సమస్యలను నేరుగా పోలీసు శాఖ దృష్టికి తీసుకువచ్చేలా ప్రజావాణి కార్యక్రమం ఉపయోగపడుతుందని ఎస్పీ తెలిపారు. ప్రజలకు పోలీసు సేవలను మరింత చేరువ చేయడంతో పాటు, పారదర్శకంగా, బాధ్యతాయుతంగా సేవలందిస్తూ పోలీసు శాఖపై ప్రజల్లో నమ్మకాన్ని

మరింత బలోపేతం చేయడమే లక్ష్యమని జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, IPS పేర్కొన్నారు.

## పేదలకు వైద్య సహాయం అందించడమే సీఎంఆర్ఎఫ్ లక్ష్యం

మంచిర్యాల /రామకృష్ణాపూర్/ అక్టోబర్ 12 (వుదయంప్రతినిధి)

ఆర్థిక ఇబ్బందులతో వైద్య చికిత్స పొందలేని పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (CMRF) అండగా నిలుస్తుందని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు వొడ్నాల శ్రీనివాస్ అన్నారు. రామకృష్ణాపూర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన CMRF చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలను అర్హులైన ప్రతి కుటుంబానికి అందేలా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ఆధ్వర్యంలో చెన్నూరు నియోజకవర్గంలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, క్యాతనపల్లి మున్సిపాలిటీలో రూ.100 కోట్లతో తాగునీటి సదుపాయాల మెరుగుదలకు చేపట్టిన పనులతో పాటు రోడ్లు, డ్రైనేజీలు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కౌన్సిలర్లు మంతెన మల్లమ్మ, దాముక శిరీష, గుర్రం శ్రీనివాస్, భీమ మల్లేష్, కూతురు ప్రభాకర్, మాజీ పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు, గాండ్ల సమ్మయ్య, నాగుల రాజ్ కుమార్, బత్తుల శ్రీనివాస్, మంద సృజన, మేకల సురేందర్, బత్తుల వేణు, నక్క శ్రీనివాస్, బొద్దుల ప్రేమ్ సాగర్, దాముక రమేష్, కనుకుంట్ల కనకయ్య, కుదిరే రామస్వామి, జాలిగపు రాజేశ్వరి, దీప, అనూష, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



## కాగజ్‌నగర్ లో కొత్త బస్టాండ్ నిర్మించండి

- సిర్పూర్ శాసనసభ్యులు డా. పాల్వాయి హరీష్ బాబు.

ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి)



హైదరాబాద్: బస్ భవన్‌లో సోమవారం రోజు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఎండీ నాగిరెడ్డి ని సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా వినతిపత్రం సమర్పిస్తూ, కాగజ్‌నగర్ బస్టాండ్ శిథిలావస్థకు చేరుకుందని, దాని స్థానంలో కొత్త బస్టాండ్‌తో పాటు షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మించాలని కోరారు.ఈ వినతిపై సానుకూలంగా స్పందించిన ఆర్టీసీ ఎండీ, సరైన ఆర్కిటెక్ట్ ద్వారా ప్రణాళిక రూపొందించి, కొత్త బస్టాండ్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## విమర్శలకు ధీటుగా అభివృద్ధి పనులు

- ప్రతిపక్ష విమర్శలకు కాంగ్రెస్ నాయకులు కౌంటర్

ధర్మపురి అక్టోబర్12 (వుదయం ప్రతినిధి):

బుగ్గారం మండలానికి తహశీల్దార్ కార్యాలయం,ధర్మపురికి డిగ్రీ కళాశాల మంజూరయ్యా యని పేర్కొన్నారు.

రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటి గ్రేటెడ్ కళాశాల నిర్మాణ పనులు కొన సాగుతున్నాయని, ఇప్పటి వరకు రూ.7.5 కోట్ల ఎల్ఓసీలు అందజేశామని తెలిపారు. గోదా వరి నదిలో మురుగు నీరు కలవ కుండా సీవరేజ్ ట్రీట్ మెంట్ ప్లాం ట్ మంజూరైందని,రాబోయే పు ష్కరాలను భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఘనం గా నిర్వహిస్తామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజాదరణ పెరుగుతుండటాన్ని ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు

అసత్య ప్రచారాలు చేస్తున్నారని విమ ర్శించారు.ఈ సమావేశం లో ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చిలుముల లక్ష్మణ్, పెగడపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కడారి తిరుపతి, గొల్లపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గంగన్న,మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వేముల రాజే శ్,పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చిపిరి శెట్టి.రాజేశ్, కౌన్సిలర్లు,జె. సుముఖ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# మహబూబ్ నగర్ | మెదక్ - ఉమ్మడి జిల్లాల వార్తలు



## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా.
- ప్రజావాణికి 101 పిర్యాదుల స్వీకరణ.

**మహబూబ్ నగర్ :**





ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులకు ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి హరిప్రియ తో కలిసి అర్జిదారుల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా అర్జిదారుల సమస్యలను కలెక్టర్ సావధానంగా విన్నారు.ప్రతి సమస్యను జాగ్రత్తగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వారికి భరోసా ఇచ్చారు. అధికారులు ప్రజావాణి దరఖాస్తులను క్షుణ్ణంగా చదివి అర్థంచేసుకుని క్షేత్ర స్థాయిలో పరిశీలించి సత్వరం పరిష్కరించాలని అన్నారు.ప్రజావాణిలో పంచాయతీరాజ్, మున్సిపల్, నీటిపారుదల, జిల్లా సంక్షేమం, వ్యవసాయం, పౌరసరఫరాల శాఖ, భూ సర్వే రికార్డులు, గృహ నిర్మాణం, రోడ్డు రవాణా, పోలీస్, గిరిజన అభివృద్ధి శాఖ, విద్యుత్ శాఖ, విద్య, వైద్య ఆరోగ్యం, మైనింగ్, అటవీ, గ్రామీణ అభివృద్ధి, తదితర శాఖలకు సంబంధించిన మొత్తం 101 వినతులను అధికారులు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి హరిప్రియ డి.ఆర్.ఓ ఎ. నిర్మల, భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రామ్ రెడ్డి, జెడ్. పి. సి. ఈ.ఓ, ఇంచార్జి డి. పి. ఓ వెంకట రెడ్డి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీలో అవార్డు అందుకున్న పేట కలెక్టర్ సిహెచ్ ప్రియాంక

- నారాయణపేటకు జాతీయస్థాయి గుర్తింపు

**నారాయణపేట టౌన్ అక్టోబర్ 12 (వుదయం ప్రతినిధి)**




నారాయణపేట జిల్లాలో ప్రధానమంత్రి ధన్‌ధాన్య కృషి యోజన కార్యక్రమం అమలులో విశిష్ట సేవలు అందించినందుకు జిల్లా కలెక్టర్ ప్రియాంక సోమవారం న్యూఢిల్లీలో వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డును అందుకున్నారు. వ్యవసాయ రంగ అభివృద్ధి, రైతుల సంక్షేమం, ప్రభుత్వ పథకాల సమర్థవంతమైన అమలులో జిల్లా యంత్రాంగం చేసిన కృషికి ఈ గుర్తింపు లభించడం విశేషం.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రియాంక మాట్లాడుతూప్రధానమంత్రి ధన్‌ధాన్య కృషి యోజన లక్ష్యాలకు అనుగుణంగా వ్యవసాయ రంగ అభివృద్ధి, రైతులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందించడం, వ్యవసాయ సంబంధిత కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడం వంటి అంశాల్లో అధికారులు అంకితభావంతో పనిచేయడం అభినందనీయమని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో వ్యవసాయ రంగానికి సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తూ, సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. ఈ అవార్డు సాధనలో భాగస్వాములైన జిల్లా అధికారులందరికీ, వారి బృందాలకు జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ప్రతి ఒక్కరి సహకారం, కృషి, బాధ్యతాయుతమైన పనితీరు ఈ విజయానికి పునాది అని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ ఇదే బృంద స్ఫూర్తిని కొనసాగిస్తూ, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు జిల్లా అభివృద్ధిలో మరిన్ని మైలురాళ్లను సాధించాలని ఆకాంక్షించారు.నారాయణపేట జిల్లాకు లభించిన ఈ గుర్తింపు జిల్లా యంత్రాంగానికి మరింత బాధ్యతను పెంచిందని, రానున్న రోజుల్లో ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు ఈ అవార్డు ప్రేరణగా నిలుస్తుందని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## సంగారెడ్డి జిల్లాలో ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు ఉచిత కోచింగ్ తరగతులు ప్రారంభం

- శిక్షణ తరగతులను ప్రారంభించిన జిల్లా జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఐఎఎస్., జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపిఎస్.

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి:వుదయం**






జిల్లా వ్యాప్తంగా ఎస్ఐ, పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు చేయూత అందించాలనే లక్ష్యంతో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కోచింగ్ తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. సంగారెడ్డి, జహీరాబాద్, జోగిపేట కేంద్రాల్లో ఈ శిక్షణ తరగతులను ప్రారంభించారు.సంగారెడ్డిలోని అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు జ్యోతి ప్రజ్వలన చేసి, తెలంగాణ రాష్ట్ర గీతాన్ని ఆలపించిన అనంతరం ఉచిత కోచింగ్ తరగతులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాల సాధన కోసం పోటీపడుతున్న అభ్యర్థులకు జనరల్ స్టడీస్, రీజనింగ్, న్యూమరికల్ ఎబిలిటీ, కరెంట్ అఫైర్స్ తదితర అంశాల్లో నిపుణులచే శిక్షణ అందించనున్నట్లు ఎస్పీ తెలిపారు. అభ్యర్థులు సమయపాలన పాటించి, క్రమం తప్పకుండా శిక్షణకు హాజరువ్వాలని అన్నారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, క్రమశిక్షణతో చదువుతూ లక్ష్యాన్ని సాధించాలన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, నిరుద్యోగ యువతకు చేయూతనందించి, పోలీసు ఉద్యోగాల సాధనలో సరైన మార్గదర్శకత్వం అందించేందుకు ఈ ఉచిత కోచింగ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. అభ్యర్థులు పట్టుదలతో శ్రమించి పోటీ పరీక్షల్లో విజయం సాధించాలని జిల్లా కలెక్టర్, ఎస్పీ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, ఐపీఎస్, డిఎస్పీ సత్యయ్య గౌడ్, ఆర్డీఓ రాజన్న, మున్సిపాల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## నూతన వస్త్రాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

- యువత ఉద్యోగాలకే పరిమితం కాకుండా వ్యాపార రంగంలోనూ రాణించాలి
- యువకులను అభినందించిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

**దుబ్బాక ప్రతినిధి, అక్టోబర్ 12, వుదయం:**





యువత ప్రభుత్వ ఉద్యోగాలపైనే ఆధారపడకుండా వ్యాపార, పారిశ్రామిక రంగాలతో పాటు అన్ని రంగాల్లోనూ రాణించాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి సూచించారు. యువత స్వయం ఉపాధి వైపు అడుగులు వేయడం అభినందనీయమని పేర్కొన్నారు. సిద్దిపేట పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన వార్తాలి వస్త్రాలయాన్ని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి బక్కి వెంకటయ్యతో కలిసి ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దుబ్బాక నియోజకవర్గంలోని దుబ్బాక, మిరుదొడ్డి మండలాలకు చెందిన యువత వ్యాపార రంగంలోకి అడుగుపెట్టడం పై ఆయన హర్షం వ్యక్తం చేశారు. యువత తమలోని నైపుణ్యాలను ఉపయోగించుకుని వ్యాపార రంగంలో స్థిరపడేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి సూచించారు. నూతనంగా ఏర్పాటు చేసిన వార్తాలి వస్త్రాలయాన్ని ప్రజలు సందర్శించి, తమకు అవసరమైన నూతన వస్త్రాలను కొనుగోలు చేయాలని కోరారు. అనంతరం వస్త్రాలయాన్ని ఏర్పాటు చేసిన యువకులు యాదగిరి, సతీష్ ,వేణు ,రాజులను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పలువురు పాల్గొన్నారు.

## ఎల్ నీనో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- ప్రకృతి వైపరీత్యం వల్ల ప్రపంచ వ్యాప్తంగా ఏర్పడిన ఎల్ నీనో ప్రభావాన్ని అధిగమించేందుకు ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలి

**వనపర్తి అక్టోబర్ 12 (వుదయం ప్రతినిధి) :**



జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని నీటి సంరక్షణ బాధ్యతలు ప్రతి ఒక్కరు తీసుకోవాలి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి పసిఫిక్ మహాసముద్రం పై ఆవరించిన వేడి గాలుల వల్ల సూపర్ ఎల్ నీనో గా ఏర్పడి ఒక్క భారత దేశంలోనే కాకుండా ప్రపంచం వ్యాప్తంగా తక్కువ వర్షపాతం, అధిక ఉష్ణోగ్రతలు వంటి ప్రకృతి వైపరీత్యాలు ఏర్పడుతున్నాయని దీనిని అధిగమించేందుకు ప్రజాప్రతినిధులు అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. తెలంగాణలో ఎల్ నీనో ప్రభావం, అధికారులు, రైతుల అప్రమత్తత పై సోమవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర రోడ్డు రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఏర్పాటుచేసిన రైతు నేస్తం కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏర్పాటు చేసి రాష్ట్రంలోని అన్ని రైతువేదికల ద్వారా రైతులు, అధికారులకు అవగాహన కల్పించారు. వనపర్తి మండలం అంకుర్ గ్రామ రైతు వేదికలో రైతులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో కలిసి పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ పలు సూచనలు చేశారు. వనపర్తి జిల్లాలో గత సంవత్సరం కంటే చాలా తక్కువ వర్షపాతం నమోదు అయిందని అదేవిధంగా రిజర్వాయర్లలో సైతం తక్కువ నీటి లభ్యత కారణంగా ఇప్పటికే రైతులకు వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు వేసుకునే విధంగా అవగాహన కల్పించడం జరిగిందన్నారు. రాబోయే రబి సీజన్ లో రైతులు ఎవరు వరి పంట సాగు చేయవద్దని దానికి బదులుగా తక్కువ నీటితో పండే చిరుధాన్యాలు, నూనె గింజలు సాగు చేసుకోవాలని సూచించారు. స్ప్రింక్లర్లు, డ్రిప్ ద్వారా మాత్రమే పంటలు సాగు చేసుకునే విధంగా చూడాలని ఇందుకు వ్యవసాయ అధికారులు క్షేత్ర స్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. భూగర్భ జలాలు నిరంతరంగా అడుగంటిపోతున్నాయని అందువల్ల ప్రజలు నీటి వాడకాన్ని చాలా జాగ్రత్తగా ఉపయోగించాలని సూచించారు. రాబోయే రోజుల్లో జిల్లాలో ఉష్ణోగ్రతలు అధికంగా ఉండే ప్రమాదం ఉందని, అందువల్ల వృద్ధులు, బయట పనిచేసే కార్మికులు చాలా జాగ్రత్తాగా ఉండి ఆరోగ్యం కాపాడుకోవాలని సూచించారు.

అంతకు ముందు రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క ఢిల్లీ నుండి రైతులకు పలు సూచనలు చేశారు. తక్కువ వర్షపాతం, అధిక ఉష్ణోగ్రతలు వంటి అత్యయిక పరిస్థితిలను పకడబందీగా అధికమించేందుకు ఆయా శాఖల ఉన్నతాధికారులు పకడబందీగా చర్యలు తీసుకోవాలని సూచించారు.రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎల్ నీనో వల్ల వస్తున్న ప్రపంచ విపత్తు, అధిక ఉష్ణోగ్రతలు అత్యల్ప వర్షపాతం పై రైతులకు వాస్తవాలు తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. రైతులు తక్కువ నీటితో సాగు అయ్యే పంటలు మాత్రమే వేసుకోవాలని లేదంటే వేసుకోకున్న పర్వాలేదు కానీ పంటలు వేసి రైతులు నష్టపోవద్దని తెలియజేశారు. ప్రస్తుతం విద్యుత్ వినియోగం గరిష్ట స్థాయికి చేరుకుందని, కానీ ప్రభుత్వం విద్యుత్ కొనాలనుకున్న దొరికే పరిస్థితి లేదన్నారు. రాష్ట్రంలో జల విద్యుత్ ఉత్పత్తి పూర్తిగా ఆగిపోయిందని సరైన బొగ్గు నిలువలు లేక థర్మల్ విద్యుత్ సైతం ఆశించిన స్థాయిలో ఉత్పత్తి కావడం లేదన్నారు.అందుకే ప్రజలు, నీటి వాడకం, విద్యుత్ వాడకం పొదుపుగా చేసుకోవాలని సూచించారు. పరిస్థితులను అధిగమించేందుకు రాష్ట్రప్రభుత్వం అన్ని విధాల కృషి చేస్తున్నట్లు తెలియజేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా వ్యవసాయ అధికారి ఆంజనేయులు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి విజయ్ భాస్కర్, రైతు నాయకులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కలెక్టరేట్ ముందే మట్టి మాఫియా తాండవం

- కలెక్టరేట్ ముందే మట్టి మాఫియా తాండవం.. కలెక్టర్ వార్నింగ్ బేఖాతర్.. యంత్రాంగం వల్లే అక్రమార్కులకు రెడ్ కార్పెట్!

**గద్వాల, అక్టోబర్ 12 (వుదయం బ్యూరో)**



జిల్లా పాలనా కేంద్రానికి కూతవేటు దూరంలో.. సాక్షాత్తు కలెక్టరేట్, పోలీస్‌స్టేషన్ కళ్లెదుటే మట్టి మాఫియా నిస్సిగ్గుగా తాండవిస్తోంది. ప్రభుత్వ నిబంధనలను, ఉన్నతాధికారుల హెచ్చరికలను బూడిదలో పోసిన పన్నీరులా మారుస్తూ సాగుతున్న ఈ అక్రమ రవాణా దందా.. జోగులాంబ గద్వాల జిల్లాలో అధికార యంత్రాంగం పనితీరును అభాసుపాలు చేస్తోంది. ఎక్కడ చూసినా ఈ అక్రమాలపై తీవ్ర విమర్శలు వస్తున్నా, బాధ్యత గల రెవెన్యూ, మైనింగ్ శాఖల అధికారులు మాత్రం కాసులకు కక్కుర్తిపడి మొద్దునిద్ర నటిస్తున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. సమావేశ మందిరాల్లో హెచ్చరికల డ్రామాలాడుతూ, క్షేత్రస్థాయిలో అక్రమార్కులకు రాజమార్గం పరుస్తున్న అధికారుల తీరు చూస్తుంటే.. ఈ దందా వెనుక పెద్దల అండదండలు, మిలాఖత్ బాగోతం ఇట్టే స్పష్టమవుతోంది! కలెక్టర్ వార్నింగ్ బేఖాతర్.. ఆ ఆదేశాలు చెత్తబుట్టలోనేనా? గత జూలైలో స్వయంగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ షేక్ బాషా రంగంలోకి దిగి రెవెన్యూ, మైనింగ్, పోలీసు అధికారులతో అత్యున్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. అనుమతులు లేకుండా మట్టి, ఇసుక దందాలకు పాల్పడితే ఎంతటివారైనా సరే, పీకలు పిసికే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కానీ ఆ హెచ్చరికలు ఆ సమావేశ మందిరపు గోడలు దాటనేలేదు! కలెక్టర్ హుకుమ్‌లను కిందిస్థాయి సిబ్బంది చెత్తబుట్టలో పడేశారు. ఉన్నతాధికారుల ఆదేశాలకే దిక్కులేకుండా పోతే, ఇక సామాన్యులకు చట్టంపై నమ్మకం ఎలా ఉంటుంది? అధికారుల ఈ ఉదాసీనత వల్లే మాఫియాకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. పోలీస్‌స్టేషన్, కలెక్టరేట్ పక్కనే.. నిత్యం వందలాది టన్నుల దొంగసరుకు రవాణా! గద్వాల మండలం వీరపురం నుంచి నిత్యం వందలాది టన్నుల మట్టిని భారీ టిప్పర్లలో యథేచ్ఛగా తరలిస్తున్నారు. వీకెండ్స్, సెలవు రోజులైతే చాలు ఈ రవాణా మరింత విచ్చలవిడిగా సాగిపోతోంది. ఇక్కడ అత్యంత సిగ్గుచేటైన విషయం ఏమిటంటే.. ఈ మట్టి వాహనాలు వెళ్లే మార్గం నేరుగా గద్వాల రూరల్ పోలీస్‌స్టేషన్, జిల్లా కలెక్టరేట్ ముందే సాగుతోంది! అధికార కేంద్రాల కళ్ల ముందే, పోలీసుల కంట పడేలా భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నా ఎవరూ పట్టించుకోకపోవడం చూస్తుంటే.. "దొంగే దొంగ అన్నట్లు" అధికారుల మౌనం ఎవరిని కాపాడుతుందనే ప్రశ్నల వర్షం కురుస్తోంది. అసలు ఈ వాహనాలకు అనుమతులు ఉన్నాయా? లేక లంచాల మత్తులో అధికారులు కళ్లు మూసుకున్నారా?ప్రేక్షక పాత్రలో రెవెన్యూ, మైనింగ్.. ఖజానాకు లూటీ! ప్రభుత్వ ఆస్తులను, భూగర్భ సంపదను కాపాడాల్సిన రెవెన్యూ, మైనింగ్ శాఖల అధికారులు పూర్తిగా ప్రేక్షక పాత్రకు పరిమితమయ్యారు. మట్టి ఎక్కడి నుంచి తవ్వుతున్నారు? ఎంత మేర తరలిస్తున్నారు? ప్రభుత్వ ఖజానాకు ఎంత గండి పడుతోంది? అనే కనీస స్పృహ లేకుండా కుంభకర్ణ నిద్రపోతున్నారు.నిబంధనలు పాటించే పేదలకు ఒక న్యాయం.. అక్రమ దందాలు చేసే బడా మాఫియాకు మరో న్యాయమా? అధికారుల ఈ పక్షపాత వైఖరి ప్రజాగ్రహానికి కారణమవుతోంది. ఈ మౌనం వెనుక ఉన్న మూలాలను తవ్వి తీయాల్సిన సమయం ఆసన్నమైంది. ఇకనైనా కళ్లు తెరుస్తారా? లేక ప్రజా ఆగ్రహం చవిచూస్తారా?హెచ్చరికలు కేవలం పేపర్లకే, ప్రకటనలకే పరిమితమైతే ప్రభుత్వ యంత్రాంగంపై ప్రజల్లో ఉన్న శేషప్రజాస్వామ్య విశ్వాసం కూడా మట్టి కలిసిపోతుంది. వీరపురం మట్టి అక్రమ రవాణా వ్యవహారంపై ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్వయంగా జోక్యం చేసుకోవాలి. సంబంధిత శాఖలతో సంయుక్త తనిఖీలు (జాయింట్ ఇన్‌స్పెక్షన్) నిర్వహించి, వాస్తవాలను నిర్ధారించి, అక్రమాలకు పాల్పడిన వారిపై, వారికి అండగా నిలిచిన అధికారులపై వేటు వేయాలి. అప్పుడే ప్రభుత్వ రూల్స్ పట్ల భయం ఉంటుంది. లేనిపక్షంలో, ఈ అక్రమ రవాణాపై ప్రజలే స్వయంగా రంగంలోకి దిగి తగిన తరిమికొట్టే రోజులు వస్తాయి!

# కాత్యాయని దేవిగా దర్శనమిచ్చిన వాసవి మాత

- కాత్యాయని దేవిగా దర్శనమిచ్చిన వాసవి మాత.. వైభవంగా శివపార్వతుల కల్యాణం
- కల్యాణ యోగం కోసం యువతీ యువకుల ప్రత్యేక పూజలు

**నాగర్ కర్నూల్, అక్టోబరు 12 (వుదయం బ్యూరో):**





పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో 56వ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా, భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజైన సోమవారం వాసవి కన్యకా పరమేశ్వరి మాత కాత్యాయని దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా ఆలయంలో అభిషేక పూజలు, గణపతి, సుబ్రహ్మణ్యం, దుర్గ, సరస్వతి, లక్ష్మీ హోమాలను వైభవంగా నిర్వహించారు. హోమాల అనంతరం మహానీరాజనం, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు.
పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బిల్లాకంటి హరిబాబు, దేవాలయ కమిటీ అధ్యక్షులు మిడిదొడ్డి అంజయ్య ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ఉత్సవాల్లో ఆలయ ప్రధాన అర్చకులు జోషి పాండురంగ శర్మ నేతృత్వంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నప్రసాద వితరణ చేపట్టారు.సాయంకాలం ఆలయంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించడం విశేషంగా నిలిచింది. కల్యాణ సుందరేశ్వర స్వామి స్వరూపంలో శివపార్వతులను సుందరంగా అలంకరించి వేదమంత్రాల నడుమ కల్యాణ వేడుకను జరిపించారు. ఈ కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. హిందూ సంప్రదాయంలో శివపార్వతుల కల్యాణానికి విశిష్టమైన ఆధ్యాత్మిక ప్రాధాన్యం ఉంది. పరమశివుడు, పార్వతీదేవి దాంపత్య జీవితానికి ఆదర్శంగా నిలుస్తారని భక్తుల విశ్వాసం. శివపార్వతుల కల్యాణాన్ని దర్శించడం, పూజల్లో పాల్గొనడం వల్ల దాంపత్య జీవితంలో సుఖసంతోషాలు కలుగుతాయని భావిస్తారు. ముఖ్యంగా వివాహం కాని యువతీ యువకులు ఈ కల్యాణోత్సవంలో పాల్గొని స్వామివారికి, అమ్మవారికి పూలమాలలు సమర్పించి తమకు త్వరగా కల్యాణ యోగం కలగాలని ప్రార్థించారు. కల్యాణం అనంతరం స్వామివారికి సమర్పించిన పూలమాలలను ధరించడం ద్వారా కల్యాణ యోగం సిద్ధిస్తుందని భక్తుల ప్రగాఢ నమ్మకం. అనంతరం పుష్పార్చన, హారతి, పల్లకి సేవ నిర్వహించారు. అంతం తీర్థ ప్రసాదాలు, అల్పాహారం వితరణ చేశారు ఈ కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం సభ్యులు మరియు దేవాలయ కమిటీ సభ్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు

## రెండో రోజు గాయత్రీ దేవి అలంకరణలో అమ్మవారు దర్శనం

**వెల్దండ అక్టోబర్ 12 (వు దయం)**



మండల కేంద్రంలోని బుధవార్ పేట ఆంజనేయస్వామి దేవాలయంలో మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు
ఉత్సవ కమిటీ అధ్యక్షులు అల్లంపల్లి కృష్ణ కార్యదర్శి పాలాది సంతోష్ కార్యవర్గం ఆధ్వర్యంలో పూజలు ఘనంగా నిర్వహిస్తున్నారు
అమ్మవారు
రెండవ రోజు గాయత్రీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిసిసి ఉపాధ్యక్షులు యన్నం భూపతి రెడ్డి ఎస్సై యుగంధర్ రెడ్డి వెల్దండ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ ఆర్యవైశ్య మహాసభ జిల్లా మాజీ అధ్యక్షులు బచ్చు రామకృష్ణతో పాటు పలువురు ఆర్యవైశ్యులు పాల్గొన్నారు ఉత్సవ _ కమిటీ ముఖ్య _ అతిథులను శాలువాలతో ఘనంగా సన్మానించి అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు అదేవిధంగా జర్నలిస్టు మిత్రులు మిరియాల రాజయ్య బొమ్మిశెట్టి శ్రీనివాసులను జన్మదిన సందర్భంగా శాలువాలతో ఘనంగా సన్మానించినారు కార్యక్రమంలో ఉప్పు ఆంజనేయులు పూరి వజ్ర లింగం కుమారస్వామి , లక్ష్మీనారాయణ,
రాఘవేందర్, సంతోష్, తో పాటు మహిళలు భక్తులు పాల్గొన్నారు

# కేసీఆర్ దూరదృష్టికి కొత్త జిల్లాల ఏర్పాటు నిదర్శనం

- ప్రజలకు పాలనను చేరువ చేసిన ఘనత కేసీఆర్‌దే: శ్రీశైల్ రెడ్డి
- పైలట్ రోహిత్ రెడ్డి పిలుపుతో తాండూరు నుంచి భారీగా తరలివచ్చిన బీఆర్ఎస్ శ్రేణులు

**తాండూర్ , అక్టోబర్ 12 (ఉదయం ప్రతినిధి):**

ప్రజలకు పాలనను చేరువ చేయాలనే లక్ష్యంతో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేపట్టిన కొత్త జిల్లాల ఏర్పాటు చారిత్రాత్మక నిర్ణయమని తాండూరు నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి శ్రీశైల్ రెడ్డి అన్నారు. కొత్త జిల్లాల ఏర్పాటుతో పరిపాలన ప్రజలకు మరింత చేరువైందని, ఇది కేసీఆర్ దూరదృష్టికి నిదర్శనమని కొనియాడారు.తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో కొత్త జిల్లాల ఏర్పాటు జరిగి పదేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం వికారాబాద్‌లోని ఎన్‌టీఆర్ చౌరస్తాలో నిర్వహించిన కార్యక్రమంలో కేసీఆర్ చిత్రపటానికి మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, శ్రీశైల్ రెడ్డి క్షీరాభిషేకం చేశారు. తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి పిలుపు మేరకు తాండూరు నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి కార్యక్రమంలో పాల్గొన్నారు.



ఈ సందర్భంగా శ్రీశైల్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధనలోనే కాకుండా, రాష్ట్ర అభివృద్ధి, పరిపాలనా సంస్కరణల్లోనూ కేసీఆర్ కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. గతంలో ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన పనుల కోసం ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదని, జిల్లాల పునర్వ్యవస్థీకరణతో ఆ ఇబ్బందులు తగ్గి ప్రభుత్వ సేవలు ప్రజలకు చేరువయ్యాయని అన్నారు.
ప్రజల అవసరాలు, సౌకర్యాలను దృష్టిలో ఉంచుకొని కొత్త జిల్లాలను ఏర్పాటు చేయడం ద్వారా పరిపాలనా సౌలభ్యం పెరిగిందని, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేసే అవకాశం ఏర్పడిందని తెలిపారు. ఈ నిర్ణయం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. కొత్త జిల్లాల ఏర్పాటు జరిగి పదేళ్లు పూర్తయిన సందర్భంగా కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తూ క్షీరాభిషేక కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో తాండూరు నియోజకవర్గంలోని వివిధ మండలాల బీఆర్ఎస్ అధ్యక్షులు, కార్యదర్శులు, కౌన్సిలర్లు, సర్పంచులు, మాజీ సర్పంచులు, సీనియర్ నాయకులు, ఇతర ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పాత ట్యాంకుకు మిషన్ భగీరథ రంగులు..
# తండాకు తాగునీరు కరువు!

- పైపులైన్లు లేవు.. ఇంటింటికీ నీటి కనెక్షన్లు లేవు.. గ్రామ ప్రజాప్రతినిధుల ప్రమేయం లేకుండానే పేరు మార్పు చేశారన్న ఆరోపణలు
- సిద్ధాపూర్ తండాకు తాగునీరు అందించాలని సర్పంచ్ చవాన్ రమేష్ విజ్ఞప్తి

**కోహీర్, అక్టోబరు 11 (వుదయం ప్రతినిధి):**



సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం సిద్దాపూర్ తండాలో తాగునీటి సమస్య ప్రజలను వేధిస్తోంది. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ పథకం ద్వారా తండాకు తాగునీరు అందడం లేదని సర్పంచ్ చవాన్ రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు.

**పాత ట్యాంకుకు కొత్త రంగులు..**

సిద్ధాపూర్ తండాలో ఇప్పటికే ఉన్న పాత వాటర్ ట్యాంకుకు రంగులు వేసి, దానిపై మిషన్ భగీరథ పేరు రాశారని సర్పంచ్ తెలిపారు. అయితే ట్యాంకుపై పథకం పేరు కనిపిస్తున్నప్పటికీ, తండా ప్రజలకు మాత్రం తాగునీరు అందడం లేదని పేర్కొన్నారు. గ్రామ ప్రజాప్రతినిధుల ప్రమేయం లేకుండానే ఈ ప్రక్రియ చేపట్టినట్లు సర్పంచ్ ఆరోపించారు. ట్యాంకుకు రంగులు వేసి పేరు రాసినంత మాత్రాన ప్రజల దాహం తీరదని అన్నారు.

**పైపులైన్లు ఎక్కడ.. కనెక్షన్లు ఎక్కడ?**

తండాలో మిషన్ భగీరథ పైపులైన్లు ఏర్పాటు చేయలేదని, ఇంటింటికీ నీటి కనెక్షన్లు కూడా లేవని సర్పంచ్ వివరించారు. దీంతో పథకం ద్వారా తాగునీరు పొందాల్సిన ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు అందించాలనే ప్రభుత్వ లక్ష్యం ఇక్కడ నెరవేరడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

సంబంధిత అధికారులు సిద్ధాపూర్ తండాలో పర్యటించి క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని సర్పంచ్ చవాన్ రమేష్ కోరారు. మిషన్ భగీరథ పనుల పురోగతి, పైపులైన్ల ఏర్పాటు, నీటి సరఫరా అందిచ్చుటకు కృషి చేయాలన్నారు ప్రతి ఇంటికీ తాగునీరు అందించాలి తండాలో అవసరమైన పైపులైన్లు ఏర్పాటు చేసి, ప్రతి ఇంటికీ నీటి కనెక్షన్లు కల్పించాలని సర్పంచ్ కోరారు. పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేసి, మిషన్ భగీరథ నీటిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను విజ్ఞప్తి చేశారు. ట్యాంకుపై పథకం పేరు ఉండటమే కాకుండా, ప్రజలకు వాస్తవంగా తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సిద్ధాపూర్ తండా ప్రజల తాగునీటి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.




## రైతు సేవా కేంద్రం ప్రారంభం

**ఉట్కూర్ అక్టోబర్ 12 (వుదయం ప్రతినిధి)**

మక్తల్ నియోజకవర్గం ఉట్కూరు మండలం తిప్రాస్ పల్లి గ్రామంలో డిసిఎంఎస్ రైతు సేవా కేంద్రం నూతన ఫర్టిలైజర్ షాపును తెలంగాణ రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి సతీమణి వాకిటి లలిత సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎరువులు విత్తనాలు రైతులకు అందించేందుకు ప్రభుత్వం అనుకూలంగా ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మెన్ వాకిటి మానస హన్మంతు,స్థానిక సర్పంచ్ విజయ లక్ష్మి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సూర్యప్రకాశ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా షాపింగ్ మాల్ ప్రారంభం



- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డికి ఘన సత్కారం!

**గద్వాల, అక్టోబర్ 12 (వుదయం బ్యూరో)**

గద్వాల పట్టణ వాణిజ్య రంగానికి మరో నూతన శోభ చేకూరింది. స్థానికంగా ఏర్పాటు చేసిన అత్యాధునిక షాపింగ్ మాల్ ప్రారంభోత్సవ వేడుకలు అత్యంత అట్టహాసంగా, జనాభీమానం నడుమ వైభవంగా జరిగాయి. ఈ ఘనమైన వేడుకకు గద్వాల నియోజకవర్గ శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి మాల్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా షాపింగ్ మాల్ యాజమాన్యం మరియు నిర్వాహకులు ఎమ్మెల్యేకు బ్రహ్మరథం పట్టారు. ఆయనను బహుశాబ్దాలతో కొనియాడుతూ, పట్టు శాలువాతో ఘనంగా సత్కరించి, ప్రత్యేక జ్ఞాపికను అందజేశారు. గద్వాల పట్టణ ప్రగతిలో వాణిజ్య సముదాయాల పాత్ర కీలకమని, ఇలాంటి సంస్థల రాకతో స్థానిక వ్యాపార రంగానికి సరికొత్త ఊపు లభించడమే కాకుండా, వందలాది మంది యువతకు ఉపాధి మార్గాలు సుగమమవు తాయని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో జిల్లా స్థాయి సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ విభాగాలు చెందిన కీలక నేతలు, వేలాది మంది కార్యకర్తలు, షాపింగ్ మాల్ నిర్వాహక వర్గం మరియు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని మహోజ్వలంగా విజయవంతం చేశారు.

# ఆత్మశుద్ధి.. సన్మార్గ సాధనే భవానీ దీక్ష అంతరార్థం!

**మనూరు ,అక్టోబర్ 12 (వుదయం ప్రతినిధి)**

బంజారా సోదరులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి: పౌరా దేవి పీఠాధిపతి శేఖర్ మహారాజ్





ఆత్మశుద్ధి, సన్మార్గ సాధనే భవానీ మాత దీక్ష ముఖ్య ఉద్దేశమని పౌరా దేవి పీఠాధిపతి శ్రీ శేఖర్ మహారాజ్ పేర్కొన్నారు. ఆదివారం నారాయణఖేడ్ నియోజకవర్గంలోని వెంకటాపూర్ చౌరస్తా వద్ద, ఎంపీడీవో కార్యాలయం పక్కన ఉన్న శ్రీ రామారావు మహారాజ్ ట్రస్ట్ పరిసరాల్లో బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కర్ర రమేష్ చౌహాన్ ఆధ్వర్యంలో భవానీ మాత దీక్షాధారులకు మహా భోగ్ బండారో (అన్నదాన) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పౌరా దేవి పీఠాధిపతి శేఖర్ మహారాజ్, కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రామ్ మహారాజ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

**చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి**

ఈ సందర్భంగా శేఖర్ మహారాజ్ మాట్లాడుతూ బంజారా సోదరులు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ, నియమ నిష్ఠలతో కూడిన జీవితాన్ని గడపాలని పిలుపునిచ్చారు. భవానీ మాత దీక్షను ఆచరించడం ద్వారా ఆధ్యాత్మిక చింతన పెంపొందించుకోవడంతో పాటు ఆత్మ శుద్ధి, క్రమశిక్షణ అలవడతాయని పేర్కొన్నారు.గిరిజన వికాసానికి రామారావు మహారాజ్ కృషి అమూల్యంగతంలో సరైన రహదారి సౌకర్యాలు కూడా లేని గిరిజన తండాలకు ట్రాక్టర్లు, ఆటోలు, బైక్‌లపై వెళ్లి ప్రజలకు చేరువై, వారి జీవితాల్లో మార్పు తీసుకురావడానికి సంత్ శ్రీ రామారావు మహారాజ్ విశేష కృషి చేశారని గుర్తుచేశారు. ఆయన చూపిన మార్గంలో నడుస్తూ బంజారా సమాజం ఐక్యత, విద్య, ఆధ్యాత్మికతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రామారావు మహారాజ్ ఆశీస్సులు, మార్గదర్శకత్వంతో నేడు దేశవ్యాప్తంగా బంజారా బిడ్డలు ఉన్నత విద్యను అభ్యసిస్తూ వివిధ రంగాల్లో రాణిస్తున్నారని కొనియాడారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు నాణ్యమైన విద్యను అందించి, ఉన్నత స్థాయికి ఎదిగేలా ప్రోత్సహించాలని కోరారు.

**గిరిజనుల సంక్షేమానికి నిరంతర కృషి**

బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కర్ర రమేష్ చౌహాన్ మాట్లాడుతూ నారాయణఖేడ్ నియోజకవర్గంలోని 210 గిరిజన తండాల్లో ప్రజలకు ఏ సమస్య వచ్చినా అండగా నిలుస్తున్నామని తెలిపారు. సుదీర్ఘ పోరాటాల ఫలితంగా సేవాలాల్ మహారాజ్ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేలా నిర్ణయం రావడంలో కీలక పాత్ర పోషించామని పేర్కొన్నారు. నారాయణఖేడ్ పరిధిలో ఏర్పాటు చేసిన శ్రీ రామారావు మహారాజ్ ట్రస్ట్ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి రూ.2 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. త్వరలోనే ట్రస్ట్‌ను మరింత అభివృద్ధి చేసి గిరిజన సమాజానికి ఉపయోగపడేలా తీర్చిదిద్దనున్నట్లు వెల్లడించారు.

**భక్తులతో కిక్కిరిసిన మహా భోగ్ బండారో**

ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భవానీ మాత దీక్షాధారులు, తండా నాయకులు, కార్బారీలు, పూజారీలు, బంజారా సంఘాల ప్రతినిధులు, సేవాలాల్ భక్తులు పాల్గొన్నారు. ఆధ్యాత్మికతతో పాటు విద్యాభివృద్ధి సామాజిక చైతన్యం,గిరిజన సమాజ ఐక్యతను చాటిచెప్పేలా మహా భోగ్ బండారో కార్యక్రమం ఘనంగా నిర్వహించారు

# ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

- ప్రజా సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు
- ప్రతి సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావాణి

**దుబ్బాక ప్రతినిధి, (మిరుదొడ్డి), అక్టోబర్ 12, వుదయం:**




ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు అందజేస్తూ, సమస్యల పరిష్కారానికి సాధ్యమైనంత త్వరగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక, మిరుదొడ్డి మండల పరిషత్ కార్యాలయాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వినోద్ కుమార్ మాట్లాడుతూ.

.గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజావాణి ద్వారా అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అందిన దరఖాస్తులను సంబంధిత అధికారులకు పంపించి, నిబంధనల ప్రకారం సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని వెల్లడించారు. ప్రతి సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి మండల స్థాయి అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను సమర్పించి, ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి, వ్యవసాయ అధికారి మల్లేశం,

ఎంఈఓ ప్రవీణ్ బాబు, ఎస్సై సతీష్, అటవీ శాఖ అధికారి మల్లేశం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## శివపార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహణ

**సంగారెడ్డి వుదయం.**



శివాజీ నగర్‌లో శౌర్య యువజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఉదయం శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనుముల సంతోష్-సంజన దంపతులచే కల్యాణ వేడుకను భక్తిశ్రద్ధలతో జరిపించారు.

అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్, కిరాణా అసోసియేషన్ ప్రతినిధులు, శౌర్య యువజన సంఘం సభ్యులు, కాలనీ వాసులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.

# తాగునీటి బోర్లకు రూ.15 లక్షలు.. బతుకమ్మ వేడుకలకు రూ.30 లక్షలు

- సంగారెడ్డి మున్సిపల్ సాధారణ సమావేశంలో పలు అభివృద్ధి పనులకు ఆమోదం

**సంగారెడ్డి, అక్టోబర్ 12:వు దయం.**



సంగారెడ్డి పట్టణ అభివృద్ధికి సంబంధించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కూన వనిత సంతోష్ అధ్యక్షతన సోమవారం మున్సిపల్ కార్యాలయంలో 37 అంశాలతో సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తాగునీటి సమస్య పరిష్కారానికి కొత్త బోర్ల ఏర్పాటుతో పాటు బతుకమ్మ పండుగ నిర్వహణ, వార్డుల్లో అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తూ నిర్ణయాలు తీసుకున్నారు.తాగునీటి సమస్యకు పరిష్కారంవేసవితో పాటు రాబోయే రోజుల్లో తాగునీటి కొరత తలెత్తకుండా కొత్త బోర్లు ఏర్పాటు చేసేందుకు రూ.15 లక్షలు కేటాయించారు.అలాగే పట్టణంలోని వివిధ వార్డుల్లో బతుకమ్మ పండుగ ఏర్పాట్ల కోసం రూ.30 లక్షలు కేటాయించారు. ఆయా వార్డుల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ నిధులు వెచ్చించాలని నిర్ణయించారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలుసమావేశంలో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన మంజూరు పత్రాలను అందజేశారు. దీంతో అర్హులైన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణ పనులను చేపట్టేందుకు మార్గం సుగమం కానుంది.స్వీపింగ్ మిషన్ ప్రారంభంస్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా మున్సిపాలిటీకి కేటాయించిన స్వీపింగ్ మిషన్‌ను ప్రారంభించారు. ఈ యంత్రం వినియోగంతో పట్టణంలోని రహదారుల పరిశుభ్రతను మెరుగుపరచి, పారిశుద్ధ్య నిర్వహణను మరింత పటిష్ఠం చేయనున్నట్లు తెలిపారు.వార్డుల సమస్యలపై చర్చ

సమావేశంలో పలువురు కౌన్సిల్ సభ్యులు తమ వార్డుల్లో నెలకొన్న పారిశుద్ధ్య సమస్యలు, వీధి దీపాల నిర్వహణ, తాగునీటి కొరత, ఇతర అభివృద్ధి పనులకు సంబంధించిన సమస్యలను చైర్‌పర్సన్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కూన వనిత సంతోష్ హామీ ఇచ్చారు. పట్టణ అభివృద్ధి, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు మున్సిపాలిటీ ప్రాధాన్యతనిస్తూ పనిచేస్తుందని ఆమె పేర్కొన్నారు.ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎం. శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిల్ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి జిల్లా విద్యాశాఖ, ఫౌండేషన్ ఫర్ ఫ్యూచర్ రెడీనెస్ సంస్థ మధ్య ఒప్పందం (ఎంఓయు)

**మహబూబ్‌నగర్**



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల్లో విద్యా నైపుణ్యాలు పెంపొందించడం,నాయకత్వ లక్షణాలు, ఆంగ్ల భాషా నైపుణ్యాల పెంపునకు చర్యలు: కలెక్టర్ ఖుష్బూ గుప్తామహబూబ్‌నగర్ జిల్లాలో ఎంపిక చేసిన 26 ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల్లో విద్యా నైపుణ్యాలు పెంపొందించడం, విద్యార్థుల సమస్యలు తీర్చడం, వారిలో నాయకత్వ లక్షణాలు, ఆంగ్ల భాషలో మాట్లాడే సామర్థ్యాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా తెలిపారు. ఈ కార్యక్రమాల సమర్థవంతమైన అమలుకు జిల్లా విద్యా శాఖ, ఫౌండేషన్ ఫర్ ఫ్యూచర్ రెడీనెస్ సంస్థ మధ్య సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ సమక్షంలో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు, భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను స్వయంగా ఎదుర్కొని పరిష్కరించుకునే సామర్థ్యాన్ని అభివృద్ధి చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి దోహదపడే ఈ కార్యక్రమాలను నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో భాగంగా అక్టోబర్ చివరి వారంలో, నవంబర్ నెలలో ఎంపిక చేసిన 26 పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులకు అవగాహన, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అనంతరం నాలుగు ప్రధాన అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలను అమలు చేయనున్నారు.యంగ్ ఒరేటర్స్ క్లబ్ ద్వారా విద్యార్థులకు తరగతి గదిలో, సభా వేదికలపై స్పష్టంగా, ధైర్యంగా మాట్లాడే నైపుణ్యాలను నేర్పించనున్నారు. థింక్ అండ్ మేక్ కార్యక్రమం ద్వారా సమస్యలను గుర్తించడం,

ప్రయోగాలు చేయడం, వాటికి స్వయంగా పరిష్కారాలను కనుగొనడం వంటి నైపుణ్యాలను అభివృద్ధి చేయనున్నారు. మనీ మ్యాటర్స్ కార్యక్రమం ద్వారా సంపాదన, ఖర్చులు, పొదుపు, బ్యాంకింగ్ తదితర అంశాలపై ప్రాథమిక ఆర్థిక అవగాహన కల్పించనున్నారు. కెరీర్ అవేర్‌నెస్ కార్యక్రమం ద్వారా ఉన్నత విద్యలో అందుబాటులో ఉన్న కోర్సులు, భవిష్యత్తులో ఎంచుకోదగిన వృత్తులపై విద్యార్థులకు అవగాహన కల్పించనున్నారు.ఎంపిక చేసిన పాఠశాలల్లో ఈ కార్యక్రమాల అమలు తీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, నిర్దేశించిన లక్ష్యాలను సాధించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేసేందుకు ఉపాధ్యాయులు, విద్యార్థుల సహకారం కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. సంబంధిత పాఠశాలల ఉపాధ్యాయులు, ఫౌండేషన్ ఫర్ ఫ్యూచర్ రెడీనెస్ సంస్థ ప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ, విద్యార్థులు అన్ని శిక్షణ కార్యక్రమాలకు క్రమం తప్పకుండా హాజరయ్యేలా చూడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని, జిల్లా విద్యాశాఖ అధికారి ఐ.విజయకుమారి, ఫౌండేషన్ ఫర్ ఫ్యూచర్ రెడీనెస్ సంస్థ ప్రతినిధులు కీర్తన, సంతోష్ ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# ఖబ్జా కోరల్లో కొండలు





- ఆక్రమణల కోసమే ప్రత్యేక యంత్రాల కొనుగోళ్లు
- గుట్ట ఖబ్జా చేసి కోళ్ల షెడ్ నిర్మాణం
- కాసుల మాయలో రెవెన్యూ అధికారులు

**బిజినేపల్లి, అక్టోబరు 12 (వుదయం ప్రతినిధి):**

మండల వ్యాప్తంగా ఉన్న రాళ్ల గుట్టలపై డేగ కన్ను పడిందంటూ ఇప్పటికే వివిధ పత్రికల్లో కథనాలు వచ్చినా, రెవెన్యూ శాఖలో మాత్రం చీమకుట్టినట్టు కూడా లేదు.లట్టుపల్లి పాత గ్రామ పంచాయతీ, తండాల్లో రాళ్ల గుట్టలను మాయం చేస్తూనే మరోపక్క 40 ఎకరాల వరకు వాటిని చదును చేసి స్వేచ్ఛగా వ్యవసాయ పొలాలుగా మార్చుకుంటున్నారు. రెవెన్యూ కొండలను ఖబ్జా చేయడానికి కొందరు ప్రత్యేకంగా హిటాచీ, జేసీబీ వంటి యంత్రాలను కొనుగోలు చేస్తే, ఇంకొందరు కోళ్ల షెడ్లు నిర్మించుకుంటున్నారు. వీరికి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకపోయినా రెవెన్యూ శాఖ అధికారుల అభయహస్తంతో రాళ్ల గుట్టలు, కొండలు ఖబ్జాకు గురవుతున్నాయి.ట్యాగ్ లైన్ గా అధికార పార్టీఅధికార పార్టీలో ఉంటే అధికారులు కానీ, ప్రతిపక్షాలు కానీ, కుల సంఘాలు కానీ తమ ఖబ్జాలకు, ఆక్రమణలకు అడ్డురారనే ధీమాతో లట్టుపల్లికి చెందిన ఒక ప్రధాన గిరిజన నాయకుడు చక్రం తిప్పుతున్నాడనే ఆరోపణలు ఉన్నాయి. చిన్న సారు, పెద్ద సారు అంటూ...

# ఆర్టీఐ చట్టం ప్రజలకు శక్తివంతమైన ఆయుధం

- నర్మెట్టలో సమాచార హక్కు చట్టం ఆవిర్భావ వేడుకలు

**నంగునూరు, అక్టోబర్ 12:వుదయం**



ప్రభుత్వ పాలనలో పారదర్శకత, జవాబుదారీ తనం పెంపొందించి అవినీతి రహిత సమాజ నిర్మాణానికి సమాచార హక్కు చట్టం ఎంతో దోహదపడుతుందని సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ సిద్ధిపేట జిల్లా కార్యదర్శి కట్ట ఎల్లయ్య అన్నారు. సమాచార హక్కు చట్టం ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని నంగునూరు మండలం నర్మెట్టలో సోమవార సమాచార హక్కు దినోత్సవం నిర్వహించారు.ఈ సందర్భంగా కట్ట ఎల్లయ్య మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో పౌరులకు లభించిన అత్యంత శక్తివంతమైన హక్కుల్లో సమాచార హక్కు చట్టం ఒకటని పేర్కొన్నారు. ప్రభుత్వ శాఖలు, ప్రజా సంస్థల పనితీరుపై సమాచారం తెలుసుకునేందుకు ఈ చట్టం ప్రజలకు అవకాశం కల్పిస్తుందని తెలిపారు. ప్రభుత్వ కార్యకలాపాల్లో పారదర్శకతను పెంచి, అధికారులను జవాబుదారీగా ఉంచేందుకు ఆర్టీఐ చట్టం కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు.ప్రతి పౌరుడు సమాచార హక్కు చట్టంపై అవగాహన పెంచుకోవాలని, తమ హక్కులను పరిరక్షించుకునేందుకు ఈ చట్టాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వ పథకాల అమలులో పారదర్శకతకు,

అవినీతిని అరికట్టడానికి సమాచార హక్కు చట్టాన్ని ప్రతి ఒక్కరూ ఒక ఆయుధంగా మలచుకోవాలని సూచించారు.సమాచార హక్కు చట్టం 2005 అక్టోబర్ 12 నుంచి అమల్లోకి వచ్చిందని గుర్తుచేశారు. ఈ చట్టంపై ప్రజల్లో చైతన్యం కల్పించి దాని ప్రాధాన్యతను విస్తృతంగా ప్రచారం చేసేందుకు సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ నిరంతరం కృషిచేస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి చేర్యాల సాయి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వాకిటి శేషగిరి జన్మదిన వేడుకలు
# విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ.



**మాగనూర్ అక్టోబర్ 12 (వుదయం న్యూస్)**

మంత్రి వాకిటి శ్రీహరి తమ్ముడు వాకిటి శేషగిరి పుట్టినరోజు వేడుకలు మాగనూరు మండలం అమ్మ పల్లి గ్రామంలో ఘనంగా నిర్వహించారు. మక్తల్ (మాజీ ఉపసర్పంచ్) వాకిటి శేషగిరి పుట్టినరోజు సందర్భంగా అమ్మపల్లి గ్రామానికి చెందిన గూడెం శ్రీనివాసులు అమ్మపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి వాకిటి శేషగిరి కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలో ఒకటి నుండి 5వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా గూడెం శ్రీనివాసులు మాట్లాడుతూ మంత్రి వాకిటి శ్రీహరి మక్తల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో తీసుకువెళ్తుండగా వారి తమ్ముడు వాకిటి శేషగిరి అనునిత్యం ప్రజలకు రైతుల సమస్యలపై తిరుగుతూ వారి సమస్యలను ఎక్కడికక్కడ పరిష్కరించడంలో ముందున్నటువంటి వాకిటి శేషగిరి జన్మదినాన్ని పురస్కరించుకుని పేద విద్యార్థుల విద్యకు చిన్నపాటి సహాయంగా ఈ బ్యాగుల పంపిణీ కార్యక్రమం చేపట్టడం చాలా సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, గ్రామ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించిన గూడెం శ్రీనివాసులు గారిని పలువురు అభినందించారు.

## మహిళా సాధికారతను ప్రోత్సహిస్తూ వస్త్ర బ్రాండ్
# HIDI ప్రారంభించిన నటి అనన్య నాగళ్ల

**హైదరాబాద్**



తెలుగు నటి అనన్య నాగళ్ల మహిళా సాధికారతను ప్రోత్సహిస్తూ వెళ్ళే ప్రయాణంలో మరొక మెట్టు ఎక్కారు. మహిళలను ప్రోత్సహిస్తూ ఆమె ప్రారంభించిన HIDI బ్రాండ్ లో పూర్తిగా మహిళా ఉద్యోగులే ఉండేలా చేశారు. నటి అనన్య నాగళ్ల ఇప్పటికే అనేక సినిమాలలో హీరోయిన్ గా నటిస్తూ తనదైన ముద్రను వేసుకున్నారు. సమాజ బాధ్యతగా ఆమె తన వంతు ప్రయత్నంగా ఇరు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలకు గాను రాష్ట్ర ముఖ్యమంత్రిలకు రెండున్నర లక్షల రూపాయలు రాష్ట్రంలో వరదలు వచ్చిన విపత్తు సమయంలో ఆర్థిక సాయం చేసిన తొలి మహిళా నటిగా ముందుకు వచ్చారు.

అలాగే వృద్ధులకు, మహిళలకు, చిన్న పిల్లలకు తనదైన శైలిలో సమాజ సేవ చేస్తూ ముందుకు వచ్చారు. అదేవిధంగా ఆమె తన అమ్మగారి పేరిట ఎన్నో సమాజ సేవలు చేసిన విషయం కూడా అందరికీ తెలిసిందే. అయితే ఇప్పుడు మహిళలను ప్రోత్సహిస్తూ మరోసారి ఆమె ముందుకు వచ్చారు. HIDI అనే బ్రాండ్ ద్వారా ఒక వస్త్ర బ్రాండ్ సృష్టించి దానిలో పూర్తిగా మహిళలే ఉద్యోగులుగా ఉంటారని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. ముఖ్యంగా ఈ HIDI బ్రాండ్ ద్వారా ఒమన్ ఎంపవర్మెంట్ మరింత ముందుకు వెళ్లాలని ఆమె తెలిపారు. ప్రతిరోజూ భారత దేశపు వస్త్రాలను ప్రోత్సహిస్తూ 'Everyday Indian Wear' ఉండేలా అలాగే ఫాన్సీ వస్త్రాలు కూడా దీనిలో ఉండేలా ఆమె ప్లాన్ చేస్తున్నట్లు తెలిపారు. అలాగే రోజువారి వేసుకునే కుర్తి వంటి దుస్తులు కూడా చాలా సౌకర్యమైన వస్త్రాలు HIDI లో ఉంటాయని తెలిపారు. చాలా సామాన్య మధ్యతరగతి కుటుంబం నుండి వచ్చిన అనన్య నాగళ్ల మెట్టు మెట్టు తన కష్టంతో తాను పైకి ఎక్కుతూ అభివృద్ధి చెందిన మన అనన్య భవిష్యత్తులో HIDIకి సంబంధించిన ఫ్రాంచైజ్ కూడా మొదలుపెట్టే ఆలోచనలో ఉన్నారు.

# చక్కని ఆరోగ్యం

## బరువు తగ్గాలంటే ప్రొటీనా? ఫైబరా? అసలు నిజం ఇదే!




బరువు నియంత్రణకు ఉపయోగపడే చిట్కాలు ఇంటర్నెట్‌లో ఎన్నో కనిపిస్తుంటాయి. కొందరు ఆహారంలో ఫైబర్‌ను పెంచాలని సూచిస్తే, మరికొందరు రోజువారీ ప్రొటీన్ అవసరాలను పూర్తి చేయడం తప్పనిసరి అని చెబుతుంటారు. అయితే నిజానికి ప్రొటీన్, ఫైబర్ రెండూ కడుపు నిండిన అనుభూతిని కలిగించడంలో, కొవ్వు తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. సంతృప్తి అనేది శరీరంలో జరిగే సంక్లిష్టమైన శారీరక ప్రతిస్పందన. మనం తీసుకునే మాక్రోన్యూట్రియెంట్లు సహా అనేక అంశాలు దీనిని ప్రభావితం చేస్తాయి. కడుపు నిండిన అనుభూతి కలిగినప్పుడు అవసరానికి మించి తినే అవకాశం తగ్గుతుంది. ఎక్కువసేపు సంతృప్తిగా ఉంచే ఆహారాలు ఆకలిని నియంత్రించడంతోపాటు అవసరం లేని కేలరీల తీసుకోవడం తగ్గించి బరువు నియంత్రణ, కొవ్వు తగ్గింపులో సహాయపడతాయి. బరువు తగ్గడంలో ప్రొటీన్‌కు ఉన్న ప్రాధాన్యత అందరికీ తెలిసిందే. ఇది కండరాల మరమ్మత్తు, పెరుగుదలకు అవసరమైన పోషక పదార్థం మాత్రమే కాదు, అధిక థర్మిక్ ఎఫెక్ట్ కూడా కలిగి ఉంటుంది. అంటే కొవ్వులు లేదా కార్బొహైడ్రేట్లతో పోలిస్తే ప్రొటీన్‌ను జీర్ణం చేయడానికి శరీరం ఎక్కువ కేలరీలను ఖర్చు చేస్తుంది. ప్రొటీన్ అధికంగా ఉండే ఆహారాలను తీసుకోవడం వల్ల ఎక్కువసేపు కడుపు నిండిన అనుభూతి ఉంటుంది. ఆకలిని నియంత్రించే ఘ్రెలిన్, పెప్టైడ్ వైవై వంటి హార్మోన్ల విడుదలను ప్రొటీన్ ప్రభావితం చేయడం దీనికి ఒక కారణం. తగినంత ప్రొటీన్ తీసుకున్నప్పుడు ఆకలి, తినాలనే కోరికలు తగ్గే అవకాశం ఉంటుంది. దీంతో ఆహారంలో కేలరీలను తగ్గించినా తీవ్రమైన ఆకలి అనుభూతి లేకుండా ఆహార నియమాలను పాటించడం సులభమవుతుంది. పండ్లు, కూరగాయలు, ధాన్యాలు, పప్పుధాన్యాలు వంటి మొక్కల ఆధారిత ఆహారాల్లో లభించే ఫైబర్ కూడా సంతృప్తిని కలిగించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ప్రొటీన్‌కు భిన్నంగా ఫైబర్‌ను శరీరం పూర్తిగా జీర్ణం చేసి గ్రహించదు. అది జీర్ణవ్యవస్థ ద్వారా దాదాపు అలాగే ప్రయాణిస్తుంది. ఈ ప్రక్రియ అనేక విధాలుగా కడుపు నిండిన అనుభూతిని కలిగిస్తుంది. మొదటగా, ఫైబర్ ఆహారానికి పరిమాణాన్ని పెంచుతుంది. దీంతో అధిక కేలరీలు తీసుకోకుండానే కడుపు నిండిన భావన కలుగుతుంది. రెండోది, ఇది కార్బొహైడ్రేట్ల జీర్ణక్రియను నెమ్మదిస్తుంది. ఫలితంగా రక్తంలో చక్కెర స్థాయిలు స్థిరంగా ఉండడానికి సహాయపడుతుంది. ఆకస్మికంగా చక్కెర స్థాయిలు పెరగడం, తద్వారా త్వరగా ఆకలి వేయడం వంటి పరిస్థితులను కూడా ఇది తగ్గిస్తుంది. ముఖ్యంగా కరిగే ఫైబర్‌లో కొన్ని రకాలు జీర్ణవ్యవస్థలో జెల్‌లాంటి పదార్థాన్ని ఏర్పరుస్తాయి. ఇది మరింత ఎక్కువసేపు కడుపు నిండిన అనుభూతిని కలిగించడంలో సహాయపడుతుంది. ఓట్స్, చియా విత్తనాలు, బీన్స్ వంటి ఆహారాలు కరిగే ఫైబర్‌కు మంచి వనరులు. అందువల్ల బరువు తగ్గాలనుకునే వారి ఆహారంలో వీటిని సులభంగా చేర్చుకోవచ్చు.

ప్రొటీన్, ఫైబర్ రెండింటికీ సంతృప్తి, కొవ్వు తగ్గింపులో ప్రత్యేకమైన ప్రయోజనాలు ఉన్నాయి. అయితే వీటిలో ఒకదానిని ఎంచుకోవడం కంటే రెండింటినీ కలిపి తీసుకోవడం మరింత ప్రయోజనకరం. ఫైబర్ లేకుండా కేవలం ప్రొటీన్ తీసుకుంటే ఆహారం వల్ల లభించే సంపూర్ణత, జీర్ణవ్యవస్థకు అవసరమైన ప్రయోజనాలు తగ్గుతాయి. అదే విధంగా ప్రొటీన్ తగినంత లేకుండా కేవలం ఫైబర్‌పై ఆధారపడితే కాలక్రమంలో కండరాల నష్టం జరిగే అవకాశం ఉంటుంది. అందువల్ల తగినంత ప్రొటీన్, ఫైబర్ రెండూ ఉండే సమతుల్య ఆహారం బరువు తగ్గే లక్ష్యాలను సాధించడంలో, వాటిని కొనసాగించడంలో సహాయపడుతుంది. ఈ రెండింటి మధ్య సమతుల్యత కోసం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనంలో తప్పనిసరిగా ఏదో ఒక ప్రొటీన్ వనరును చేర్చుకోవాలి. ప్లేట్‌లో సగం భాగాన్ని పిండి పదార్థాలు తక్కువగా ఉండే కూరగాయలు, పండ్లకు కేటాయించడం ద్వారా ఫైబర్‌తోపాటు అవసరమైన పోషకాలను పొందవచ్చు.

## ఉదయం అల్పాహారంలో ఇవి తింటున్నారా? రోజంతా నీరసం వస్తుంది..!

కొన్ని రోజుల్లో ఎంతో ఉత్సాహంగా అనిపిస్తే.. మరికొన్ని రోజుల్లో అలసట, నీరసం వెంటాడుతుంటాయి. ఏ పని చేయాలన్నా ఆసక్తి ఉండదు. ఇలా ఎందుకు జరుగుతుందో చాలాసార్లు అర్థం కాదు. దీనికి వాతావరణాన్ని కారణంగా కొందరు భావిస్తారు. అయితే ఉదయం మనం తీసుకునే అల్పాహారం మన జీవక్రియపై ప్రభావం చూపుతుందని పోషకాహార నిపుణురాలు అంజలి ముఖర్జీ చెబుతున్నారు. పాన్‌కేక్‌లు, పాలతో తృణధాన్యాలు, ఇడ్లీ, దోశ, ఉప్మా, పోహా లేదా పండ్ల రసం వంటి అల్పాహారం రక్తంలో చక్కెర స్థాయిలను వేగంగా పెంచుతాయని ఆమె వివరించారు. ఇలాంటి అల్పాహారం తీసుకున్నప్పుడు రక్తం లో చక్కెర పెరిగి, ఆ తర్వాత ఒక్కసారిగా పడిపోతుందని ఆమె తెలిపారు. ఇలాంటి అల్పాహారం తిన్న వెంటనే కొంతసేపు కడుపు నిండి నట్లు అనిపించినప్పటికీ, త్వరగానే మళ్లీ ఆకలి వేస్తుందని చెప్పారు. ఉదయం అల్పాహారంలో ఎక్కువ ప్రొటీన్ తీసుకోవడం వల్ల ఎక్కువసేపు కడుపు నిండిన అనుభూతి కలుగుతుందని, ఆహారంపై వచ్చే కోరికలను నియంత్రించడంలో సహాయపడుతుందని ఆమె సూచించారు. అల్పాహారంలో గుడ్డు భుర్జీ, టోఫు భుర్జీ, పనీర్ భుర్జీ, శనగపిండి చీలా వంటి సులభమైన ఆహారాలను ఆమె సూచించారు. ప్రొటీన్ అధికంగా ఉండే అల్పాహారం కండర ద్రవ్యరాశిని కాపాడుకోవడంలో, ఆహారంపై వచ్చే కోరికలను నియంత్రించడంలో, జీవక్రియకు మద్దతు ఇవ్వడంలో సహాయపడుతుందని ఆమె పేర్కొన్నారు. రోజును ప్రొటీన్‌తో ప్రారంభించాలని, జీవక్రియ అందుకు కృతజ్ఞతలు చెబుతుందని ఆమె అన్నారు. అంతకుముందు ఇచ్చిన వివరణల్లోనూ రోజంతా ఉండే అలసటను తగ్గించుకోవడానికి రోజువారీ ఆహారం, జీవనశైలిలో కొన్ని సులభమైన మార్పులు చేసుకోవాలని అంజలి ముఖర్జీ సూచించారు. పాలకూర, కాలే, మెంతికూర వంటి ఆకుకూరలతోపాటు బెర్రీలు, సిట్రస్ పండ్లు వంటి రంగురంగుల పండ్లను ఆహారంలో చేర్చుకోవాలని ఆమె సూచిం చారు. రోజును పండ్లతో ప్రారంభించి, ఆ తర్వాత ప్రొటీన్ అధికంగా ఉండే ఆహారం తీసుకోవాలని ఆమె సూచించారు. రోజును పండ్లతో ప్రారంభించాలని, పండ్లు తిన్న గంట తర్వాత కూడా ఆకలిగా ఉంటే ఒకటి లేదా రెండు గుడ్లు తీసుకోవచ్చని, కావాలనుకుంటే గుడ్డులోని తెల్లసొన మాత్రమే తీసుకోవాలని అన్నారు. అయితే మొత్తం గుడ్డు కూడా మంచిదేనని, ఆ తర్వాత టోస్ట్‌తోపాటు టమాటా, క్యారెట్, బీట్‌రూట్ రసం లేదా బూడిద గుమ్మడికాయ రసం తీసుకోవచ్చని సూచించారు. శాకాహారులు ఉదయం సుమారు 100 గ్రాముల పనీర్‌ను ఉప్పు, మిరియాల పొడి వేసి పెనంపై కాల్చుకుని తినవచ్చని, లేదా పనీర్ పరాఠా, పనీర్ భుర్జీ తీసుకోవచ్చని ఆమె సూచించారు. దీంతోపాటు ఒక గ్లాస్ కూరగాయల రసం తీసుకోవచ్చని తెలిపారు. పోషక అవసరాలను తీర్చడంతోపాటు శక్తి స్థాయిలను ఎక్కువగా ఉంచే అల్పాహారమే సరైన అల్పాహారం అని ఆమె వివరించారు.



## ఈ పండ్లు ఎందుకు తినాలంటే..!

ధర ఎక్కువనో, తరవాత తినొచ్చులే అనో మహిళలు తమ రోజువారీ ఆహారంలో భాగంగా పండ్లను తీసుకోవడం వాయిదా వేస్తుంటారు. కానీ ముప్పైల్లోకొచ్చాక కొన్ని రకాల పండ్లను తప్పక తీసుకోవాలి అంటున్నాయి పరిశోధనలు. అవేమంటే...

బొప్పాయి: ఏ, సి విటమిన్లు, ఫోలేట్, ఇతర ఫైటోకెమికల్స్ ఉండే ఈ పండు స్త్రీల ఆరోగ్యానికి చేసే మేలెంతో. ఇందులోని పపైన్ జీర్ణశక్తిని పెంచుతుంది, బీటాకెరోటిన్ కంటి ఆరోగ్యానికి ఎంతో మేలు. ముఖ్యంగా వయసుతోపాటు వచ్చే మాక్యులర్ డీజనరేషన్‌ను అడ్డుకుంటుంది. అలాగే ఇందులోని పోషకాలు మధుమేహం, హృద్రోగాలు, కడుపుబ్బరం వంటి వాటినీ నియంత్రిస్తాయి. జామ: ఇందులో విటమిన్–సి, పొటాషియం, పీచు అధికం. ఈ పోషకాలు రక్తంలో చక్కెర నిల్వల్నీ ఇన్సులిన్ నిరోధాన్నీ తగ్గించడంతోపాటు గుండె వ్యాధులు రాకుండానూ అడ్డుకుంటాయి. ముఖ్యంగా నెలసరిలో వచ్చే నొప్పుల తీవ్రతనీ తగ్గిస్తుందీ పండు.



ఆపిల్: వయసుతో సంబంధం లేకుండా ఎప్పుడైనా ఇది మేలే. ఆహారంలోని అదనపు కొవ్వుల్ని శరీరం గ్రహించడాన్ని తగ్గించేందుకు ఇందులోని పెక్టిన్ అనే పీచు సాయపడుతుంది. అంతేకాదు, ఈ పీచు జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పట్టడంతో త్వరగా పొట్ట నిండిన భావన కలిగి కొవ్వులు, చక్కెరలు ఎక్కువగా ఉండే పదార్థాలను అతిగా తినకుండా నిరోధిస్తుంది. దీర్ఘకాలంలో బరువు తగ్గడానికీ సాయపడుతుంది. క్రమం తప్పక వీటిని తినేవాళ్లను తిననివాళ్లతో పోలిస్తే గుండె జబ్బులు వచ్చే ప్రమాదం 22 శాతం తక్కువని కొన్ని పరిశోధనలు చెబుతున్నాయి.

అవకాడో: మధ్యాహ్న భోజనంతోపాటు సగం తాజా అవకాడోను తిన్న స్త్రీలలో స్నాక్స్ వంటివి తినాలనే కోరిక 40 శాతం తగ్గిందట. ఎందుకంటే ఇందులో ఆరోగ్యకరమైన మోనో అన్‌శాచ్యురేటెడ్ కొవ్వులు ఉంటాయి. ఇవి చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయి. ఇప్పుడు ఇవి మనదగ్గరా పండించడంతో విరివిగా దొరుకుతున్నాయి!

చెర్రీ: మధ్యవయసులో వచ్చే ఆర్థరైటిస్‌ను నిరోధించేందుకు చెర్రీలు ఎంతో సాయపడతాయట. వీటిల్లోని ఆంథోసైనిన్లు శక్తి స్థాయుల్ని పెంచుతాయి. అందుకే వారానికి నాలుగుసార్లు డజను చొప్పున ఈ పండ్లను తింటే మేలు. పెరుగుతో కలిపి తింటే విటమిన్లు మరింతగా ఒంటపడతాయట. అయితే ఇవి సీజన్‌లోనే దొరుకుతాయి. ఇవి మాత్రమే కాదు, మీకు అందుబాటులో ఉండే పండ్లలో ఏవైనా కూడా ఆరోగ్యానికి మేలే. వృద్ధాప్య ఛాయల్నీ తగ్గిస్తాయి. కాబట్టి కనీసం ఓ రెండు రకాల పండ్ల ముక్కల్ని రోజూ ఒకటిన్నర కప్పుల చొప్పున తీసుకోండి!

## పిత్తాశయంలో రాళ్లు ఎందుకు ఏర్పడుతాయి..



పిత్తాశయంలో రాళ్లు ఏర్పడడం చాలా మందిలో ఎలాంటి లక్షణాలు లేకుండానే జరుగుతుంది. కొందరిలో అవి పిత్త వాహికలను అడ్డుకున్నప్పుడు మాత్రమే సమస్య బయటపడుతుంది. ముఖ్యంగా అధిక కొవ్వు ఉన్న ఆహారం తీసుకున్న తర్వాత పొత్తికడుపు పైభాగంలో అకస్మాత్తుగా నొప్పి, వికారం, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తాయి. అయితే వయసు, లింగం, వంశపారంపర్యం, కొన్ని అనారోగ్య పరిస్థితులు వంటి అంశాలను మనం మార్చలేం. కానీ జీవనశైలిలో కొన్ని ఆరోగ్యకరమైన మార్పులు చేసుకోవడం ద్వారా పిత్తాశయంలో రాళ్లు ఏర్పడే అవకాశాన్ని కొంతవరకు తగ్గించుకోవచ్చని నిపుణులు తెలియజేస్తున్నారు. అందుకే రాళ్లు జీవితాంతం రాకుండా ఉంటాయని హామీ ఇచ్చే ప్రయత్నం కంటే, మార్చుకోగలిగిన ప్రమాద కారకాలపై దృష్టి పెట్టడం మంచిది. అధిక బరువు, ఊబకాయం పిత్తాశయంలో రాళ్లు ఏర్పడే ప్రమాదాన్ని పెంచుతాయి. అందువల్ల ఆరోగ్యకరమైన బరువును కొనసాగించడం ముఖ్యమే అయినప్పటికీ, బరువు తగ్గే విషయంలో తొందరపడకూడదు. ఒక్కసారిగా ఎక్కువ బరువు తగ్గడం, కఠినమైన ఆహార నియమాలు పాటించడం, ఎక్కువసేపు ఉపవాసం ఉండడం వల్ల కూడా రాళ్లు ఏర్పడే అవకాశం పెరుగుతుంది. కాబట్టి తక్కువ సమయంలో ఎక్కువ బరువు తగ్గాలనే ప్రయత్నం చేయకుండా, సమతుల ఆహారం, క్రమమైన శారీరక శ్రమతో నెమ్మదిగా బరువు తగ్గడం మంచిది. కూరగాయలు, పండ్లు, తృణధాన్యాలు, పప్పుధాన్యాలు వంటి పీచు అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలి. అదే సమయంలో డీప్‌ఫ్రై చేసిన పదార్థాలు, ప్రాసెస్ చేసిన మాంసాహారం, అధికంగా వెన్న, క్రీమ్ వంటి సంతృప్త కొవ్వులు ఉన్న ఆహారాన్ని పరిమితం చేయాలి. పిత్తాశయం ఆరోగ్యానికి క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం కూడా ఉపయోగపడుతుంది. వేగంగా నడవడం, సైక్లింగ్, ఈత, బలవర్థక వ్యాయామాలు వంటి వాటిని మనకు అనుకూలంగా క్రమం తప్పకుండా చేయవచ్చు. ప్రతిరోజూ తీవ్రమైన వ్యాయామం చేయాల్సిన అవసరం లేదు.. స్థిరంగా శారీరకంగా చురుకుగా ఉండడం ముఖ్యం. అలాగే రోజంతా తగినంత నీరు తాగడం శరీర ఆరోగ్యానికి, జీర్ణక్రియకు ఉపయోగపడుతుంది. అయితే ఎక్కువ నీరు తాగడం వల్ల పిత్తాశయంలో రాళ్లు పూర్తిగా నివారించవచ్చని చెప్పడానికి ఆధారాలు లేవు. మధుమేహం, అధిక కొలెస్ట్రాల్, మెటబాలిక్ సిండ్రోమ్ వంటి సమస్యలు ఉన్నవారు రక్తంలో చక్కెర, కొలెస్ట్రాల్, రక్తపోటు, బరువును వైద్యుల సూచనల ప్రకారం నియంత్రణలో ఉంచుకోవాలి. పిత్తాశయంలో రాళ్లు ఉన్నప్పటికీ అందరికీ లక్షణాలు కనిపించవు. అయితే తరచూ పొత్తికడుపు పైభాగంలో, ముఖ్యంగా కుడివైపు నొప్పి రావడం, కొవ్వు పదార్థాలు తిన్న తర్వాత నొప్పి పెరగడం, వికారం లేదా వాంతులు వంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకూడదు. తీవ్రమైన పొత్తికడుపు నొప్పి, జ్వరం, నిరంతర వాంతులు లేదా కళ్లు, చర్మం పసుపురంగులోకి మారడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సహాయం తీసుకోవాలి. ఆరోగ్యకరమైన బరువు, పీచు అధికంగా ఉండే సమతుల ఆహారం, క్రమమైన వ్యాయామం, జీవక్రియ సంబంధిత సమస్యలను నియంత్రణలో ఉంచుకోవడం ద్వారా పిత్తాశయంలో రాళ్ల ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చు. అయితే జన్యుపరమైన కారణాలు, వయసు, లింగం, కొన్ని అనారోగ్య పరిస్థితుల కారణంగా ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించే వారిలోనూ ఇవి ఏర్పడే అవకాశం ఉంటుందని నిపుణులు తెలియజేస్తున్నారు.

## వెల్లుల్లి.. తింటున్నారా?



ఉల్లిలాగే.. వెల్లుల్లి కూడా ఆరోగ్యానికి ఎంతో మంచిది. వెల్లుల్లిని రోజూ ఆహారంలో చేర్చుకోవడం ద్వారా పలు ఆరోగ్య ప్రయోజనాలు పొందచ్చంటున్నారు నిపుణులు.

మెరుగయ్యే రక్తప్రసరణ..

వెల్లుల్లిని ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల అది శరీరం లోపల రక్తం గడ్డ కట్టకుండా కాపాడుతుందట. ఇందులోని యాంటీ క్లాటింగ్ గుణాలే దీనికి కారణం. ముఖ్యంగా గుండె జబ్బులతో బాధపడే వారు వెల్లుల్లిని రోజూ ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల గుండెకు రక్తప్రసరణ మెరుగుపడుతుందని నిపుణులు చెబుతున్నారు. అయితే అప్పటికే మందులు వాడుతున్న వారికి ఇది ప్రత్యామ్నాయం కాదంటున్నారు. అలాగే వివిధ రకాల శస్త్రచికిత్సలు చేయించుకోబోయే వారు వెల్లుల్లి వినియోగం విషయంలో ఓసారి వైద్యుడిని సంప్రదించి తగిన సలహా తీసుకోవాలని సూచిస్తున్నారు నిపుణులు.

అధిక బరువుతో ఇబ్బందిపడేవారు వెల్లుల్లిని ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల ప్రయోజనం పొందే అవకాశాలున్నాయంటున్నారు నిపుణులు. కారణం వెల్లుల్లిలో ఉండే అలిసిన్ అనే పదార్థమే. ఇందులోని ఔషధ గుణాలు రక్తంలోని ట్రైగ్లిజరైడ్స్‌ని తగ్గించి, శరీర బరువును తగ్గించడంలో సహకరిస్తాయని చెబుతున్నారు.

వెల్లుల్లి తీసుకోని వారితో పోల్చితే.. తరచూ ఆహారంలో భాగంగా దీన్ని తీసుకునే వారిలో జలుబు, ఊపిరితిత్తులకు సంబంధించిన సమస్యలు తక్కువగా వస్తాయట. వీటితో పాటు వెల్లుల్లిలోని యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాల కారణంగా గొంతు సంబంధిత సమస్యలు బాధించవట. అందుకే గొంతు నొప్పితో బాధపడేవారు వెల్లుల్లిని ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల సమస్య నుంచి ఉపశమనం పొందవచ్చంటున్నారు నిపుణులు.

## ముందస్తు స్క్రీనింగ్‌తో ముప్పును తప్పించుకోవచ్చు!

కొలొరెక్టల్ క్యాన్సర్.. ఇది చాపకింద నీరులా వ్యాపిస్తూ పెద్దపేగు, మలాశయాన్ని కమ్మేస్తున్నది. శరీరంలో నెమ్మదిగా వృద్ధి చెందే ఈ వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలను తోడేస్తుంది. అయితే ఈ వ్యాధి క్యాన్సర్‌గా మారడానికి ముందు అంటే ప్రారంభ దశలో పాలిప్‌లు ఏర్పడతాయి. ఈ పాలిప్‌ల దశ నుంచి నెమ్మదిగా రూపాంతరం చెందుతూ క్యాన్సర్‌గా పరిణమిస్తుంది. దీనికి కొంత సమయం పడుతుంది. ఆ సమయమే రోగి జీవిత కాలాన్ని పెంచడానికి అత్యంత కీలకమైన అవకాశాన్ని కల్పిస్తుంది. ఈ సమయంలో స్క్రీనింగ్ పరీక్షల ద్వారా పాలిప్‌లను గుర్తించి తొలగించడం లేదా క్యాన్సర్‌ను తొలిదశలో గుర్తించి చికిత్స అందిస్తే ఉత్తమ ఫలితాలు ఉంటాయి. అసలు ఈ కొలొరెక్టల్ క్యాన్సర్‌ను ఎప్పుడు గుర్తించాలి, ఎలా గుర్తించాలి, ముందస్తు స్క్రీనింగ్ వల్ల రోగికి కలిగే ప్రయోజనాలు ఏంటి తదితర అంశాలను నేటి ఊపిరిలో తెలుసుకుందాం. కొలొరెక్టల్ క్యాన్సర్ స్క్రీనింగ్ ద్వారా రెండు ప్రధాన ప్రయోజనాలు ఉన్నాయి.

1. క్యాన్సర్‌గా మారే అవకాశం ఉన్న పాలిప్‌లను ముందుగానే గుర్తించి తొలగించవచ్చు.

2. ఇప్పటికే క్యాన్సర్ ఏర్పడితే తొలిదశలో గుర్తించి చికిత్స ప్రారంభించవచ్చు. దీంతో క్యాన్సర్ వచ్చే అవకాశాన్ని తగ్గించడంతో పాటు, క్యాన్సర్ వచ్చిన వారిలో మరణాల ప్రమాదాన్ని కూడా నివారించవచ్చు. కొలొనోస్కోపీ కొలొరెక్టల్ క్యాన్సర్ స్క్రీనింగ్‌లో విస్తృతంగా ఉపయోగించే పరీక్ష. గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ నిర్వహించే ఈ ప్రక్రియలో ప్రత్యేక కెమెరా సహాయంతో పెద్దపేగు, మలాశయం మొత్తం భాగాన్ని ప్రత్యక్షంగా పరిశీలిస్తారు. ఇతర స్క్రీనింగ్ పరీక్షల్లో అసాధారణ ఫలితాలు వచ్చినప్పుడు కూడా కొలొనోస్కోపీ అవసరం పడవచ్చు. పాలిప్‌లు కనిపిస్తే పరీక్ష సమయంలోనే వాటిని తొలగించే అవకాశం ఉండటం దీని ప్రధాన ప్రయోజనాల్లో ఒకటి. సాధారణ రిస్ ఉన్న వ్యక్తుల్లో కొలొనోస్కోపీ ఫలితాలు సాధారణంగా ఉంటే, తదుపరి పరీక్షకు 10 సంవత్సరాల విరామం ఉండవచ్చు. అయితే ఇతర స్క్రీనింగ్ పరీక్షలతో పోలిస్తే కొలొనోస్కోపీ పరీక్షలో పాలిప్ తొలగించినప్పుడు రక్తస్రావం లేదా పేగు గోడకు గాయం లాంటి సమస్యలు అరుదుగా సంభవించే అవకాశాలు ఉంటాయి. ఈ పరీక్ష కొలొనోస్కోపీకి దగ్గరగా ఉన్నప్పటికీ మొత్తం పెద్దపేగును పరిశీలించదు. ప్రధానంగా మలాశయం, పెద్దపేగు దిగువ భాగాన్ని స్కాన్ చేస్తుంది. గతంలో ఇది సాధారణ స్క్రీనింగ్ పద్ధతిగా ఉండేది. అయితే ప్రస్తుతం కొలొనోస్కోపీ అందుబాటులోకి రావడంతో దీని వినియోగం గణనీయంగా తగ్గింది. కంప్యూటెడ్ టోమోగ్రాఫిక్ కొలొనోగ్రఫీ (సీటీసీ)ని వర్చువల్ కొలొనోస్కోపీ అని కూడా అంటారు. ప్రత్యేక ఎక్స్ రే, కంప్యూటర్ సాంకేతికతతో పెద్దపేగు, మలాశయానికి రెండు లేదా మూడు పరిమాణాల్లో చిత్రాలను రూపొందిస్తారు. కొలొనోస్కోపీ కంటే ఇది తకువ ఇన్వేసివ్ పరీక్ష. సాధారణంగా తకువ సమయంలో పూర్తవుతుంది. కోలుకోవడానికి ప్రత్యేక సమయం అవసరం ఉండదు. అయితే చిన్న పాలిప్‌లను గుర్తించడంలో కొలొనోస్కోపీతో పోలిస్తే దీని సామర్థ్యం తకువగా ఉండవచ్చు.



## పరగడుపున ఇవి తీసుకుంటే..!

కొందరు నిద్ర లేవగానే కాఫీ లేదా టీ తాగకుండా ఉండలేరు. అయితే వీటికి బదులు పరగడుపున కొన్ని పదార్థాల్ని తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తిని పెంచుకోవచ్చని చెబుతున్నారు నిపుణులు. అంతేకాదు.. ఇలా తీసుకోవడం వల్ల మరిన్ని ఆరోగ్య ప్రయోజనాలు కూడా చేకూరతాయంటున్నారు. అవేంటో తెలుసుకుందాం రండి.. ఉసిరిలో విటమిన్–సి



అధికం గా ఉంటుంది. యాంటీ ఆక్సిడెంట్లు కూడా పుష్కలంగా లభిస్తాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచడంలో తోడ్పడతాయి. ఉసిరి గుజ్జును గోరువెచ్చని నీటిలో కలుపుకొని పరగడుపునే తీసుకోవడం వల్ల ఫలితం ఉంటుందట. పరగడుపునే గోరువెచ్చటి నీటిలో తేనె, నిమ్మరసం కలిపి తీసుకుంటే రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు శరీరంలోని హానికారక బ్యాక్టీరియా, ఇతర సూక్ష్మజీవులతో పోరాడడానికి కావాల్సిన శక్తిని శరీరానికి అందిస్తాయట. ఇలా తేనెను రోజూ ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల అధిక బరువును తగ్గించుకునే అవకాశమూ ఉంటుందంటున్నారు నిపుణులు. రోజూ తులసి ఆకులను నమలడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాల్ని సొంతం చేసుకోవచ్చు. ఐదు తులసి ఆకులను రాత్రంతా నీటిలో నానబెట్టి.. మరుసటి రోజు ఉదయం పరగడుపునే ఆ ఆకులు తిని, నీటిని తాగేయాలి. తద్వారా దగ్గు, జలుబు లాంటి ఇన్ఫెక్షన్ల నుంచి ఉపశమనం పొందచ్చు. అంతేకాదు తులసి రసం తాగితే చర్మానికి, శిరోజాలకు, దంతాలకు కూడా ఎంతో మంచిదని చెబుతున్నారు నిపుణులు.

## పార్శ్వోత్తనాసన



చేసే విధానం: మ్యాట్‌పైన విశ్రాంతిగా నిల్చొండి. తర్వాత మెల్లగా, కాళ్ల మధ్య దూరం మూడు అడుగులు ఉండేలా జరపండి. ఇప్పుడు చేతుల్ని వెనక్కి మడిచి, అరచేతులను జోడించి నమస్కార ముద్రలో ఉంచండి. ఇక్కడ నమస్కార ముద్ర పైవైపు తిరిగి ఉండాలి. ఆపై నెమ్మదిగా కుడి పాదాన్ని కుడి వైపుగా తిప్పండి. ఇప్పుడు ఎడమ పాదాన్ని 45 డిగ్రీల కోణంలో కుడివైపు తిప్పి ఉంచండి. పూర్తిస్థాయిలో కుడివైపు తిరగదు.

శరీరాన్ని ముందుకు సాగదీస్తూ గాలి వదులుతూ కుడి కాలి వైపు వంగండి. కళ్లు తెరిచి చేయండి. లేదంటే కళ్లు తిరగొచ్చు. అలాగే మోకాలికి తలను ఆన్చే ప్రయత్నం చేయండి. ఆసనంలో ఉన్నంతసేపు సాధారణ శ్వాసలు చేయండి. అక్కడ శరీరాన్ని బ్యాలెన్స్ చేస్తూ 10–12 సెకన్లు ఉండి, యథాస్థానానికి తిరిగి రండి. తర్వాత ఎడమవైపు ఆసనాన్ని పునరావృతం చేయండి. ఉపయోగాలు: జీర్ణశక్తిని పెంచుతుంది. మనసు ప్రశాంతతకు తోడ్పడుతుంది. భుజాలు, ఛాతీ, వెన్నెముక, తుంటి భాగాలకు బలం చేకూరుస్తుంది. మెదడుకి రక్తప్రసరణను పెంచుతుంది. ఒత్తిడిని దూరం చేస్తుంది. సానుకూల ఆలోచనలకు తోడ్పడుతుంది.

జాగ్రత్తలు: మోకాళ్ల సర్జరీలు అయినవాళ్లు చేయరాదు.

## సెన్సెక్స్ 548 పాయింట్లు పతనం

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాలతో ముగిశాయి. ఉదయం లాభాల్లో ప్రారంభమైన సూచీలు.. కాసేపటికే నష్టాల్లోకి జారుకున్నాయి. ఇంట్రాడే గరిష్ఠాల నుంచి సెన్సెక్స్ ఓ దశలో 1200 పాయింట్లు క్షీణించింది. ముఖ్యంగా ఎఫ్ఎంసీజీ, ఐటీ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి సూచీలపై ప్రభావం చూపింది. పీఎస్‌యూ బ్యాంక్స్, ఆయిల్ అండ్ గ్యాస్ షేర్లూ అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. సెన్సెక్స్ ఉదయం 72,771.32 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. ఆరంభంలో కాసేపు లాభాల్లో కదలాడిన సూచీ.. ఇంట్రాడేలో 72,884.25 వద్ద గరిష్ఠాన్ని తాకింది. ఆపై నష్టాల్లోకి జారుకుని 71,676.10 కనిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి 547.65 పాయింట్ల నష్టంతో 71,924.68 వద్ద స్థిరపడింది.




## యూపీఐ లావాదేవీలపై ఎండీఆర్ 0.08 శాతానికి తగ్గించాలి




యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) వాణిజ్య లావాదేవీలపై, వ్యాపారులు సంబంధిత బ్యాంకులకు చెల్లించాల్సిన రుసుము (ఎండీఆర్-మర్చంట్ డిస్కౌంట్ రేటు)ను 0.40% నుంచి 0.08 శాతానికి తగ్గించాలని ఐఐటీ-బాంబే (ఐఐటీ-బి) ప్రొఫెసర్లు ఆశిష్ దాస్, ప్రగ్యా దాస్ సిఫారసు చేశారు. బ్యాంకులు ఇప్పటికే తగినన్ని లాభాలు ఆర్జిస్తున్నందున, ఎండీఆర్ రూపేణ వసూలు చేస్తున్న మొత్తంలో బ్యాంకులకు వాటా ఇవ్వకూడదని సూచించారు. వారు రూపొందించిన నివేదిక ప్రకారం.. రూ.2,000కు మించిన వాణిజ్య లావాదేవీలపై విధించాలనుకుంటున్న 0.40% ఎండీఆర్‌ను 0.08 శాతానికి తగ్గించాలి.

ఈ 0.08 శాతంలో ఫోన్‌పే, గూగుల్‌పే వంటి థర్డ్-పార్టీ యాప్ ప్రొవైడర్ల (టీపీఏపీ)కు 0.06%, పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్ల (పీఎస్‌పీ)కు 0.02% అందించాలి. బ్యాంకులకు ఏమీ ఇవ్వనవసరం లేదు.

కాసా (కరెంట్ ఖాతా, పొదుపు ఖాతా) డిపాజిట్ల ద్వారా 2025-26లో బ్యాంకులు రూ.4.85 లక్షల కోట్ల నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) ఆర్జించాయి. ఇదంతా డిపాజిటర్ల నిధుల నుంచే లభించాయి.

యూపీఐ వ్యవస్థను నడపడానికి, మెరుగుపర్చడానికి ఈ నిధుల నుంచి 3% (రూ.15,000 కోట్లు) కేటాయించాలి. అంతేకానీ ఈ సేవల కోసం ఎండీఆర్ రాబడిపై ఆధారపడకూడదు. కోర్ బ్యాంకింగ్ సొల్యూషన్స్ (సీబీఎస్) లాగే యూపీఐని కూడా బ్యాంకులు తప్పనిసరిగా అందించాల్సిన ఒక ప్రాథమిక సేవగా మార్చే ప్రతిపాదనను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ), ప్రభుత్వం పరిశీలించాలి.

ఇతర ముఖ్య సిఫార్సులు

యూపీఐ లావాదేవీపై గరిష్ఠ ఎండీఆర్ రూ.40 మించకూడదు. అమల్లోకి రానున్న పద్ధతిలో ఈ గరిష్ఠ పరిమితి రూ.300గా ఉంది.

వార్షిక టర్నోవర్ రూ.50 కోట్లు లేదా అంతకంటే ఎక్కువ ఉన్న వ్యాపారులకే యూపీఐ ఎండీఆర్ నియమాలు పరిమితం చేయాలి.

## ఒక్క రోజే 4 మెయిన్ బోర్డు ఐపీఓలు..




అక్టోబరు 15న పబ్లిక్ ఇష్యూలు సందడి చేయనున్నాయి. ఒక్క రోజే 4 మెయిన్ బోర్డు ఐపీఓలు ప్రైమరీ మార్కెట్‌లోకి ఎంట్రీ ఇస్తున్నాయి. దాదాపు రూ.9 వేల కోట్ల (రూ.8,873 కోట్లు) నిధులను సమీకరించనున్నాయి. ముఖ్యంగా జెట్‌వర్క్ మాన్యుఫాక్చరింగ్ బిజినెస్, బోన్‌ఫిగ్లియోలి ట్రాన్స్‌మిషన్స్ కంపెనీలు ఎక్కువ నిధులను సమీకరించనున్నాయి. మరి ఆ వివరాలు పరిశీలిస్తే...

జెట్‌వర్క్ మాన్యుఫాక్చరింగ్ బిజినెస్ లిమిటెడ్ రూ.5,012 కోట్ల నిధుల సమీకరణ లక్ష్యంతో పబ్లిక్ ఇష్యూకు వస్తోంది. అక్టోబరు 15న సబ్‌స్క్రిప్షన్ ప్రారంభమై.. 19న ముగియనుంది. ఒక్కో షేరు ధర రూ.143-151గా కంపెనీ నిర్ణయించింది. యాంకర్ ఇన్వెస్టర్ల బిడ్డింగ్ అక్టోబర్ 14న తెరుచుకోనుంది. మొత్తం ఐపీఓలో రూ.2,830 కోట్ల తాజా షేర్లు, రూ.2,182 కోట్ల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ రూపంలో విక్రయిస్తున్నారు. పబ్లిక్ ఇష్యూ నిధులను రుణాల చెల్లింపులకు, ఇతర కార్పొరేట్ అవసరాలకు కంపెనీ వినియోగించనుంది. ఈ కంపెనీ విద్యుత్, పునరుత్పాదక ఇంధనం, రక్షణ, ఏఐ తదితర పరికరాలను తయారు చేస్తోంది.

ఇటలీకి చెందిన బోన్‌ఫిగ్లియోలి భారత అనుబంధ కంపెనీ బోన్‌ఫిగ్లియోలి ట్రాన్స్‌మిషన్స్ లిమిటెడ్ రూ.2,534 కోట్ల నిధులను సమీకరించనుంది. ఒక్కో షేరు ధర రూ.558-586. అక్టోబరు 15- 19 మధ్య సబ్‌స్క్రిప్షన్ కొనసాగనుంది. యాంకర్ బిడ్డింగ్ అక్టోబర్ 14న ఉంది. 4.32 కోట్ల షేర్లను పూర్తి ఆఫర్ ఫర్ సేల్ రూపంలో వాటాదారులు విక్రయిస్తున్నారు. స్టాక్ ఎక్స్ఛేంజీలో కంపెనీ షేర్లు అక్టోబరు 23న లిస్టింగ్ కానున్నాయి.

రక్షణ విద్యుత్ పరికరాలను తయారు చేసే టోన్బో ఇమేజింగ్ కంపెనీ రూ.852 కోట్ల నిధుల సమీకరణ లక్ష్యంతో అక్టోబరు 15న పబ్లిక్ ఇష్యూకు వస్తుంది. 19న సబ్‌స్క్రిప్షన్ ముగియనుంది. 1.22 కోట్ల ఈక్విటీ షేర్లను పూర్తి ఆఫర్ ఫర్ సేల్ రూపంలో విక్రయిస్తున్నారు. ధరల శ్రేణి రూ.665-700.

గుండె, రక్తనాళాలకు సంబంధించిన వైద్య పరికరాలను తయారు చేసే సహజానంద్ మెడికల్ టెక్నాలజీస్ రూ.475 కోట్ల నిధుల సమీకరణతో ఐపీఓకు వస్తుంది. అక్టోబర్ 15న సబ్‌స్క్రిప్షన్ ప్రారంభమై.. 19న ముగియనుంది. ధరల శ్రేణి రూ.327-344. యాంకర్ ఇన్వెస్టర్ల బిడ్డింగ్ అక్టోబర్ 14న తెరుచుకోనుంది. మొత్తం 1.38 కోట్ల ఈక్విటీ షేర్లను పూర్తిగా ఆఫర్ సేల్ ద్వారా విక్రయిస్తున్నారు. క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ బయ్యర్లకు 50 శాతం, నాన్ ఇన్‌స్టిట్యూషనల్ బయ్యర్లకు 15 శాతం, రిటైల్ ఇన్వెస్టర్లకు 35 శాతం చొప్పున వాటా కేటాయించారు. ఈ కంపెనీ షేర్లు అక్టోబర్ 23న స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్టింగ్ కానున్నాయి.

## అణు విద్యుత్ రంగంలోకి రూ.7.5 లక్షల కోట్ల ప్రైవేటు పెట్టుబడులు

మనదేశంలో 2047 నాటికి 100 గిగావాట్ల అణు విద్యుత్ సామర్థ్యాన్ని సాధించాలనే లక్ష్యంలో భాగస్వామ్యం అయ్యేందుకు ప్రైవేటు రంగానికి తలుపులు తెరిచినట్లు అణు శక్తి కమిషన్ (ఏఈసీ) ఛైర్మన్ అజిత్ కుమార్ మొహంతి వెల్లడించారు. ఈ రంగంలోకి ప్రైవేటు కంపెనీల నుంచి సుమారు రూ.7.5 లక్షల కోట్ల పెట్టుబడులు



వచ్చే అవకాశం ఉందని, తద్వారా 30 గిగావాట్ల విద్యుదుత్పత్తి సాకారం కావచ్చని పేర్కొన్నారు. ఒక మెగావాట్ అణు విద్యుత్ ఉత్పత్తికి సుమారు రూ.25 కోట్లు పెట్టుబడి అవసరమని ఏఈసీ ఛైర్మన్ తెలిపారు. ఇంతకుముందు ప్రభుత్వ రంగ సంస్థ న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎన్‌పీసీఐఎల్)కే పరిమితమైన ఈ రంగాన్ని, ప్రైవేటు సంస్థలకూ అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు. అయిదేళ్లలో కొన్ని ప్రైవేట్ కంపెనీలు స్వయంగా అణు రియాక్టర్లు నడుపుతాయని మొహంతి ఆశాభావం వ్యక్తం చేశారు. అణు విద్యుత్ విభాగం కింద పని చేస్తున్న ఎన్‌పీసీఐఎల్ నిర్వహిస్తున్న 24 అణు రియాక్టర్ల ద్వారా 9 గిగావాట్ల అణు విద్యుదుత్పత్తి సామర్థ్యం అందుబాటులో ఉందన్నారు. 13 గిగావాట్ల సామర్థ్యం కలిగిన మరో 17 రియాక్టర్ల నిర్మాణం వివిధ దశల్లో ఉన్నట్లు తెలిపారు. ప్రపంచంలోనే అత్యధికంగా 25 శాతం థోరియం నిల్వలు మన దేశంలో ఉన్నాయని, ఇవి మన దేశ అణు విద్యుత్ కార్యక్రమాల్లోని రెండు, మూడో దశలను విజయవంతం చేయడానికి దోహదపడతాయని వివరించారు. ఉక్కు, సిమెంటు తయారీ వంటి పారిశ్రామల విద్యుత్తు అవసరాల కోసం స్మాల్ మాడ్యులర్ రియాక్టర్ల సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలనీ యోచిస్తున్నట్లు మొహంతి వెల్లడించారు.

## ఈక్విటీ ఫండ్స్‌లోకి కొనసాగిన పెట్టుబడులు..



ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లోకి సెప్టెంబరులోనూ నిధుల ప్రవాహం కొనసాగింది. అదే సమయంలో డెట్ మ్యూచువల్ ఫండ్స్ నుంచి రికార్డు స్థాయిలో నిధులు బయటికెళ్లాయి. ఈ మేరకు సెప్టెంబరు నెలకు సంబంధించిన గణాంకాలను మ్యూచువల్ ఫండ్స్ అసోసియేషన్- యాంఫీ (AMFI) సోమవారం వెల్లడించింది. సెప్టెంబర్ నెలలో ఈక్విటీ ఆధారిత మ్యూచువల్ ఫండ్స్ స్కీముల్లోకి రూ.38,306.55 కోట్లు నిధులు వచ్చాయి. ఆగస్టు నెలతో (రూ.29,328.62 కోట్లు) పోలిస్తే 31 శాతం వృద్ధి నమోదైంది. అదే సయమంలో డెట్ మ్యూచువల్ ఫండ్స్ నుంచి ఏకంగా రూ.1.83 లక్షల కోట్లు తరలిపోయాయి. ఆగస్టు నెలలో ఈ మొత్తం రూ.8127.32 కోట్లుగా ఉంది. దీంతో నికరంగా సెప్టెంబర్‌లో మ్యూచువల్ ఫండ్స్ నుంచి రూ.1,33,214.25 కోట్ల పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు. ఆగస్టులో ఈ మొత్తం రూ.41,368.05 కోట్లుగా ఉంది.

ఈక్విటీ ఆధారిత మ్యూచువల్ ఫండ్స్‌లోని స్మాల్‌క్యాప్ ఫండ్స్ ఎక్కువ నిధులను ఆకర్షించాయి. వరుసగా మూడో నెలా స్మాల్‌క్యాప్ ఫండ్స్ మదుపర్లను ఆకర్షించాయి. ఆగస్టు నెలలో స్మాల్‌క్యాప్స్‌లోకి రూ.7,973 కోట్ల పెట్టుబడులు రాగా.. సెప్టెంబర్‌లో ఈ మొత్తం రూ.9038 కోట్లకు పెరిగింది.

## ఇ-కామర్స్ సంస్థల కొత్త రికార్డు



దసరా పండగ అంటేనే కొత్త దుస్తుల నుంచి ఎలక్ట్రానిక్ పరికరాలు, నూతన వాహనాలు కొనుగోలు చేస్తుంటారు. ఈ సీజన్‌లో విక్రయాలు భారీగా పెంచుకునేందుకు కంపెనీలు, విక్రయశాలలు, ఇ-కామర్స్ సంస్థలు కూడా బ్యాంకులతో కలిసి, విడిగా ఆఫర్లు ప్రకటిస్తుంటాయి. ఈనెల 9 నుంచి ఇ-కామర్స్ సంస్థలు రాయితీ విక్రయాలు ప్రారంభించగా, తొలి రెండు రోజుల్లోనే దాదాపు రూ.24,000 కోట్ల విలువైన వస్తువులను విక్రయించాయని కన్సల్టెన్సీ సంస్థ రెడ్‌సీర్ స్ట్రాటజీ కన్సల్టెంట్స్ అంచనా వేసింది. విలువపరంగా మొబైల్ ఫోన్లు అగ్రస్థానంలో నిలిచాయని తెలిపింది.

8-9 కోట్ల ఆర్డర్లు: అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, మీషో, అజియో సహా అన్ని ఇ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌ల్లో కలిపి వినియోగదారులు దాదాపు 8-9 కోట్ల ఆర్డర్లు పెట్టారని అంచనా. ఈ కొనుగోళ్లు చేసిన 6- 6.5 కోట్ల మంది వినియోగదారుల్లో దాదాపు మూడింట రెండొంతుల మంది ద్వితీయ శ్రేణి, గ్రామీణ ప్రాంతాల వారే ఉన్నారు. తొలిరోజు షాపింగ్ చేసిన వారిలో దాదాపు మూడో వంతు మంది జెన్-జీ యువతే. గతేడాదితో పోలిస్తే తొలిసారి ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసిన వారి సంఖ్య రెట్టింపైంది. ఈ సీజన్ మొదటి విడత 11 రోజుల విక్రయాల్లో, మొత్తం 10 కోట్ల మంది కొనుగోళ్లు చేస్తారని అంచనా.

మొత్తం అమ్మకాల విలువలో 38-40% వాటా మొబైళ్లదే. వీటి విక్రయాల విలువ రూ.9100- 9600 కోట్లుగా నమోదైంది. కన్జూమర్ ఎలక్ట్రానిక్స్ వాటా 25-27% (దాదాపు రూ.6000- 6500 కోట్లు)గా ఉంది. పెద్ద గృహోపకరణాల్లో టీవీలు, రిఫ్రిజరేటర్లు, ఎయిర్ కండీషనర్ల (ఏసీ) వాటా మూడింట రెండొంతులుగా నమోదైంది. టీసీఎల్, ఎల్‌జీ, శామ్‌సంగ్, షియామీ బ్రాండ్లకు చెందిన 55 అంగుళాల తెర కలిగిన టీవీలు, అగ్రశ్రేణి మోడళ్లలో 75 శాతానికి పైగా అమ్ముడయ్యాయి. సాధారణ రోజుల కంటే ఎలక్ట్రానిక్స్ విభాగంలో 14 రెట్ల అధిక ఆర్డర్లు వచ్చాయి. ల్యాప్‌టాప్‌లు, ఐఓటీ పరికరాలూ ముందంజలో ఉన్నాయి.

మొత్తం స్థూల వస్తువిలువ (జీఎంవీ)లో ఫ్యాషన్-లైఫ్‌స్టైల్ వాటా 15-18% (రూ.3630- 4350 కోట్లు). వార్షిక ప్రాతిపదికన ఈ విభాగం 22-25% వృద్ధి నమోదుచేసింది.

సాధారణ రోజువారీ సగటుతో పోలిస్తే క్విక్ కామర్స్ విభాగంలో 4-5 రెట్లు అధిక జీఎంవీ నమోదైంది.




## ఉదయ్‌వీర్‌కు స్వర్ణం



ఐఎస్ఎస్ఎఫ్ షూటింగ్ ప్రపంచకప్‌లో భారత షూటర్ ఉదయ్‌వీర్ సిద్ధు సత్తాచాటాడు. ఆదివారం పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్‌లో అతడు పసిడి పతకం చేజిక్కించుకున్నాడు. ఫైనల్లో 24 ఏళ్ల ఉదయ్‌వీర్ 240.6తో అగ్రస్థానంలో నిలిచాడు. జర్మనీ షూటర్ క్రిస్టియన్ రీజ్ (240.1) రజతంతో సరిపెట్టుకున్నాడు. అయితే 0.5 పాయింట్ల తేడాతో ఉదయ్‌వీర్ విజయం సాధించడం మాత్రం అద్భుతమే. చివరి రెండు షాట్లకు ముందు అతడు 0.3 పాయింట్లు వెనుకంజలో ఉన్నాడు. తీవ్ర ఒత్తిడి ఉన్న ఈ స్థితిలో గురి తప్పకుండా బుల్లెట్ దించాడు. ఆఖరి రెండు షాట్లకు 10.2, 9.8 స్కోరు చేసి స్వర్ణ రేసులో నిలిచాడు. ప్రత్యర్థి ఆఖరి రెండు ప్రయత్నాల్లోనూ 9.6 పాయింట్లే స్కోరు చేయడంతో ఉదయ్‌వీర్ సంబరాల్లో మునిగిపోయాడు. పావోలో మోనా (219.8) కాంస్యం దక్కించుకున్నాడు.

## అభిషేక్ శర్మపై 'ప్లాన్-బి'.. పనిచేయలేదు: వెస్టిండీస్ ఆల్‌రౌండర్

వెస్టిండీస్‌తో జరిగిన మూడో టీ20లో భారత్ విజయం సాధించి సిరీస్‌లో ఆధిక్యంలోకి వెళ్లింది. ఇండోర్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో టీమ్ఇండియా ఓపెనర్ అభిషేక్ శర్మ (69; 30 బంతుల్లో 6×4, 5×6) ధనాధన్ ఇన్నింగ్స్‌తో మెరిపించాడు. అతడి బ్యాటింగ్‌పై వెస్టిండీస్ ఆల్‌రౌండర్ షమార్ స్ప్రింగర్ మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.



అభిషేక్ కోసం తమ టీమ్ 'ప్లాన్-బి'ని అమలు చేసిందని, అయితే అది పనిచేయలేదని అన్నాడు. ''అభిషేక్ వరల్డ్ క్లాస్ ఆటగాడు. అతడి బ్యాటింగ్ అద్భుతంగా ఉంది. ఈ మ్యాచ్‌లో అభిషేక్ కోసం మేం ప్లాన్-బిని ఉపయోగించాం. అతడి విషయంలో రక్షణాత్మకంగా ఉంటూ.. సాధ్యమైనంత మేర సింగిల్స్, డబుల్స్‌కే పరిమితం చేయాలనుకున్నాం. అయితే, అది అంతగా పని చేయలేదు. అభిషేక్ మొదటి నుంచి దూకుడుగా ఆడటం భారత్ జట్టుకు కలిసొచ్చింది'' అని స్ప్రింగర్ వ్యాఖ్యానించాడు. ఇక, లక్ష్య ఛేదనలో భారత బౌలర్లు రాణించారని కరేబియన్ ఆల్‌రౌండర్ అన్నాడు. తాము కొన్ని బంతులను పరుగులుగా మల్చలేకపోయామని, అప్పుడే గేమ్ తమకు దూరమైందని అభిప్రాయపడ్డాడు.

మరోవైపు, వెస్టిండీస్ ప్లాన్‌పై అభిషేక్ శర్మ కూడా స్పందించాడు. ''నా విషయంలో వారు ప్రణాళిక మార్చుకున్నారని అర్థమైంది. అందుకే ఆఫ్ స్పిన్నర్‌తో ఆ జట్టు బౌలింగ్ దాడిని ప్రారంభించింది. అందుకు తగినట్లుగానే తొలి ఓవర్‌లో బౌలర్ అద్భుతంగా బంతులేశాడు. అయితే, పవర్‌ప్లేలో నేను తక్కువ పరుగులు చేస్తే టీమ్‌కు నష్టమని తెలుసు. అందుకే వారి వ్యూహం కంటే మెరుగ్గా ఆడక తప్పదని అర్థమైంది'' అని టీమ్ఇండియా ఓపెనర్ వివరించాడు. వెస్టిండీస్ విధ్వంసక జట్టు అని, వారితో ఆడుతున్నప్పుడు ఎప్పుడూ అలసత్వం ప్రదర్శించడం సరికాదని అభిషేక్ అన్నాడు.

## వెస్టిండీస్‌తో మూడో టీ20.. భారత్ విజయం

వెస్టిండీస్‌తో జరిగిన మూడో టీ20లో భారత్ 14 పరుగుల తేడాతో విజయం సాధించింది. 224 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన వెస్టిండీస్ 209/7 స్కోరుకు పరిమితమైంది. హెట్‌మయర్ (43; 26 బంతుల్లో), కమిల్ పూరన్ (42; 27 బంతుల్లో), షమర్ స్ప్రింగర్ (35★; 11 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్స్‌లు), రూథర్‌ఫోర్డ్ (32), సాంప్సన్ (21) పరుగులు చేశారు. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్ 3, నమన్ ధీర్ 2, అక్షర్ పటేల్, నితీశ్ రెడ్డి ఒక్కో వికెట్ పడగొట్టారు. ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్ భారత్ 2-1 ఆధిక్యంలో నిలిచింది. నాలుగో టీ20 బుధవారం హైదరాబాద్‌లో జరగనుంది.



అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 223 పరుగులకు ఆలౌట్ అయింది. అభిషేక్ శర్మ (69; 30 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్స్‌లు) అదరగొట్టాడు. ఇషాన్ కిషన్ (37; 18 బంతుల్లో), తిలక్ వర్మ 28, నితీశ్ రెడ్డి 21, అక్షర్ పటేల్ 20 రన్స్ చేశారు. అభిషేక్, ఇషాన్ రెండో వికెట్‌కు 40 బంతుల్లో 108 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి జట్టు భారీ సాధించడానికి బాటలు వేశారు. వెస్టిండీస్ బౌలర్లలో రోస్టన్ చేజ్, షమర్ స్ప్రింగర్, జోసెఫ్ తలో 2 వికెట్లు పడగొట్టారు. గుడకేశ్ మోటి, కీమో పాల్ చెరో వికెట్ తీశారు.

## బాలికల కోసం స్మృతి మంధాన..

భారత మహిళల క్రికెట్ కెప్టెన్ స్మృతి మంధాన.. యునిసెఫ్ ఇండియా సెలబ్రిటీ అడ్వకేట్‌గా నియమితురాలైంది. ఆదివారం అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా యునిసెఫ్ ఈ విషయాన్ని ప్రకటించింది. యుక్త వయసు బాలికల సాధికారత, ఆరోగ్యం కోసం పాటుపడడం, వాళ్లు అవకాశాలను అందిపుచ్చుకునేలా చేయడం, సమాన



హక్కులపై అవగాహన కల్పించడం సెలబ్రిటీ అడ్వకేట్‌గా స్మృతి విధులు. ''యునిసెఫ్, ఇండియా సెలబ్రిటీ అడ్వకేట్‌గా ఎంపిక కావడాన్ని గొప్ప గౌరవంగా భావిస్తున్నా. ప్రతి కల ఒక అవకాశంతోనే మొదలవుతుందని క్రికెటర్‌గా ఎదిగే క్రమంలో తెలుసుకున్నా. కఠోర శ్రమ, అంకిత భావం, ప్రోత్సాహంతో ఆ అవకాశం మనల్ని మరో దశకు తీసుకెళ్తుంది. బాలలు ఇలాంటి అవకాశాలకు అర్హులు'' అని స్మృతి తెలిపింది. భారత క్రికెట్ దిగ్గజం సచిన్ తెందుల్కర్ ప్రస్తుతం యునెసెఫ్ దక్షిణ ఆసియా ప్రాంతీయ సుహృద్భావ రాయబారిగా ఉన్నాడు. ''యునిసెఫ్ ఇండియా కుటుంబంలోకి స్మృతికి స్వాగతం, మైదానంలో నువ్వు లక్షల మందికి స్ఫూర్తినిచ్చావు. మైదానం వెలుపల బాలల హక్కుల కోసం నీ గళాన్ని వినిపిస్తావని ఆశిస్తున్నా'' అని స్మృతిని ఉద్దేశించి సచిన్ అన్నాడు.

## క్రికెట్లో సృజనాత్మకత పెరిగింది: రైనా

భారత అగ్రశ్రేణి ఆటగాళ్ల బ్యాటింగ్ శైలి భిన్నంగా ఉండడం వల్ల క్రికెట్ మరింత సృజనాత్మకంగా మారిందని టీమ్ఇండియా మాజీ బ్యాటర్ సురేశ్ రైనా అన్నాడు. ''క్రికెట్ మరింత సృజనాత్మక ఆటగా మారింది. అభిషేక్ బాగా బ్యాటింగ్ చేస్తున్నాడు. శుభ్‌మన్ సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. రోహిత్, కోహ్లి వన్డేల్లో భిన్నంగా ఆడుతున్నారు. ఇప్పుడు చాలా మంది కోచ్‌లు ఉండడం మన అదృష్టం. భిన్నంగా, నిర్భీతిగా ఆడే ఆటగాళ్లు భారత జట్టులో చాలా మంది ఉన్నారు. వాళ్లు గొప్పగా ఆడుతున్నారు. ఒత్తిడిని బాగా తట్టుకుంటున్నారు'' అని రైనా అన్నాడు. చాలా ఏళ్ల తర్వాత భారత జట్టులోకి పునరాగమనం చేసిన వెటరన్ పేసర్ భువనేశ్వర్‌ను అతడు అభినందించాడు. ఇటీవల అతడు గొప్పగా రాణించాడని రైనా అన్నాడు.



''భువి దేశవాళీ క్రికెట్ ఆడాడు. నేను అతడితో మాట్లాడా. భువి తీరికలేకుండా క్రికెట్ ఆడతాడు. అతడి కష్టానికి ఫలితం దక్కింది. అతడు క్రమశిక్షణగల బౌలర్'' అని చెప్పాడు.

# పవన్ కళ్యాణ్‌కు అల్లు అరవింద్ అభినందనలు



**వుదయం సినిమా:** సినీ రంగంలో పవన్ కళ్యాణ్ 30 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ ఆయనకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్‌తో కలిసి చేసిన తొలి సినిమా "అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి" నుంచి ఇప్పటి వరకు సాగిన ప్రయాణాన్ని గుర్తు చేసుకున్నారు. మూడు దశాబ్దాల కాలం ఇంత త్వరగా గడిచి పోయిందా అని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. సినీ రంగంలో పవన్ కళ్యాణ్ సాధించిన విజయాలను అభినందిస్తూ, ఆయన ఎంచుకునే ప్రతి మార్గంలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. సినిమాలకే పరిమితం కాకుండా సమాజం పట్ల పవన్ కళ్యాణ్‌కు ఉన్న దూరదృష్టిని కూడా అల్లు అరవింద్ ప్రశంసించారు. సినిమా రంగం వెలుపల కూడా ఆయన చేస్తున్న సేవలను, సమాజం కోసం అందిస్తున్న తన వంతు కృషిని అభినందించారు.పవన్ కళ్యాణ్ సినీ ప్రయాణం మరింత విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షిస్తూ, మరోసారి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో ఆయన చేపట్టే కార్యక్రమాలన్నీ విజయవంతం కావాలని కోరుకుంటూ తన ఆశీస్సులు అందించారు. సినిమా రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న పవన్ కళ్యాణ్, ప్రస్తుతం సినీ రంగంతో పాటు ప్రజా జీవితంలోనూ తనదైన పాత్ర పోషిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన 30 ఏళ్ల సినీ ప్రస్థానం ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది.

## వుదయం సినిమా — MOVIE TIME!

# 'AA23'పై స్పెషల్ అప్‌డేట్..



**వుదయం సినిమా:** ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా స్టార్ డైరెక్టర్ లోకేష్ కనకరాజ్ తెరకెక్కించనున్న చిత్రం 'AA23'. ఈ మూవీ ప్రకటనతో రీసెంట్‌గా సోషల్ మీడియాలో భారీ సందడి నెలకొన్న సంగతి తెలిసిందే..ప్రాజెక్ట్ అనౌన్స్‌మెంట్ వచ్చినప్పటి నుంచి దేశవ్యాప్తంగా సినీ ప్రేక్షకుల్లో ఆసక్తి పెరిగింది. అల్లు అర్జున్, లోకేష్ కనకరాజ్ క్రేజీ కాంబినేషన్‌లో సినిమా రాబోతుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై హ్యూజ్ ఎక్స్‌పెక్టేషన్స్ క్రియేట్ అయ్యాయి.రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ కంపోజ్ చేసిన అనౌన్స్‌మెంట్ సాంగ్ విడుదలైన కొద్ది సేపటికే సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అభిమానులు, సినీ ప్రియుల మధ్య ఈ పాట హాట్ టాపిక్‌గా నిలిచింది. భారీ స్థాయిలో తెరకెక్కనున్న ఈ ప్రాజెక్ట్‌లో అల్లు అర్జున్, లోకేష్ కనగరాజ్, అనిరుధ్ వంటి స్టార్స్ వర్క్ చేస్తుండటంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు సంబంధించిన మరిన్ని విశేషాలు ఎప్పుడు వెల్లడవుతాయా అని ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.తాజాగా దర్శకుడు లోకేష్ కనగరాజ్ 'AA23' సినిమాకు సంబంధించి ఓ స్పెషల్ అప్‌డేట్‌ను షేర్ చేసి సినిమాపై ఆసక్తిని మరింత పెంచారు. లోకేష్ కనగరాజ్ షేర్ చేసిన ఫొటోలో అల్లు అర్జున్‌కు ఆయన ఏదో వివరిస్తూ కనిపిస్తున్నారు.

# #మైత్రీ ఇన్ లవ్ ఫస్ట్ లుక్



**వుదయం సినిమా:** జై జాస్తి, మేధ మేక ను హీరో హీరోయిన్లుగా పరిచయం చేస్తూ, పృథ్వీ వనం దర్శకత్వంలో, మహేష్ బాబు పి. క్రియేటర్ గా మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణంలో న్యూ ఏజ్ రొమాంటిక్ కామెడీ #మైత్రీ ఇన్ లవ్ ఘనంగా ప్రారంభం– బ్యూటిఫుల్ ఫస్ట్ లుక్ రిలీజ్భారతీయ సినీ పరిశ్రమలో ప్రముఖ నిర్మాణ సంస్థల్లో ఒకటైన మైత్రీ మూవీ మేకర్స్ 'శ్రీమంతుడు', 'జనతా గ్యారేజ్', 'రంగస్థలం', 'పుష్ప', 'ఇరుముడి' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలతో ప్రత్యేకమైన ముద్ర వేసింది. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నేతృత్వంలోని ఈ ప్రతిష్ఠాత్మక నిర్మాణ సంస్థ.. టాప్ స్టార్స్ తో భారీ బడ్జెట్ చిత్రాలను నిర్మిస్తూనే, కొత్త ప్రతిభను ప్రోత్సహిస్తూ, బలమైన కథాంశాలతో రూపొందే చిన్న, మీడియం సినిమాలకు కూడా అండగా నిలుస్తోంది. జాతీయ అవార్డు అందుకున్న మ్యూజికల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'ఉప్పెన'తో వైష్ణవ్ తేజ్, కృతి శెట్టిలను జంటగా పరిచయం చేసిన ఈ నిర్మాణ సంస్థ.. ఇప్పుడు మరో ఆసక్తికరమైన ప్రేమకథను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తోంది. #మైత్రీ ఇన్ లవ్ గా రూపొందుతున్న ఈ చిత్రంతో ఎన్నో ఏళ్లుగా సినిమా కలలు కంటూ, నేర్చుకుంటూ, తమ ప్రతిభను మెరుగుపరుచుకున్న కొత్తవారు సినీ రంగంలోకి అడుగుపెడుతున్నారు.న్యూ ఏజ్ రొమాంటిక్ కామెడీగా రూపొందుతున్న ఈ చిత్రం.. ఓ అబ్బాయి, అమ్మాయి మధ్య ఉండే విలక్షణమైన బంధాన్ని ప్రేమ, హాస్యం, కుటుంబ భావోద్వేగాల మేళవింపుతో అలరించనుంది. సహజమైన భావోద్వేగాలు, ఆసక్తికరమైన కథనంతో అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఈ సినిమాను రూపొందిస్తున్నారు. జై జాస్తి, మేధ మేక జంటగా పరిచయం అవుతున్న ఈ ప్రాజెక్ట్‌పై నిర్మాణ సంస్థ ఎంతో నమ్మకంతో ఉంది. ఈ కొత్త ప్రేమకథను వెండితెరపై ఆవిష్కరించేందుకు చిత్ర బృందం ఆసక్తిగా ఎదురు చూస్తోంది.'30 వెడ్స్ 21', 'మిడిల్ బెంచ్ రవి' వంటి పాపులర్ వెబ్ సిరీస్‌లకు దర్శకత్వం వహించి గుర్తింపు తెచ్చుకున్న పృథ్వీ వనం ఈ సినిమాతో ఫీచర్ ఫిల్మ్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు.

# #జనవరి 12 విడుదల' ఊటీలో కీలక షెడ్యూల్ ప్రారంభం

**వుదయం సినిమా:** విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్, హిట్ మెషీన్ అనిల్ రావిపూడి సక్సెస్ ఫుల్ కాంబినేషన్ లో తెరకెక్కుతున్న చిత్రం 'జనవరి 12 విడుదల'. ఈ సినిమా తాజా షెడ్యూల్‌ను చిత్ర బృందం ఊటీలో ప్రారంభించింది. సుందరమైన ప్రకృతి అందాల నడుమ ఈ షెడ్యూల్ జరగనుంది.షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని సురేష్ ప్రొడక్షన్స్, శ్రీమతి అర్చన, జీ స్టూడియోస్ సమర్పిస్తున్నాయి. వెంక టేష్ సరసన కీర్తి సురేష్, కళ్యాణ్ రామ్ సరసన కృతి శెట్టి కథానాయికలుగా నటి స్తున్నారు. వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్, కీర్తి సురేష్, కృతి శెట్టి, అజయ్ ఘోష్, ఉపేంద్ర లిమాయే సహా ప్రధాన తారాగణమంతా ఈ షెడ్యూల్‌లో పాల్గొంటున్నారు.ఈ షెడ్యూల్‌లో రెండు అద్భుతమైన పాటలతో పాటు కథలో కీలకమైన పలు సన్నివేశాలను చిత్రీకరించనున్నారు. ఊటీలోని ప్రకృతి అందాలు ఈ సన్నివేశాలకు మరింత ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.పాటలతో పాటు కథను ముందుకు నడిపించే కీలక సన్నివేశాలను ఈ షెడ్యూల్‌లో చిత్రీకరించనున్నారు. వెంకటేష్, నంద మూరి కళ్యాణ్ రామ్, అనిల్ రావిపూడి విజయవంతమైన కాంబినేషన్‌లో వస్తున్న ఈ ఎంటర్‌టైనర్‌పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి.ఈ చిత్రం జనవరి 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. సంక్రాంతి సీజన్ అనిల్ రావిపూడికి సక్సెస్‌ఫుల్ విండోగా నిలుస్తూ వస్తోంది. తన సినిమాలను వరుసగా ఫెస్టివ్ సీజన్‌లో విడుదల చేస్తూ బలమైన కమర్షియల్ ఎంటర్‌టైనర్స్‌ను అందించిన అనిల్ రావిపూడి.. ఈసారి 'జనవరి 12 విడుదల'తో అద్భుతమైన కమర్షియల్ ఎంటర్‌టైనర్ అందించబోతున్నారు.



# 'జో జో' కాషన్ 1.. ఇంట్రెస్టింగ్ కాన్సెప్ట్



**వుదయం సినిమా:** కృష్ణ కమల్, మహి హీరో హీరోయిన్లుగా రూపొందుతోన్న రూరల్ కామెడీ డ్రామా 'జో జో'. రాయలసీమ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతోన్న ఈ సినిమా ప్రముఖ దర్శకుడు దేవకట్టా సమర్పణలో కిరణ్ జయ్ కుమార్ దర్శకుడిగా రూపొందుతోంది. విజయం బ్యానర్‌పై విజయ్ కృష్ణ లింగమనేని ఈ సినిమాను నిర్మిస్తున్నారు. వైవిధ్యమైన చిత్రాలకు ప్రేక్షకులు బ్రహ్మరథం పడుతున్న ఈ క్రమంలో 'జో జో' సినిమా ఆడియెన్స్‌ను అలరించటానికి సిద్ధమైంది. సోమవారం కాషన్ 1 పేరుతో ఈ సినిమా కంటెంట్ ఏంటనే విషయాన్ని తెలియజేస్తూ ఓ వీడియో గ్లింప్స్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. రాయలసీమలోని జొన్నగిరి నేపథ్యంలో తెరకెక్కుతోన్న సినిమా. వర్షాలు పడినప్పుడు అక్కడ వజ్రాలు దొరుకుతాయనే వార్తలు మనం వినే ఉంటాం. ఆ పాయింట్‌ను ఆధారంగా చేసుకుని రూరల్ లవ్ స్టోరీగా కామెడీ టచ్‌తో మేకర్స్ 'జో జో' సినిమాను మన ముందుకు తీసుకొస్తున్నారు. ఈ కాషన్ వీడియో గమనిస్తే.. మనోభావాల బ్యాచ్ దూరంగా ఉండండి అనే క్యాప్షన్‌తోనే ఇది మొదలవుతుంది. వర్షం పడిన తర్వాత పొలంలో హీరో హీరోయిన్‌తో పాటు కొందరు వజ్రాలను వెతుకుతుంటారు. హీరోయిన్‌కు ఓ రాయి దొరకుతుంది. ఆమెను ప్రేమించే హీరో ఆమె దగ్గరకు వచ్చి మాట్లాడే ప్రయత్నం చేస్తాడు. అయితే ఆమె అతడ్ని ఓ బూతు మాటతో నోరు మూయించేస్తుంది. ఆ మాట విని హీరోతో పాటు.. అక్కడున్న హీరో ఫ్రెండ్ కూడా షాకవుతాడు. అయితే హీరో దాన్ని కూడా మోటు సరసం అంటూ కవర్ చేయటం.. చూస్తే నవ్వు తెప్పిస్తుంది. రా రస్టిక్ రొమాంటిక్ మూవీ త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. కాషన్ వన్ వీడియోతో సినిమాపై మేకర్స్ క్యూరియాసిటీ క్రియేట్ చేశారు.

# 'బా బా బ్లాక్ షీప్' చిత్రానికి మంచి రెస్పాన్స్ వచ్చింది..

**వుదయం సినిమా:** దోనేపూడి చక్రపాణి సమర్పణలో చిత్రాలయం స్టూడియోపై గుణి మంచికంటి దర్శకుడిగా వేణు దోనేపూడి నిర్మించిన చిత్రం 'బా బా బ్లాక్ షీప్'. ఈ క్రమంలో నిర్మాత వేణు దోనేపూడి మీడియాతో చిత్రానికి సంబంధించిన విశేషాల్ని పంచుకున్నారు. ఆయన చెప్పిన సంగతులివే..



నిర్మాత వేణు దోనేపూడి

**మీ నేపథ్యం గురించి చెప్పండి?**

మా తాత గారు థియేటర్ నడిపించేవారు. మా నాన్న గారు థియేటర్‌ను కొన్నేళ్ల క్రితమే క్లోజ్ చేశారు. సినీ రంగంతో మా ఫ్యామిలీకి పరిచయం ఉంది. 90వ దశకంలో యూఎస్‌లో ఆటో మొబైల్ బిజినెస్ చేశాను.

**'విశ్వం'తో ఏం నేర్చుకున్నారు?**

'మనం' తర్వాత గోపీ మోహన్ గారు, శ్రీను వైట్ల గారు పరిచయం అయ్యారు. అలా 'విశ్వం' జర్నీ మొదలైంది. అతి మంచితనం పనికి రాదు అని ఆ ప్రయాణంలో తెలిసింది.

**ఇంత నేపథ్యం ఉండి కూడా ఆలస్యంగా ఇండస్ట్రీలోకి ఎందుకు వచ్చారు?**

ఇండస్ట్రీ ఎలా ఉంటుంది.. ఇక్కడి పరిస్థితులు ఏంటి? అన్నది మా ఫ్యామిలీకి తెలుసు. అవసరమా? అని అందరూ నన్ను ఆపారు. సినిమాల వల్ల కూడా గౌరవం వస్తుంది కదా అని నేను ఇండస్ట్రీలోకి వచ్చాను.

# "క్రేజీ కల్యాణం" ట్రైలర్ లాంఛ్

**వుదయం సినిమా:** 'నవరసరాయ' డా. నరేష్ విజయ కృష్ణ, అనుపమ పరమేశ్వరన్, తరుణ్ భాస్కర్, రాజ్ వెడ్స్ రాంబాయి ఫేమ్ అఖిల్ ఉడ్డెమారి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా "క్రేజీ కల్యాణం". ఈ చిత్రాన్ని యారో సినిమాస్ బ్యానర్ పై ప్రొడక్షన్ నెం. 2గా ప్యాషనేట్ ప్రొడ్యూసర్ బూసం జగన్ మోహన్ రెడ్డి నిర్మిస్తున్నారు. దర్శకుడు బద్రప్ప గాజుల రూపొందిస్తున్నారు. ఈ నెల 16న "క్రేజీ కల్యాణం" సినిమా వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. ఈ రోజు ఈ చిత్ర ట్రైలర్ లాంఛ్ ఈవెంట్ ను హైదరాబాద్ లో ఘనంగా నిర్వహించారు. ప్రముఖ నిర్మాతలు దిల్ రాజు, బన్నీ వాస్, డైరెక్టర్ నందినీరెడ్డి ఈ కార్యక్రమంలో అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగాప్రొడ్యూసర్ బన్నీ వాస్ మాట్లాడుతూ – నేను "క్రేజీ కల్యాణం" సినిమా చూశాను చాలా ఎంటర్ టైన్ చేసింది. ఈ పండుగకు ఫ్యామిలీ ఆడియెన్స్ అందరూ ఈ సినిమా చూస్తూ ఎంజాయ్ చేస్తారు. నరేష్, తరుణ్ భాస్కర్ తమ పర్ ఫార్మెన్స్ తో ఇరగదీశారు. ఈ సినిమా చూసి బయటకు వచ్చే ప్రేక్షకులకు ఇంటర్వెల్ సీన్ బాగా గుర్తుండిపోతుంది. అనుపమ అద్భుతంగా నటించింది. కేరళ నుంచి వచ్చి తెలుగు నేర్చుకుని తెలంగాణ యాసలో మెప్పించిన హీరోయిన్స్ లో సాయి పల్లవి తర్వాత అనుపమ ఉంటారు. ప్రొడ్యూసర్ జగన్ మోహన్ ప్యాషన్ తో ఈ సినిమా నిర్మించారు. సురేష్ బొబ్బిలి తెలంగాణ నుంచి వచ్చిన టెక్నీషియన్స్ లో ఆణిముత్యం. ఈ సినిమా మంచి విజయం సాధించి టీమ్ అందరికీ పేరు తీసుకురావాలి. అన్నారు.ప్రొడ్యూసర్ దిల్ రాజు మాట్లాడుతూ – ఈ ఈవెంట్ కోసం చెన్నై నుంచి వచ్చాను. ప్రొడ్యూసర్ జగన్ మోహన్ ఈ సినిమా చేస్తున్నప్పటి నుంచి ఈ మూవీ గురించి చెప్పాడు.




Printed, Published & Owned by SIRIKONDA MARIA, Printed at ASHISH PUBLICATIONS H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-7-25/5, Risalagadda,RTC X Roads, Hyderabad - 500020, Telangana.
Editor : SIRIKONDA AUGUSTIN. RNI No.: TELTEL/2000/00272. E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676. Telefax: 040-27678676.